ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 10.07.2024 | సంపుటి : 10 సంచిక : 361 | పేజీలు : 12 వెల: రూ. 4/-

RNI NO.APTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## దమ్ముంటే పరీక్షల వాయిదాకు

# నిరాహార దీక్షకు కూర్చోండి

## కేటీఆర్, హరీశ్‌లకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్

- నిరుద్యోగులకు న్యాయం చేసేందుకే వాయిదా వేయడం లేదు
- మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో పిలవాలనే డిమాండ్ సరికాదు
- ఇదే విధంగా నిర్వహిస్తే కోర్టు మళ్లీ రద్దు చేస్తుంది
- దీని వెనక ప్రతిపక్షాలు, కోచింగ్ సెంటర్ల కుట్రదాగి ఉంది
- మండిపడ్డ ముఖ్యమంత్రి

హైదరాబాద్,జూలై9(జనంసాక్షి): గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో పిలవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ వెనుక ప్రతిపక్షాల కుట్ర ఉంది. గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో పిలిస్తే మళ్లీ కోర్టుకు వెళ్తారు. నోటిఫికేషన్‌లో లేకుండా 1:100 నిష్పత్తిలో ఎలా పిలుస్తారని కోర్టు మళ్లీ రద్దు చేస్తుంది. పదే పదే పరీక్షలు రద్దు చేయాలని ప్రతి పక్షం కుట్ర చేస్తోంది. పరీక్షలు వాయిదా వేయాలనే డిమాండ్ వెనుక కోచింగ్

మిగతా 2లో..

## ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సహకరించండి

జాతీయ రహదారుల నిర్మాణానికి పూర్తి సహకారం

ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి

వార్త 2లో

## నిరుద్యోగుల కోసం మరో ఉద్యమం చేస్తాం



### ఉస్మానియాను రణరంగంగా మారుస్తున్నారు

### విద్యార్థుల అరెస్టులపై మండిపడ్డ కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): డీఎస్సీ వాయిదా వేయాలంటూ, పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై అక్రమ కేసులు, నిర్బంధం, అరెస్ట్ చేయటాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ అని చెప్పి ఇప్పుడు వారిని దగా చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి కేబినెట్‌లోనే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ అని ఇచ్చిన మాట తొమ్మిది నెలలు కావస్తోన్న ఏమైందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. లక్షలాది మంది డీఎస్సీ అభ్యర్థుల ఆక్రందన కాంగ్రెస్ సర్కారుకు వినపడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి

మిగతా 2లో..

### తెలంగాణలో ఫిరాయింపులపై సుప్రీంలో తేల్చుకుంటాం

తెలంగాణ ప్రజలతో గ్యాప్ ఏర్పడింది

ఎన్నికల్లో అదే కొంప ముంచింది

రాజ్యాంగ ప్రతిని చూపడం కాదు..దానిని ఆచరించాలి: కేటీఆర్

2లో

## రైతులకు రుణమాఫీ చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతాం

- తెలంగాణ ఏర్పడ్డా పాలమూరుపై శీతకన్నే..
- తన వరకు వస్తే కాని కేసీఆర్‌కు ఆ బాధ తెలియలేదు
- మహబూబ్‌నగర్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- సొంత జిల్లాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మహబూబ్‌నగర్‌బ్యూరో(జనంసాక్షి): రైతులకు రుణమాఫీ చేశాకనే స్థానికసంస్థల ఎన్నికల్లో ఓట్లడుగుతామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా పాలమూరు జిల్లా నిర్లక్ష్యానికి గురైందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటిస్తోన్న ఆయన..జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి, పరిశ్రమలు తీసుకొచ్చేందుకు తాను కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల

మిగతా 2లో..



## పాలమూరు-రంగారెడ్డి పూర్తికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు

- ఇది తప్ప మహబూబ్‌నగర్ ప్రాజెక్టులన్నీ డిసెంబర్ 2025 నాటికి పూర్తి చేయాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

మహబూబ్‌నగర్(జనంసాక్షి):పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తప్ప ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను డిసెంబర్ 2025 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి,

మిగతా 2లో..

## క్రికెటర్ సిరాజ్‌కు ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం

- రాష్ట్ర సర్కారు నజరానా..
- ముఖ్యమంత్రి రేవంత్‌కు భారత జెర్సీ అందించిన హైదరాబాదీ క్రికెటర్




సీఎం రేవంత్‌రెడ్డిని క్రికెటర్ సిరాజ్ మర్యాదపూర్వకంగా కలసి టీమ్ ఇండియా జెర్సీని బహూకరించారు. టీ20 ప్రపంచకప్ సాధించినందుకు సిరాజ్‌ను సీఎం అభినందించారు. సిరాజ్‌కు హైదరాబాద్‌లో ఇంటిస్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీఎం నిర్ణయించి నగర పరిసరాల్లో స్థలం గుర్తించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి కాంగ్రెస్ సీనియర్ నేత అజహరుద్దీన్ పాల్గొన్నారు.



టీజీబీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో

## గ్రూప్-1 ఉచిత శిక్షణ

హైదరాబాద్(జనంసాక్షి): గ్రూప్–1 (మెయిన్స్) పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం (టీజీబీసీ ఈఎస్‌డీటీసీ) డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 75 రోజులపాటు నిర్వహించే శిక్షణ ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు తమ దరఖాస్తును సంబంధిత వెబ్‌సైట్‌లో సమర్పించాలి. దరఖాస్తు చేసే అభ్యర్థుల తల్లిదండ్రుల

మిగతా 10లో..

నేటి నుంచి రైతు భరోసా పథకంపై

## ప్రజాభిప్రాయ సేకరణ





### జిల్లాల్లో మంత్రుల పర్యటన

హైదరాబాద్(జనంసాక్షి): డిప్యూటీ సీఎం, మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్ భట్టి విక్రమార్క మల్లు ఆధ్వర్యంలో మంత్రులు పర్యటనలు ఉమ్మడి పది జిల్లాల్లో వర్క్ షాప్ లు ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు విధి, విధానాలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు చైర్మన్ గా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు. సభ్యులుగా కమిటీని ఖరారు చేసింది. ఈ కమిటీ ఈనెల 10వ తేదీ నుంచి .. 23వ తేదీ వరకు పాత ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో వరుసగా పర్యటించనుంది. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతు భరోసా పథకం అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది, ఈ పథకానికి సంబంధించి అన్ని జిల్లాల్లో అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు వినాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల నుంచే రైతు భరోసా కు నిధులు చెల్లిస్తాం. అందుకే ప్రజా ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాలని నిర్ణయించింది. పాత పది జిల్లాల్లో వర్క్ షాప్ ల ద్వారా ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలను మధించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేయనుంది.

### అమెరికాలో మరో భారత విద్యార్థి మృతి

2లో



## యుద్ధ భూమిలో సమస్యలు పరిష్కారం కావు

### చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి ● పుతిన్‌తో భేటిలో మోదీ

మాస్కో(జనంసాక్షి): బాంబులు, బుల్లెట్ల మధ్య శాంతి చర్చలు విజయవంతం కావని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఉక్రెయిన్‌పై కొనసాగుతోన్న దండయాత్ర గురించి మాట్లాడిన ఆయన..అమాయక చిన్నారుల మరణాలు చూస్తుంటే గుండె తరుక్కుపోతోం దన్నారు. ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా రష్యా అధ్యక్షుడితో భేటీ అయిన ఆయన పలు కీలక అంశాలను పుతిన్ దృష్టికి తీసుకెళ్లారు.' 'ఉక్రెయిన్ యుద్ధం గురించి స్వేచ్ఛగా చర్చించుకోవడం సంతోషంగా ఉంది. దీనిపై పరస్పర అభిప్రాయాలను గౌరవించుకున్నాం. యుద్ధమైనా.. సంక్షోభమైనా లేదా ఉగ్రచర్య అయినా.. ప్రాణనష్టం జరిగితే మానవత్వం ఉన్న ప్రతిఒక్కరూ బాధపడతారు. ఇక అభంశుభం తెలియని చిన్నారులు ప్రాణాలు కోల్పోవడాన్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. ఆ బాధ వర్ణించలేనిది. ఈ విషయంపైనా మీతో

మిగతా 2లో..

### పుతిన్‌తో మోదీ భేటి నిరాశపర్చింది:జెలెన్‌స్కీ

కీవ్(జనంసాక్షి):భారత ప్రధాని నరేంద్రమోదీ రష్యా పర్యటనలో ఉన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం మాస్కో చేరుకున్న ఆయనకు.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్

మిగతా 2లో..

### పదేళ్లలో జరిగిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమే

- భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతా
- ఆత్మవిశ్వాసంతో దేశం ముందుకు నడుస్తోంది
- మాస్కోలో ఎన్నారైల సదస్సులో ప్రధాని మోదీ

మాస్కో(జనంసాక్షి):రాబోయే ఐదేళ్ల పదవీకాలంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారుస్తామని ప్రధాని మోదీ అన్నారు. గత పదేళ్లలో భారత్ ఎంతగానో పురోభివృద్ధి సాధించిందని అనన్నారు. ఇటీవలే మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశానని, మూడు రెట్ల వేగంతో పని చేయాలని

మిగతా 2లో..

కేఆర్ఎంబీ పరిధిలోకి

# కృష్ణా ప్రాజెక్టులు

విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు ధర్మాసనం

కేంద్రం తరపున నివేదిక దాఖలు చేయాలని ఆదేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి): కృష్ణానది పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకువచ్చే అంశంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ఇతర అవసరాలకు అనుమతులు లేకుండా నీటిని వినియోగిస్తున్న విషయంపై ఆంధ్రప్రదేశ్ గతంలో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఒఖా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసి నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ విషయంపై కేంద్రం నుంచి తగిన ఆదేశాలు తీసుకుని తాజాగా అఫిడవిట్ దాఖలు చేస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటియా కోర్టుకు తెలిపారు. కృష్ణా పరివాహక ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి ఇవ్వడం తమకు సమ్మతమేనని ఆంధ్రప్రదేశ్ గతంలోనే చెప్పింది. ఇదే అంశంపై విముఖత వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో రెండు




ప్రభుత్వాల అభిప్రాయాలకు అనుగుణంగా కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఇరు రాష్ట్రాల న్యాయవాదులు అన్నారు. అయితే నోటిఫికేషన్ జారీ చేయడానికి కొన్ని సాంకేతిక

మిగతా 2లో..



## ప్రతీకారం తప్పదు

### మిలిటెంట్ల దాడులపై భారత్ వార్నింగ్

దిల్లీ(జనంసాక్షి): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు పేట్రేగిపోతున్నారు. ఇటీవల పర్యటకుల వాహనంపై దాడి ఘటనను మరువకముందే మరో ఘాతుకానికి పాల్పడ్డారు. కఠువా జిల్లాలో సైనిక వాహనంపై చేసిన మెరుపుదాడిలో ఐదుగురు జవాన్లు అమరులయ్యారు. మరికొందరు సిబ్బంది గాయపడ్డారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన భారత రక్షణ మంత్రిత్వశాఖ.. ఉగ్ర చర్యలపై తీవ్ర స్థాయిలో మండిపడింది. ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదుల అంతు చూస్తామని హెచ్చరించింది."కఠువా జిల్లాలో జరిగిన ఉగ్ర దాడిలో ఐదుగురు సాహసవీరులను దేశం కోల్పోయింది. వారి మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. బాధిత కుటుంబాలకు భారత ప్రభుత్వం అండగా ఉంటుంది. దేశం కోసం జవాన్లు తమ ప్రాణాలు అర్పించి అమరులయ్యారు. వారి త్యాగాలు వృథా కానివ్వం. దీనికి తప్పకుండా

మిగతా 10లో..

## హాథ్రస్ తొక్కిసలాట

అన్ని దశల్లో నిర్లక్ష్య ఫలితమే

సిట్ నివేదిక వెల్లడి

లఖ్‌నవూ(జనంసాక్షి): ఉత్తర్‌ప్రదేశ్‌లోని హాథ్రస్‌లో భోలే బాబా సత్సంగ్ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్నిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం విస్తృత విచారణ జరిపింది. ఆ నివేదికను మంగళవారం యూపీ

మిగతా 2లో..



## 14 ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేసిన పతంజలి

### సుప్రీంకు సంస్థ అఫిడవిట్

న్యూఢిల్లీ(జనంసాక్షి):14 రకాల ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేశామని పతంజలి ఆయుర్వేద సంస్థ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. తయారీ లైసెన్స్ రద్దు అయిన తరవాత ఈ నిర్ణయం తసీఉకున్నామని పేర్కొంది. ఈ క్రమంలో

మిగతా 10లో..



## మహిళలకిచ్చిన హామీలు ఏమయ్యాయి?

ఇందిరా పార్క్ వద్ద మహిళా మోర్చా ధర్నాలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): ఇందిరాగాంధీ అధికారంలో ఉన్నప్పుడు కూడా తెలంగాణ మహిళలకు ఇంత అన్యాయం జరగలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద భాజపా మహిళా

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
10.07.2024



## ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి సహకరించండి


**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి తమ పూర్తి సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రహదారుల నిర్మాణానికి ఏవైనా ఆటంకాలు ఉంటే వాటిని తొలగిస్తామని స్పష్టం చేశారు. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏ) ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఆయన నివాసంలో మంగళవారం సమావేశమయ్యారు. సమావేశంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎన్ హెచ్‌ఏఐ ప్రాజెక్ట్స్ మెంబర్ అనిల్ చౌదరి, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్. హెచ్. ఏ.ఐ చేపడుతున్న రహదారుల నిర్మాణంలో భూ సేకరణతో పాటు తలెత్తున్న పలు ఇబ్బందులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. స్పందించిన ముఖ్యమంత్రి ఆయా సమస్యల పరిష్కారానికి బుధవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రహదారులు నిర్మాణం జరిగే జిల్లాల కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు భేటీలో పాల్గొంటారని, ఆయా సమస్యలపై చర్చించి అక్కడే సమస్యలను పరిష్కరించుకుందామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్, మన్నెగూడ రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సూచించారు. కాంట్రాక్టు సంస్థతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు వెంటనే మొదలు పెట్టాలని వారికి సూచించారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. హైదరాబాద్-విజయవాడ మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరు కోసం ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలను ముఖ్యమంత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఎన్. హెచ్. ఏ.ఐ అధికారులను కోరారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన భారత్ మాల పథకంలో ఆర్‌ఆర్‌ఆర్ ను చేపట్టాలని ప్రధానమంత్రి మోదీకి ఇటీవల విజ్ఞప్తి చేసిన విషయాన్ని వారికి గుర్తు చేశారు. ఔటర్ రింగ్ రోడ్, రీజనల్ రింగ్ రోడ్ మధ్యలో 12 రేడియల్ రోడ్లు వస్తాయని సీఎం తెలిపారు. వాటి మధ్య పలు క్లస్టర్లు, శాటిలైట్ టౌన్ షిప్ లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణకు తీర ప్రాంతం లేనందున డ్రై పోర్ట్ ఏర్పాటు చేయనున్నామని, ఇందుకోసం బందర్ పోర్టును అనుసంధానించేలా హై స్పీడ్ ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ -కల్వకుర్తి జాతీయ రహదారి పనులు మొదలు పెట్టాలన్నారు. వ్యూహాత్మకంగా కీలకమైన ఈ రహదారితో తిరుపతికి 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం వివరించారు. మహారాష్ట్ర, కర్ణాటక తో పాటు హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందన్నారు.

# రైతులకు రుణమాఫీ చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతాం

సూచనలను ఈ ప్రభుత్వం తప్పక పాటిస్తుందన్నారు. పార్టీ కార్యకర్తలకు న్యాయం చేస్తామని, త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు."ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ మారుతున్నారని కేసీఆర్ మాట్లాడుతున్నారు. తన వరకు వస్తే కాని కేసీఆర్‌కు ఆ బాధ తెలియలేదు. గత పదేళ్లలో ఎంతో మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకోలేదా?. ఈ ప్రభుత్వం నెల రోజులలోనే కూలిపోతుందని కేసీఆర్ అనలేదా? 11వేలకు పైగా పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. ఎన్నో ఏళ్లుగా జరగని డీఎస్సీని అడ్డుకోవాలని కొందరు చూస్తున్నారు. భారాస హయాంలో ప్రశ్నపత్రాలు జిరాక్స్ సెంటర్లలో అమ్ముకున్నారు" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ కలెక్టరేట్ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొక్కలు నాటారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. జిల్లాలో మొత్తం 396.09 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా రూ. 353.66 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంవిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ. 10 కోట్లతో బాలికల హాస్టల్ నిర్మాణం, దేవరకద్రలో రూ. 6.10కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం, మహబూబ్ నగర్ రూరల్ లో రూ. 3.25 కోట్లతో కెజివిబి భవన నిర్మాణం, గండీడ్ లో రూ. 6. 20 కోట్లతో కెజివిబి భవన నిర్మాణం, పాల మూరు యూనివర్సిటీలో రూ. 13.44 కోట్లతో టిపి, అకాడామిక్ బ్లాక్, గ్యాలరీ పనులు, మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో రూ. 37.87 కోట్లతో సిసి రోడ్లు, స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం, మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో రూ. 27 6.80 కోట్లతో ఎస్ టిపి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాలమూరు యూనివర్సిటీలో రూ. 42.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి, ఎంపి మల్లు రవి, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ కలెక్టర్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. 2025 డిసెంబర్‌లోపు కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు.గ్రీన్ ఛానెల్ ద్వారా నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతి నెలా ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు.




## దమ్ముంటే పరీక్షల వాయిదాకు నిరాహార దీక్షలకు కూర్చోండి

సెంటర్ల కుట్ర కూడా ఉంది. నిరాహార దీక్షల్లో పేద విద్యార్థులు, పేద నేతలు మాత్రమే ఎందుకు కూర్చుంటున్నారు. దీక్షల్లో కేటీఆర్, హరీశ్‌రావు ఎందుకు కూర్చోవడం లేదు. వారిద్దరూ ఆర్ట్స్ కాలేజీ ముందు దీక్షకు కూర్చుంటే.. రక్షణ కల్పిస్తాం. పరీక్షలు వాయిదా వేస్తే ప్రభుత్వానికి లాభమే తప్ప నష్టం ఉండదు. కేవలం నిరుద్యోగులకు న్యాయం చేసేందుకే పరీక్షలు వాయిదా వేయడం లేదు. విద్యార్థుల చావులతో భారాస రాజకీయం చేస్తుంది" అని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు.

## పాలమూరు- రంగారెడ్డి పూర్తికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు

మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర అబ్కారీ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణ రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి నీటిపారుదలశాఖ సలహాదారు తో కలిసి నీటి పారుదల, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా, సంక్షేమం, పర్యాటక శాఖల పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుపై జరిగిన సమీక్ష సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించి సూక్ష్మస్థాయిలో నియోజకవర్గాలు ,మండలాలు గ్రామాల వారిగా నివేదిక సమర్పించాలని ,అన్ని ప్రాజెక్టులపై స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు .పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద భూసేకరణకు సంబంధించి పెండింగ్ లో ఉన్న చెల్లింపులను చేయాలని, అలాగే పెండింగ్ బిల్లులను రెండవ ప్రాధాన్యత కింద చెల్లించాలని, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసే పనులు పై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.జవహర్ నెట్టెంపాడు ప్రాజెక్టు మొత్తాన్ని మరోసారి రి ఎగ్జమిన్ చేయాలని, సాంకేతిక సమస్యలు, ఇతర సమస్యలను గుర్తించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.ప్రాజెక్ట్ పూర్తికి ఎంత సమయం పడుతుంది? ఎంత మొత్తం నిధులు కావాలో స్పష్టంగా అధికారులు నివేదిక సమర్పించాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ మంత్రితో చర్చించి తుది ప్రతిపాదనలు తయారు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్డీఎస్ కు సంబంధించి కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ తో చర్చించాల్సిన విషయాలు, పరిష్కరించాల్సిన అంశాలను రూపొందించాలని సూచించారు.తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి కి ఏం కావాలో ప్రతిపాదనలు తయారు చేయాలని, ఆర్ డి ఎస్ పై కొత్త ప్రతిపాదనకు ఏమేమి కావాలో ఆలోచించి ప్రతిపాదించాలి అన్నారు. రాజీవ్ బీమా లిఫ్ట్ ఇరిగేషన్ పై సమీక్షిస్తూ ఖానాయ్ పల్లి ఆర్ అండ్ ఆర్ సమస్యను తక్షణమేపరిష్కరించాలని సూచించారు. ఇందుకు అవసరమైతే గ్రామ సభ నిర్వహించి రీ సర్వే, ప్రాజెక్టు నిర్మాణం లో ఇండ్లు, భూములు కోల్పోయిన వారికి పునరావాస కల్పనలో ఏ మాత్రం జాప్యం చేయవద్దు అన్నారు. కోయిల్ సాగర్ ప్రాజెక్టు పై సమీక్ష నిర్వహిస్తూఎలాంటి ఆర్ అండ్ ఆర్ సమస్య లేకుండా కోయిల్ సాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచడానికి పరిశీలించాలని సి.యం ఆదేశించారు.ప్రస్తుతం డిజైన్ చేసిన ఆయకట్టును పూర్తిస్థాయిలో అందించేందుకు స్పష్టమైన ప్రతిపాదనలు తయారు చేయాలని సూచిం చారు. కోయిల్ సాగర్ కింద హాజిలాపూర్, చౌదర్పల్లి, నాగిరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్లకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. నీటి లభ్యత ఆధారంగా వీటన్నిం టిని పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.డిసెంబర్ 2025 నాటికి కోయిల్ సాగర్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఇంజనీర్లు హామీ ఇచ్చారు. అన్ని ప్రాజెక్టుల కింద భూసేకరణ ఆర్ అండ్ ఆర్ చెల్లింపులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పెండింగ్ బిల్లుల చెల్లింపుకు వెంటనే చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి తెలిపారు. పాలమూరు- రంగారెడ్డి తప్ప అన్ని ప్రాజెక్టులను 18 నెలల్లో పూర్తి చేయాలనీప్రతి ప్రాజెక్టు వారిగా సూక్ష్మ స్థాయిలో స్టేటస్ రిపోర్ట్ తయారు చేసీ ఇవ్వాలని ఆదేశించారుఆయా ప్రజక్టుల కింద కొత్త ప్రతిపాదనలను, న్యాయపరమైన వివాదాలకు అవకాశం లేకుండా రూపొందించాలి అన్నారు.ప్రస్తుతం చేపట్టిన పనులంటిని పూర్తి చేయాలని ప్రతి ప్రాజక్ట్ పై 30 రోజు లకు ఒకసారి సమీక్ష ఉంటుందన్నారు.అన్ని ప్రాజెక్టుల ను క్షేత్రస్థాయిలో సందర్శించి పూర్తి నివేదిక ఇవ్వాలని సూచించారు. పార్లమెంటు సభ్యు రాలు డీకే అరుణ మాట్లాడుతూ ప్రాజెక్టుల కింద భూసే కరణ చెల్లింపులను తక్షణమే చేయాలని, గతంలో పూర్తయిన ప్రాజెక్టులకు సైతం చెల్లింపులు పెండింగ్లో ఉన్నాయని, నెట్టెంపాడు 19వ ప్యాకేజీ ఇంకా పూర్తి కాలేదని, జూరాల నుండి పాలమూరు రంగారెడ్డికి నీరు తీసుకుంటేనే పాలమూరు రంగారెడ్డి పూర్తవుతుందని దీనిపై ఒకసారి ఆలోచించాలని కోరారు. గద్వాల శాసనసభ్యులు కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ శాసనసభ్యులు విజయ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు సంపత్, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, దేవరకద్ర శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ,మక్తల్ శాసనసభ్యురాలు ఫర్నీక రెడ్డి, జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి, ప్రాజెక్టులపై చర్చ సందర్భంగా సమీక్షలో పాల్గొంటూ సూచనలు చేశారు .ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్, చీఫ్ ఇంజనీర్లు విజయభాస్కర్ రెడ్డి, రమణారెడ్డి, ఆయా ప్రాజెక్టుల వారీగా వివరాలు సమర్పించారు శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద తర్నికల్ వైపు ఒక లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని, అచ్చంపేట శాసన సభ్యులు వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గ వారిగా రిజర్వాయర్లు నిర్మించాలని కోరారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులను నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులను మంజూరు చేస్తే త్వరగా పూర్తయితాయని తెలిపారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ర్యాలంపాడు కింద స్టేజ్ వన్ గూడెం దొడ్డి ఎత్తిపోతల 10 టీఎంసీల రిజర్వాయర్ పటిష్టం చేస్తే దాని ద్వారా గట్టు లిఫ్ట్ ఇరిగేషన్ను నాలుగు టీఎంసీలకు చేసుకో వచ్చని సూచించారు అలంపూర్ మాజీ శాసనస భ్యులు సంపత్ మాట్లాడుతూ నెట్టెంపాడు కింద వల్లూరు, మల్లమ్మ కుంట, జూలకల్లు రిజర్వాయర్లు నిర్మిస్తే అలంపూర్, గద్వాల నియోజకవర్గం ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రాజెక్టుల కింద ప్రస్తుతం ఉన్న పద్ధతి ప్రకారం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.



## బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఉప్పల

**హైదరాబాద్(జనంసాక్షి):**శ్రీ బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో టీపీపీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ఉప్పల స్వప్న దంపతులు పాల్గొని అమ్మవారికి వొడి బియ్యం పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుంది అని సకాలంలో వర్షాలు పడి రైతులు అందరూ పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## యుద్ధ భూమిలో సమస్యలు పరిష్కారం కావు

చర్చించాను' అని రష్యా అధ్యక్షుడితో నరేంద్ర మోదీ అన్నారు."యుద్ధభూమిలో పరిష్కారాలు సాధ్యం కావని నాకు తెలుసు. బాంబులు, బుల్లెట్ల నడుమ జరిగే శాంతి చర్చలు విజయవంతం కావు. కేవలం చర్చల ద్వారానే శాంతిమార్గం అనుసరించాల్సి ఉంటుంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో శాంతిస్థాపనకు సహకరించేందుకు భారత్ అన్ని వేళలా సిద్ధంగా ఉంటుందనే విషయాన్ని గుర్తుచేశారు. భారత్ శాంతిపక్షాన ఉందని మీతోపాటు యావత్ ప్రపంచానికి హామీ ఇస్తున్నానన్న మోదీ.. ఇందుకు పుతిన్ మాట్లాడిన మాటలు భరోసా కలిగించాయన్నారు.

## పుతిన్‌తో మోదీ భేటి నిరాశపర్చింది

ప్రత్యేకంగా ఆతిథ్యమిచ్చారు. వీరిద్దరూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ పరిణామాలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. పుతిన్‌తో మోదీ భేటీ తమను నిరాశపర్చిందన్నారు. "ఉక్రెయిన్ లో సోమవారం రష్యా జరిపిన క్షిపణి దాడిలో 37 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులున్నారు. 13 మంది పిల్లలు సహా 170 మంది గాయపడ్డారు. ఆ వెంటనే మరో చిన్నారుల ఆసుపత్రిపై రష్యా క్షిపణి విరుచుకుపడింది. ఎంతోమంది శిథిలాల కింద సమాధి అయ్యారు. అలాంటి రోజున ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి చెందిన నాయకుడు (మోదీని ఉద్దేశిస్తూ).. ప్రపంచంలోనే అత్యంత కిరాతక నేరస్థుడిని (పుతిన్‌ను ఉద్దేశిస్తూ) మాస్కోలో ఆలింగనం చేసుకున్నారు. ఇది తీవ్ర నిరాశ కలిగించింది. శాంతి ప్రయత్నాలకు ఇది గట్టి ఎదురుదెబ్బ లాంటిదే" అని జెలెన్‌స్కీ తన 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు. రష్యా దాడికి సంబంధించిన ఫొటోలను షేర్ చేస్తూ అసంతృప్తి వ్యక్తం చేశారు. రష్యాలో మోదీ పర్యటన సమయంలోనే ఉక్రెయిన్‌పై మాస్కో క్షిపణుల వర్షం కురిపించింది. ఐదు నగరాలను లక్ష్యంగా చేసుకుని భీకర దాడులు చేసింది. మొత్తం 40 క్షిపణులను ప్రయోగించింది. ఇందులో అనేక అపార్ట్‌మెంట్లు, ప్రభుత్వ భవనాలు, ఆసుపత్రులు కూలిపోయాయని జెలెన్‌స్కీ తెలిపారు.ఇదిలాఉండగా.. రష్యా అధ్యక్షుడితో భేటీ సందర్భంగా ఉక్రెయిన్‌తో యుద్ధం అంశాన్ని మోదీ ప్రస్తావించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. "దేశాల ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని భారత్ ఎల్లప్పుడూ గౌరవిస్తుంది. యుద్ధభూమిలో దేనికీ పరిష్కారాలు లభించవు. చర్చలు, దౌత్యమే ముందుకెళ్లే మార్గాలు" అని భారత ప్రధాని పుతిన్‌కు సూచించినట్లు సమాచారం.

## నిరుద్యోగుల కోసం మరో ఉద్యమం చేస్తాం

మీరు కొలువుదీరితే సరిపోతుందా? యువతకు కొలువులు అక్కర్లేదా ? అని కాంగ్రెస్ సర్కార్‌ను కడిగి పారేశారు. ఉస్మానియా విద్యార్థులన్నా.. అక్కడ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులన్నా సీఎంకు ఎందుకంతా కోపమో చెప్పాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా విద్యార్థులు అడ్డమీద కూలీల్లాంటి వారని? తిన్నది అరిగేదాకా అరిచే బీరు బిర్యానీ బ్యాచ్ అని బద్నాం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. సిద్ధాంతం, ఆలోచన లేని ఆవారా టీమ్ అని వారి అవహేళన చేసిన మీరే?అదే విద్యార్థులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చారన్న సంగతి మర్చిపోవద్దన్నారు. అధికారంలోకి రాగానే నేడు అదే ఉస్మానియా యూనివర్సిటీని రణరంగంగా మార్చి? డీఎస్సీ అభ్యర్థులపై పోలీసులను ప్రయోగించి అణచివేస్తున్నారని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కాలరాస్తున్నారని? వందల మందిని అన్యాయంగా అరెస్టు చేసి అక్రమ కేసులు పెడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఉస్మానియాలో ఉద్యమం నాటి పరిస్థితులను రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకొస్తుందంటూ కేటీఆర్ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ చేతకానితనాన్ని ప్రశ్నించడమే వాళ్లు చేసిన నేరమా? ప్రచారంలో ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడగడమే పాపమా? అని రేవంత్ సర్కార్ ను కేటీఆర్ నిలదీశారు. ఇప్పటికే మెగా డీఎస్సీ అని.. నిరుద్యోగ యువతను నిలువునా మోసం చేశారు. ఇప్పుడు ప్రిపరేషన్‌కు కూడా టైమ్ ఇవ్వకుండా.. వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడటం ఎంత వరకు కరెక్ట్ అన్నారు. పరీక్షలు వాయిదా వేయాలంటూ డీఎస్సీ అభ్యర్థులు కోరుతుంటే వారి డిమాండ్‌ను పరిశీలించటంలో ఎందుకింత మొండి వైఖరో చెప్పాలన్నారు. పార్టీ ఫిరాయింపుల మీద ఉన్న దృష్టి.. పోరుబాట పట్టిన నిరుద్యోగులపై లేకపోవడంపై కాంగ్రెస్ సిగ్గుపడాలన్నారు. ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరి ప్రదర్శిస్తే నిరుద్యోగులతో కలిసి మరో ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

## మహిళలకిచ్చిన హామీలు ఏమయ్యాయి?

మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత భాజపాదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేని అనేక హామీలు ఇచ్చిందని విమర్శించారు. మహిళలకు ప్రతి నెల రూ. 2,500 ఇస్తామన్న రేవంత్ ప్రభుత్వం.. వారికి రూ. 20 వేల బాకీ ఉందని తెలిపారు. వృద్ధులకు రూ. 4 వేల పింఛన్ ఎప్పటి నుంచి ఇస్తారని ప్రశ్నించారు.'కల్యాణలక్ష్మి కింద రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారు.. ఇవ్వలేదు. మహిళలకు ఉచిత ప్రయాణం ఇచ్చి.. బస్సులు తగ్గించారు. తెలంగాణ ఆడబిడ్డల తరఫున ప్రశ్నించే బాధ్యత మేం తీసుకున్నాం. హామీల అమలు కోసం సీఎంపై ఒత్తిడి తెస్తాం. కర్ణాటకలో కూడా హామీలు అమలు చేయట్లేదు. రాష్ట్రంలో ఆర్‌ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారు. రాహుల్ గాంధీ పర్యటనల కోసం పన్నులు ఉపయోగిస్తున్నారు. హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారని ప్రశ్నిస్తున్నా. పథకాల పేరుతో తెచ్చిన అప్పులు ఏం చేస్తున్నారు? మహిళలపై సీఎంకు గౌరవం ఉంటే బెల్ట్ షాపులు మూయించాలి. రాష్ట్రం ఏర్పాటై పదేళ్లయినా కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదు. దీంతో మహిళలు గ్యాస్ కనెక్షన్లు తీసుకోలేకపోతున్నారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏంటని, తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రధాని మోదీ 5 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు.

## కేఆర్‌ఎంబీ పరిధిలోకి కృష్ణా ప్రాజెక్టులు

కారణాలు ఉన్నాయని కేంద్రం (కేఆర్‌ఎంబీ) తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ తెలి పారు. ఈ విషయంలో కేంద్రం నుంచి తగిన సూచనలు, ఆదేశాలు తీసుకోవాల్సి ఉందని కోర్టుకు వివరించారు. ఈ వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. ఆలోపు అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది.

## తెలంగాణలో ఫిరాయింపులపై సుప్రీంలో తేల్చుకుంటాం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తెలంగాణ ప్రజలతో తమకు గ్యాప్ వచ్చిందని.. తమ వైఖరి మార్చుకోవాల్సి ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. కవిత బెయిల్ విషయంపై న్యాయనిపుణులతో చర్చించేందుకు ఐదు రోజుల కిందట ఢిల్లీ వచ్చిన హరీష్ రావు, కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత కొంత మంది మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణతో పాటు ఏపీ రాజకీయాల గురించి కూడా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.బీఆర్‌ఎస్ పరాజయాలకు ప్రజలతో గ్యాప్ రావడమే కారణమని కేటీఆర్ అంగీకరించారు. ప్రజలది తప్పు అనడమంటే..తాము తప్పు చేస్తున్నట్లుగా అంగీకరించడమేనన్నారు. హైదారాబాద్‌లో అన్ని సీట్లు గెలిచామని గుర్తు చేశారు. అభివృద్ధిని తాము చెప్పుకోలేకపోయామన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చడం వల్ల ఓడిపోయామని చాలా మంది అంటున్నారని.. కానీ దానికి ఆధారం లేదని కేటీఆర్ అన్నారు. మాకు అహంకారం ఉందని కృత్రిమంగా సృష్టించారని కేటీఆర్ ఆరోపించారు. ఆత్మవిశ్వాసం, అహంకారానికి తేడా తెలియదని.. అభివృద్ధిలో మాతో పోటీ పడలేని వారే అహంకారం అని ప్రచారం చేశారని అన్నారు.ఏపీ రాజకీయాలపైనా కేటీఆర్ స్పందించారు. ఎన్నికలకు ముందు జగన్ గెలుస్తారని తమకు సమాచారం ఉందని పదే పదే కేటీఆర్, కేసీఆర్ చెప్పేవారు. ఈ అంశంపై మీడియా ప్రతినిధులతో భిన్నంగా స్పందించారు. పేదలకు పెద్ద ఎత్తున పథకాలు ఇచ్చినా జగన్ ఓడిపోవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. అయినా 40 శాతం ఓట్లు సాధించడం మాములు విషయం కాదని.. పవన్ విడిగా పోటీ చేసి ఉంటే ఫలితాలు మరో విధంగా ఉండేవన్నారు. ప్రతిరోజూ జనంలోకి వెళ్ళే ధర్మవరం కేతిరెడ్డి ఓడిపోవడం కూడా ఆశ్చర్యం కలిగించిం దన్నారు. జగన్ ను ఓడించేందుకు షర్మిల ను ఒక వస్తువులా ఉపయోగించారని .. అంతకు మించి షర్మిలకు బలం ఏమీ లేదన్నారు. హరీష్ రావు కూడా మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఫిరాయింపుల వల్ల మాకు లాభం జరగలేదని.. మా పార్టీలు చేరిన వాళ్ళల్లో పది మంది ఓడిపోయారని గుర్తు చేసుకున్నారు. సుప్రీం తీర్పు ప్రకారం మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలనన్నారు. తెలంగాణలో మళ్ళీ అధికారంలోకి వచ్చేది బి.ఆర్ ఎస్ ప్రభుత్వమేనన్నారు. ప్రజలు ప్రస్తుతం ప్రభుత్వానికి గత ప్రభుత్వానికి వ్య త్యాసం చూస్తున్నారని అన్నారు.

## పదేళ్లలో జరిగిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమే

...చుకున్నానని అన్నారు. మంగళవారం రష్యా రాజధాని మాస్కోలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇక్కడికి తాను ఒక్కడినే రాలేదని, 140 కోట్ల మంది భారతీయుల ప్రేమను వెంట తీసుకొని వచ్చానని వ్యాఖ్యానించారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధి జస్ట్ ట్రైలర్ మాత్రమే అన్నారు దేశం మారుతోందని ప్రపంచమంతా గర్విస్తోందన్నారు.విదేశాల్లో ఉంటున్న భారతీయులు దేశాన్ని చూసి గర్విస్తున్నారని చెప్పారు. మహిళలను లక్షాధికారులను చేస్తున్నామన్నారు. భారత్‌లో పేదల కోసం 3 కోట్ల ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. భారత్ జీ20 సదస్సును సమర్థవంతంగా నిర్వహించిందన్నారు. కోవిడ్ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నామని చెప్పారు. భారత్ ను ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా మార్చామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద హెల్త్ ఇన్సురెన్స్ స్కీంను అమలు చేస్తున్నామని తెలిపారు. 2024కు ముందు దేశం నిరాశతో ఉండేది.. ఇపుడు ఆత్మవిశ్వాసంతో నిండి ఉందన్నారు. డిజిటల్ పేమెంట్స్ తో కొత్త రికార్డులు సృష్టిస్తున్నామని చెప్పారు మోదీ. ప్రపంచంలోనే ఎత్తైన ప్రదేశంలో రైల్వే బ్రిడ్జి నిర్మించామని.. పదేళ్లలో 40 వేల కి.మీ. రైల్వే లైన్లను ఎలక్ట్రిఫికేషన్ చేశామని, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మించామని పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో140 కోట్ల మంది భారతీయుల పాత్ర ఉందన్నారు. టీ20 వరల్డ్ కప్ గెలిచి దేశం సంబురాలు చేసుకుంది.. చివరి వరకు టీమిండియా పోరాడింది. ఓటమి ఒప్పుకోని వారినే విజయం వరిస్తుందన్నారు. భారత్ రష్యా మధ్య సంబంధాలు ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటాయన్నారు. 10 సంవత్సరాలలో సెమీకండక్టర్ల నుంచి ఎలక్ట్రానిక్ తయారీ, గ్రీన్ హైడ్రోజన్ నుంచి ఎలక్ట్రిక్ వాహనాల వరకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల వరకు మరింత వేగంగా అభివృద్ధి చెందబోతున్నామని చెప్పారు. సవాళ్లను స్వీకరించడంలో భారత్ ముందంజలో ఉంటుందన్నారు. ఏ దేశానికి సాధ్యం కాని విధంగా చంద్రయాన్ ప్రయోగం చేశాం. చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా గుర్తింపు పొందాం. డిజిటల్ లావాదేవీల్లో ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా ఉన్నాం. స్టార్టప్‌ల్లో ప్రపంచంలోనే మూడో స్థానానికి చేరుకున్నాం. 2014లో వందల్లో ఉన్న స్టార్టప్‌లు నేడు లక్షల్లోకి చేరాయి. భారత్ రికార్డు స్థాయిలో పేటెంట్లను సాధిస్తోంది. ప్రపంచంలో అతిపెద్ద ఆరోగ్యబీమా వ్యవస్థ భారత్‌లో ఉంది. భారత్‌ను ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా నిలబెడతాను. మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే పటిష్టమైంది అని వివిధ రంగాల్లో భారత్ సాధిస్తోన్న విజయాలను ప్రస్తావించారు. భారత్ ఘనతను ప్రపంచం గుర్తించకతప్పని పరిస్థితి తెచ్చామని వ్యాఖ్యానించారు.

## అన్ని దశల్లో నిర్లక్ష్య ఫలితమే హాథ్రస్ తొక్కిసలాట

ప్రభుత్వానికి సమర్పించింది. తొక్కిసలాటకు నిర్వాహకులదే బాధ్యత అని, స్థానిక యంత్రాంగం కూడా ఉదాసీనంగా వ్యవహరించిందని సిట్ పేర్కొంది.' 'తొక్కిసలాట ఘటనపై ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాలు, ఇతర సాక్ష్యాల ఆధారంగా.. ప్రమాదానికి ఈవెంట్ ఆర్గనైజర్ల నిర్వహణ వైఫల్యమే కారణమని ప్రాథమికంగా తెలిసింది. వాస్తవాలను దాచిపెట్టి నిర్వాహకులు సత్సంగ్ కార్యక్రమానికి అనుమతులు తీసుకున్నారు. షరతులు పాటించలేదు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రజలను ఆహ్వానించి.. వారికి కనీస ఏర్పాట్లు చేయలేదు. ఎలాంటి పోలీసు వెరిఫికేషన్ లేకుండానే వాలంటీర్లను నియమించుకున్నారు. భద్రతాపరమైన ఏర్పాట్లు కూడా లేవు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు వారు బయటకు వెళ్లేందుకు బారికేడ్లు కూడా పెట్టలేదు. ప్రమాదం జరగ్గానే నిర్వాహకుల కమిటీలోని సభ్యులు అక్కడినుంచి పారిపోయారు" అని సిట్ తన నివేదికలో వెల్లడించింది.అటు స్థానిక పోలీసులు, యంత్రాంగం కూడా ఈ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోలేదని సిట్ తెలిపింది. సత్సంగ్ జరిగే వేదిక ప్రాంగణాన్ని తనిఖీ చేయకుండా.. కనీసం సీనియర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సబ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఆ కార్యక్రమానికి అనుమతులు ఇచ్చారని సిట్ తెలిపింది. సర్కిల్ ఆఫీసర్, రెవెన్యూ అధికారి, ఇన్‌స్పెక్టర్, ఔట్‌పోస్ట్ ఇన్‌ఛార్జ్ అందరూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపింది. వీరిపై చర్యలు తీసుకోవాలని సిఫార్సులు చేసింది. అయితే, ఈ ఘటనలో కుట్ర కోణాన్ని కూడా తాము కొట్టిపారేయలేమని, దానిపై సమగ్ర దర్యాప్తు అవసరమని సిట్ అభిప్రాయపడింది.

## అమెరికాలో మరో భారత విద్యార్థి దుర్మరణం

**కాకినాడ(జనంసాక్షి):**ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లాకు చెందిని గద్దె సాయి సూర్య అవినాశ్ (26) యూస్‌లోని న్యూయార్క్ లో తన అక్క దగ్గర ఉండి మాస్టర్స్ చదువుతున్నాడు. 7 జూలై ఆదివారం కావడంతో అక్క కుటుంబంతో కలిసి న్యూయార్క్ సమీపంలోని అల్బానీ ప్రాంతంలో ఉన్న బార్బర్‌విల్లీ జలపాతానికి అవినాశ్ వెళ్లాడు. నీటి ఉధృతికి అవినాష్ కాలుజారి కిందపడి కొట్టుకుపోయాడు. అతడ్ని రక్షించేందుకు మరొకరు నీటిలోకి దూకగా అతడు కూడా కొట్టుకుపోయాడు. అయితే వెంటనే అక్కడి భద్రతా దళాలు, సహాయ సిబ్బంది సహాయ కార్యక్రమాలు చేపట్టడంతో ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడగా.. అవినాశ్ మాత్రం మృతి చెందాడు. శుక్రవారం అవినాష్ డెడ్ బాడీ స్వగ్రామానికి చేరుకుంటుంది. అవినాష్‌ది తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల గ్రామం.

# ఖమ్మానికేమైంది!

వారం రోజులుగా ఆత్మహత్యల పరంపర!

## రోజుల వ్యవధిలోనే నలుగురు రైతులు, ఇద్దరు అధికారుల ఆత్మహత్యాయత్నం







**వేధింపులు.. కక్ష సాధింపులు.. ఒత్తిడులు, రాజకీయ బెదిరింపులు ఇవన్నీ వెరసి మనిషి గుండె చెదురుతోంది. కట్టుకున్న భార్యను, పిల్లలను సైతం కాదనుకుని జీవితంపై విపరీతమైన విరక్తి పెరిగిపోతోంది. ఫలితంగా బలవన్మరణానికి సైతం తెగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆ బలహీన క్షణంలో విచక్షణ కోల్పోయి నిలువునా ప్రాణం తీసుకోవడానికి వెనుకాడటం లేదు. ఆత్మహత్యకు ప్రయత్నించి ఆఖరి క్షణాల్లో బతకాలన్న కోరిక కలిగినా అప్పటికే పరిస్థితి చేయి దాటిపోతోంది. ఖమ్మం జిల్లాలో వరుస ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది. పొలాల దగ్గర గొడవలతో రైతులు గుండె చెడి పురుగుల మందే పరమాన్నంగా భావిస్తుండగా కొందరు అధికారులు సైతం ఉద్యోగ విధుల్లో ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరగడం వంటి కారణాలతో ఆత్మహత్యలకు వరుస కడుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వారం రోజుల వ్యవధిలోనే నలుగురు రైతులు ఆత్మహత్యకు ప్రయత్నించగా, ఇద్దరు అధికారులు సైతం ఉసురు తీసుకోవడానికి యత్నించారు.**

**– ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :**

ఖమ్మం జిల్లాలో ఆత్మహత్యల పరంపర గుబులు రేపుతోంది. భూ వివాదాల కారణంగా జిల్లాలో నలుగురు రైతులు ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించారు. చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన భోజెడ్ల ప్రభాకర్ తన మూడు ఎకరాల వ్యవసాయ భూమిలోకి జెసిబిలు, ట్రాక్టర్ల తో వచ్చిన అక్రమణదారులు తన పొలాన్ని ధ్వంసం చేసి ఆక్రమిస్తున్నారంటూ ఆవేదన చెంది పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అయితే దురదృష్టవశాత్తు ఇతడిని హాస్పిటల్ కి తీసుకెళ్లేలోపే ప్రాణాలు విడిచాడు. అయితే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో ఈ ఘటన చోటుచేసుకోవడం సంచలనంగా మారింది. తన ఆత్మహత్యకు కారణాలను సెల్ఫోన్లో రికార్డు చేసి మరీ ప్రభాకర్ బలవన్మరణం పొందడం కలకలం రేపింది. అయితే ఈ ఆత్మహత్య వెనుక దాగి ఉన్న రాజకీయ కోణాల కోసం ఇప్పటికే అన్వేషణ కొనసాగుతోంది. ఆ రైతును మాయ మాటలతో రెచ్చగొట్టి ఆత్మహత్యకు కొందరు వ్యక్తులు పురిగొల్పారన్న ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ కేసు పూర్వాపరాలపై స్వయంగా దృష్టి పెట్టారు. అలాగే కారేపల్లి మండలం హలియా తండాకు చెందిన భద్రయ్య సైతం తన భూమిని ఒక మాజీ ప్రభుత్వ అధికారి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నాడని ఆవేదన చెందుతూ పురుగుల మందు సేవించాడు. అక్రమదారులు ట్రాక్టర్లతో తన పొలాన్ని దున్నడాన్ని జీర్ణించుకోలేకపోయిన భద్రయ్య ఆ పొలంలోనే పురుగుల మందు సేవించాడు. కాగా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన సీతయ్య అనే రైతు సోమవారం కలుపు మందు సే వించి ఆత్మహత్యకు ప్రయత్నిం చాడు. తాను కొనుగోలు చేసిన ఐదున్నర ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకోనివ్వకుండా మత్స్యశాఖ సిబ్బంది అడ్డుపడుతున్నారని ఈ రైతు ఆవేదన చెందాడు. తన పొలంలోకి వెళితే అసలు అది తన భూమే కాదన్నట్లు దౌర్జన్యం చేస్తున్నారని మనోవేదన చెందిన ఆ రైతు గడ్డి మందు సేవించి తనవు చాలించాలని ప్రయత్నించాడు. ప్రస్తుతం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రఘునాథపాలెం మండలం రజాబ్ అలీ నగర్ కు చెందిన గిరిజన రైతు బోడా ప్రసాద్ సోమవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు..15 ఏళ్ళుగా ఏడెకరాల పోడు భూమిని సాగు చేస్తున్నాడు.. ఈ ఏడాది వేరే గ్రామానికి చెందిన కానిస్టేబుల్ వచ్చి బోడా ప్రసాద్ కుటుంబాన్ని వేధిస్తున్నాడు. కానిస్టేబుల్ దౌర్జన్యం ప్రసాద్ పురుగు మందు సేవించాడు. ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రి చికిత్స పొందుతున్న ప్రసాద్ పరిస్థితి విషమంగానే ఉందని డాక్టర్లు చెబుతున్నారు. ఈ నలుగురు రైతులు వారం రోజుల వ్యవధిలోనే ఆత్మహత్యకు ప్రయత్నిం చడం జిల్లాలో కలకలం రేపుతోంది.

### అధికారులదీ అదే బాట..

ఓ వైపు రైతుల ఆత్మహత్యలు గుబులు పుట్టిస్తుండగా మరోవైపు విచక్షణ కలిగిన అధికారులు సైతం అదే బాట పడుతున్నారు. అశ్వారావుపేట మండల సబ్ ఇన్స్పెక్టర్ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకుని మరణించడం పోలీసు వర్గాలను ఓ కుదుపు కుదిపింది. సీఐ జితేందర్ రెడ్డి తనను వేధిస్తున్నారని ఆరోపిస్తూ వారం కిందట పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఆయన సికింద్రాబాద్లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఏడు రోజుల తర్వాత మృత్యువాత పడ్డాడు. ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు అఫ్జల్ హసన్ సైతం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయ త్నించడం ఉద్యోగ వర్గాల్లో కలకలం రేపింది. ఇటీవల ఒక భూ వివాద కేసులో ఇరుక్కున్న ఆయన సమస్య పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాల్సి వచ్చింది. ఆ క్రమంలో అనూహ్యంగా మరో కేసును అతనిపై మోపిన పోలీసులు అక్కడికక్కడే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. రిమాండ్ అనంతరం బెయిల్ పై బయటికి వచ్చిన అఫ్జల్ పై మరో భూకబ్జా కేసు పెట్టి కటకటాల్లోకి పంపే యత్నాల్లో పోలీసులు ఉన్నట్లు సమాచారం ఉండడంతో తీవ్ర మనస్థాపానికి గురై నిద్ర మాత్రలు మింగి ఉసురు తీసుకోవాలని భావించాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించడంతో చికిత్స అనంతరం ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు.

### ఒక్కక్షణం ఆలోచిస్తే..

ఒత్తిడిలు.. వేధింపులు.. కక్ష సాధింపులు.. కార్పణ్యాలు ఇలా కారణాలు ఏవైనా సరే తలెత్తినప్పుడు మానసికంగా బలహీన పడడం సర్వసాధారణం. ఇలాంటి సమయంలో ఆలోచన నశించి ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవడం ఆత్మహత్యలకు కారణంగా మారుతుంది. తల్లిదండ్రులు, కట్టుకున్న భార్య, పిల్లలను సైతం త్యజించి ఈ జీవితాన్ని చాలించాలన్న భావన కలగడం ప్రాణాలకే ముప్పు తెచ్చి పెడుతుంది. అయితే అశ్వారావుపేట ఎస్సై ఆత్మహత్య ఉదంతం ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోంది. సీఐ వేధింపుల కారణంగా పురుగుల మందు సేవించిన ఆయనకు కొన్ని క్షణాల వ్యవధిలోనే బతకాలన్న కోరిక కలిగింది. తన భార్య, పిల్లలు గుర్తుకు రావడంతో అతనే స్వయంగా 108 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడం ఆ చివరి క్షణాల్లో అతని మానసిక స్థితిని, మదనపాటును తెలియజేస్తుంది. ఆత్మహత్యకు ప్రయత్నించిన తర్వాత కడుపులో పేగులు మెలిపెడుతున్న ఆ అంతిమ క్షణాల్లో బతకాలన్న కోరిక కలగడం.. అందుకోసం విపరీతంగా ప్రయత్నాలు చేయడాన్ని చూసిన హృదయాలు ద్రవిస్తాయి. ఇదే కొద్దిపాటి విచక్షణతో ముందే జాగ్రత్త పడితే చనిపోవాలన్న ఆ బలహీన క్షణాలను అధిగమించొచ్చు. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు ఒక్క క్షణం విచక్షణతో ఆలోచిస్తే ఉద్యోగ విధులు, పని ఒత్తిడిలు ఇవన్నీ కుటుంబం కంటే ఎక్కువ కాదన్న విషయం అవగతం అవుతుంది. పరిస్థితి చేయి దాటిపోయిన తర్వాత బతకాలన్న కోరిక కలగడం ఎక్కువ కేసుల్లో కనిపిస్తుందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. జీవితం ఎంతో విలువైన ప్రసాదమని బలవన్మరణ నిర్ణయం సరైనది కాదని గుర్తించగలిగితే అక్కడి నుంచే కొత్త జీవితానికి పునాది పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

---

## సమాధుల స్థలం కబ్జాకు యత్నం!

**మందమర్రి, జూలై9 (జనంసాక్షి) :** భూ కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి. స్థానిక కేకే ఓసి పక్కన ఉన్న సమాధుల స్థలాన్ని పవన్ కుమార్ అనే వ్యక్తి ట్రాక్టర్ తో దున్నించి సమాధులను తొలగిస్తూ, కబ్జాకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ అతనిపై చర్యలు తీసుకోవాలని, మంగళవారం తాసిల్దార్ చంద్రశేఖర్ కు స్థానికుల వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా ఆ స్థలంలో శవాలకు అంత్రక్రియలు నిర్వహించడం సమాధులు కట్టడం జరిగిందని వారు పేర్కొన్నారు రోడ్డు పక్కన స్థలం కావడం ఇటీవల భూములకు రేట్లు పెరగడంతో పవన్ కుమార్ అనే వ్యక్తి ఈ భూమిని కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్నాడని వారు పేర్కొన్నారు ఆ భూమి జోలికి రావద్దని అది స్మశాన వాటికకు స్థానికులు అందరు వినియోగించుకుంటున్నారని వారు పేర్కొన్నారు అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను పోలీసు యంత్రాంగాన్ని కోరారు. ఇప్పటికైనా పవన్ కుమార్ ఆ స్థలం వైపు చూడవద్దని ఒకవేళ ఆ స్థలంలోకి అతను వస్తే స్థానికుల చేతిలో శిక్ష తప్పదని వారు హెచ్చరించారు. ఈ ఆందోళనలో స్థానికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

## ఏబీవీపీ ఏర్పాటై నేటికి 75 ఏళ్లు పూర్తి

- కరీంనగర్ ఎంపి, కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ బ్యూరో, జులై 09 (జనం సాక్షి) :** అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఏర్పాటై నేటికి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కరీంనగర్ ఎంపీ, కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. వారు మాట్లాడుతూ... 75 ఏళ్ల క్రితం ఢిల్లీలో ఐదుగురితో ప్రారంభమై మారుమూల గ్రామాల నుండి మహానగరాల వరకు విస్తరిస్తూ 50 లక్షలకుపైగా సభ్యత్వంతో దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఆవిర్భావించిన ఏకైక సంస్థ ఏబీవీపీ మాత్రమేనని అన్నారు. విద్యార్థి సమస్యలతోపాటు జ్ఞానం, శీలం, ఏకతా ఆధారంగా విద్యార్థుల్లో నిర్మాణాత్మకమైన దేశభక్తిని పెంపొందిస్తూ దేశ పునర్నిర్మాణంలో భాగస్వామ్యమైన ఏకైక విద్యా సంస్థ ఏబీవీపీ. అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ కేరళ, తెలంగాణ, బెంగాల్, అసోం సహా అనేక రాష్ట్రాల్లో ఎంతోమంది కార్యకర్తలను హత్యగావింపబడ్డా.. విద్యా కేంద్రాలే ఆధారంగా విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్న సంఘం ఏబీవీపీ అని ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో ఏబీవీపీ పాత్ర మరువలేనిదని ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సత్యగ్రహాలు చేసి జాతిని ఏకం చేసిన సంస్థ ఏబీవీపీఅన్నారు. వెంకయ్య నాయుడు, సుశీల్ కుమార్ మోడీ, అరుణ్ జైట్లీ, జేపీ నడ్డా సహా ఎందరో నాయకులు ఏబీవీపీ నుండి ఎదిగినవారే. 'సేవ్ అసోం టుడే.. సేవ్ ఇండియా టుమారో' నినాదంతో చారిత్రాత్మక అసోం ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న విద్యా సంస్థ ఏబీవీపీ అని ఇంజనీరింగ్, మెడిసిన్ సహా వివిధ విభాగాల్లో లీడర్ షిప్ ను అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలతో దూసుకుపోతున్న ఏబీవీపీకి ప్రత్యేక అభినందనలు కరీంనగర్ ఎంపి, కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

---



## ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగలం

- పట్టుబడ్డ కంచనపల్లి పంచాయతీ సెక్రెటరీ పగిడి శివాజీ

**జనగామ ప్రతినిధి, జులై 09(జనంసాక్షి) :** జనగామ జిల్లా రాఘునాథపల్లి మండల కేంద్రంలో కంచనపల్లి పంచాయతీ సెక్రెటరీ పగిడి శివాజీ 20వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు.. వివరాలు పరిశీలిస్తే కాంచన పల్లి గ్రామంలో పనులకు సంబంధించిన బిల్లుల విషయంలో కంచనపల్లి తాజా మాజీ సర్పంచ్ భర్త గవ్వాని నాగేశ్వరరావులు కార్యదర్శి నీ సంప్రదించగా 20వేలు రూపాయలు లంచం డిమాండ్ చేయడంతొ ఏసీబీ ని ఆశ్రయించగా ఏసీబీ రైడ్ చేసి లంచం తీసుకుంటూ ఉండగా పట్టుకున్నారు.

---

## యువత మత్తుకు బానిసలుగా కావద్దు


- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ



**వరంగల్ ఈస్ట్, జూలై 09 (జనం సాక్షి) :** యువత మత్తుకు బానిసలుగా మారవద్దని యువతకు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని ఆలోచన ఆచార్య రవి రూపొందించిన వాల్ పోస్టర్లను వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు యువత భవిష్యత్తు నాశనం చేయడంతో పాటు ఎన్నో కుటుంబాలు చింద్రం అవుతున్నాయని, యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని సూచించారు.


## భార్య కోర్టు విడాకుల నోటీసు

- మనస్థాపంతో భర్త ఆత్మహత్య



**చిట్యాల, జూలై 9(జనంసాక్షి) :** భార్య కాపురానికి రాకుండా కోర్టు నుంచి విడాకుల నోటీసులు పంపడంపై మన స్థాపన చెందిన భర్త నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య కు పాల్పడిన ఘటన సోమవారం రాత్రి మండలంలోని చల్లగరిగ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి చల్లగరిగ గ్రామానికి చెందిన పినగాని శివ రామకృష్ణ( 34 )కు హనుమ కొండ జిల్లా కమలాపూర్ మండలం గునిపర్తి గ్రామానికి చెందిన కూచన మారుతితో వివాహం జరిగింది. కొద్ది కాలం పాటు కుటుంబ కలహాల వల్ల మారుతి తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉంటూ కాపురానికి రాకుండా కోర్టు ద్వారా విడాకుల నోటీసులు పంపింది. మంగళ వారం కోర్టులో హాజరు కావలసి నందున మనస్థాపన చెందిన శివరామకృష్ణ సోమవారం రాత్రి ఇంటిలో తన రోజు వాడే టాబ్లె ట్లను అధికమోతదులో తీసుకొని నిద్రించాడు. తెల్లవారు జామున తండ్రి రాజేందర్ గమనించి అతన్ని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి కీ తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తన కుమారుడి ఆత్మహత్యకు కారణమైన మామ కూచన నర్సింగం, భార్య మారుతి, అత్త లక్ష్మి లపై చర్యలు తీసుకోవాలని మృతుని తండ్రి పినాగాని రాజేందర్ పోలీస్ ల కు ఫిర్యాదు చేశాడు.

## వరంగల్ లేబర్ కాలనీలో అనుమానాస్పదంగా భార్యాభర్తల మృతి?



**వరంగల్ ఈస్ట్, జూలై 09 (జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజక వర్గంలోని లేబర్ కాలనీలో భార్యాభర్తలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటన అనుమానాస్పదంగా మారింది. లేబర్ కాలనీ సమీపంలోని చెన్నారెడ్డి కాలనీలో మంద చరణ్(45),మంద స్వప్న(40) దంపతులతోపాటు ముగ్గురు పిల్లలు ఉంటున్నారు. ఈ ఇద్దరు భార్యాభర్తలు మృతిచెందినట్టు మంగళవారం స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ తో పాటు మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ మల్లయ్య పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు. అయితే ఈ సంఘటన కారణాలు తెలియాల్సి ఉంది . పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తలు ఇద్దరూ చనిపోవడంతో వారికున్న ముగ్గురు పిల్లలు అనాథలైనట్లు స్థానికులు ఆయా కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేయడం కనిపించింది.

---

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

- మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహద పడుతాయని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జయశంకర్ ఎకో పార్కులో అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వన మహెూత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్పీ కిరణ్ ఖరే, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విరివిగా మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా విస్తీర్ణం లో అడవి ప్రాంతం ఎక్కువగా ఉన్న జిల్లాగా ప్రభుత్వం సూచించే విధంగా వనమహెూత్సవం ద్వార జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రహదారుల వెంబడి, ఖాళీ ప్రదేశాలలోను, అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోను, పాఠశాలల్లోను మొక్కలు నాటాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. పెద్ద మొత్తంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. కాలుష్య నివారణకు ప్రతి ఇంటి ఆవరణలో కనీసం మూడు నుండి ఐదు మొక్కలు తప్పకుండా నాటాలని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని సింగరేణి, అటవీశాఖ, గ్రామ పంచాయతీ, మున్సిపల్ నర్సరీల ద్వారా గ్రామ, మున్సిపల్ స్థాయిలో ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. వృక్షాలను మనం రక్షించినప్పుడు అవి తిరిగి మనల్ని రక్షిస్తాయని, పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరు కంకణ బద్ధులుగా గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలను నాటాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భూపాలపల్లి జిల్లా రాష్ట్రంలోనే పర్యావరణ సమతుల్యత కలిగిన జిల్లా అని, ప్రతి కుటుంబం తమ ఇంటి ఆవరణలో ఖాళీ స్థలాల్లో కచ్చితంగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్ఓ వసంత, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, అటవీశాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

---

## గ్రామాల్లో కోతుల బెడద



**కడెం, జులై 9 (జనం సాక్షి) :** కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో మంగళవారం రోజు గ్రామపంచాయతీ వద్ద పెద్ద మొత్తంలో కోతులు గుంపుగా జమయ్యాయి. మంగళవారం రోజు గ్రామపంచాయతీ సమీపంలో కూరగాయల మార్కెట్ కొనసాగే సందర్భంలో కోతులు విచ్చలవిడిగా మార్కెట్లోకి చొరబడి పండ్లు కూరగాయలను ధ్వంసం చేశాయి మార్కెట్లో ఉన్నటువంటి చిరు వ్యాపారులు, అవసర నిమిత్తం మార్కెట్కు వచ్చినటువంటి ప్రజలు కోతుల మందలు మందలుగా మీదికి రావడం చూసి భయభ్రాంతులకు గురయ్యారు. అలాగే గత కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందినటువంటి ఎట్టెం శ్రీను శ్రీను అనే వ్యక్తి మేకను కోతులు మీద పడి కొరికినట్టుగా, పలువురికి గాయాలు చేసినట్టుగా, గ్రామంలో ఉన్నటువంటి పెంకుటిల్లుల పై కప్పులను తీసేస్తూ నష్టాన్ని చేకూరుస్తుంన్నాయని, దాదాపు గ్రామంలో 150 కి పైగా కోతులు ఉన్నాయంటూ గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కోతుల ను గ్రామం నుండి పట్టుకు వెళ్లి అడవిలో విడిచిపెట్టాలని, గ్రామ ప్రజల కు ప్రమాదం నుండి విముక్తి కలిగించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు...

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
10 జూలై 2024

# గ్రీన్ ఫీల్డ్ హైవే వల్ల తల్లడిల్లుతున్న తండాల ప్రజలు





ప్రతిష్టాత్మకంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రవాణా సౌకర్యాలు పెంచేందుకు,త్వరితగతిన సరుకులు గమ్యస్థానాలకు చేర్చేందుకు యుద్ధ ప్రాతిపాదికగా భారీ ఎత్తున గ్రీన్ ఫీల్డ్ హైవేలు,బ్రౌన్ ఫీల్డ్ హైవేలు నిర్మిస్తుంది. గతంలో ఉన్న హైవేలను మెరుగు పరచి నూతన నిర్మాణాలు చేపట్టడాన్ని బ్రౌన్ ఫీల్డ్ హై వే అని, నూతనంగా సర్వే చేసి మరో మార్గం నిర్మించడాన్ని గ్రీన్ ఫీల్డ్ హై వే అని సంభోదిస్తారు. మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ వాణిజ్య రాజధాని విజయవాడకు నూతనంగా గ్రీన్ ఫీల్డ్ హై వే మార్గం తెలంగాణలోని వరంగల్ జిల్లాలోని గీసుకొండ,నెక్కొండ,మహబూబాబాద్ జిల్లాలోని ఇనుగుర్తి,కేసముద్రం,కొరివి మండలంలోని గ్రామాలలో పరిధిలోని గ్రామాలు, తండాల మీదుగా కొండ చిలువ వలె ఖమ్మం జిల్లాలో ప్రవేశించి తదనంతరం విజయవాడకు చేరుకుంటుంది. ఉమ్మడి వరంగల్,ఖమ్మం జిల్లాలలో లంబాడీ గిరిజనులు ఊరికి దూరంగా తండాలలో జీవిస్తున్నారు.ఇట్టి తండాలు చుట్టు ప్రక్కల గ్రామ పంచాయతీ పరిధిలో ఉండటం వలన నిర్లక్షానికి గురై అమాయక గిరిజనులు అభివృద్ధికి నోచుకోలేదు. ఈ సమస్యకు పరిష్కార మార్గం ఆలోచించి గత రాష్ట్ర ప్రభుత్వం లంబాడీ గిరిజన వికాసాభివృద్ధి కై తండాలను గ్రామ పంచాయితీలుగా గుర్తించి వారికి స్వయంపాలన అధికారం అందించింది.దీని వలన గిరిజనులే సర్పంచులుగా,ఎంపీటీసీలు ఎన్నుకోబడి శాశ్వత రోడ్లు,గ్రామ పంచాయతీ భవనాలు,పాఠశాలలు నిర్మించుకొన్నారు.ఈ లంబాడీ గిరిజనులు వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారు.ప్రాథమిక,ఉన్నత విద్య,వైద్యం కొరకు మండల,జిల్లా కేంద్రాలకు పోవాలంటే వారికి ఉన్న ఏకైక మార్గం వారి తండాల్లో ఉన్న చిన్న రహదారులే శరణ్యం.హై వే నిర్మాణంలో భూములు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తున్నారు.నేడు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హై వే నిర్మాణం కొరకు మట్టి,ఇతర సామగ్రి తరలించేందుకు భారీ లారీలు, టిప్పర్లు,రోడ్ రొల్లర్ లను కాంట్రాక్టర్లు ఉపయోగిస్తున్నారు.ఈ భారీ వాహనాల రాక పోకలు వ్యవసాయ భూములు,తండాల్లో ఉన్న మార్గాల్లో పయనిస్తున్నందువల్ల రోడ్లు చెడిపోయి గుంతలమయంగా ఉంది.ఎండ కాలంలో దుమ్ము,ధూళితో బాధ పడ్డారు.ఈ వర్ష కాలంలో మరింతగా గుంతలు ఏర్పడి నడవాలన్న, ద్విచక్ర వాహనాలు నడపాలన్న గిరిజన తండా ప్రజలు,పల్లె వాసులు చాలా పడుతున్నారు. గుంతలమయమైన రోడ్ల వలన ప్రమాదాలు జరిగే అవకాశముంది.కావున హై వే కాంట్రాక్టర్లు వారి భారీ వాహనాలు పయనించేందుకు ప్రత్యేక మార్గాలు నిర్మించుకొని గ్రీన్ ఫీల్డ్ హై వే నిర్మాణం చేయాలి.అంతే కాని పాత తండాల రోడ్ల గుండా భారీ కాంట్రాక్టు వాహనాలు పయనించకూడదని తండా ప్రజలు వేడుకుంటున్నారు.

ఆళవందార్ వేణు మాధవ్
హైదరాబాద్
8686051752

# మోడీ విదేశాల్లో.. మణిపూర్‌లో రాహుల్!

*మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారు. రష్యా పర్యటనలో మన పీఎం బిజీ... ఇక్కడ దేశంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మణిపూర్ కు వెళ్లి బాధితులను పరామర్శించే పని లో ఉన్నారు. మణిపూర్ బోరు మన్నది. రాహుల్ ను చూడగానే బాధితులు ఆగమాగం అయిపోయారు. కన్నీరు, మున్నీరు అయ్యారు. పరిస్థితి హృదయ విదారకంగా మారిపోయింది.రాహుల్ దగ్గర గా వెళ్లి వారిని ఓదార్చారు. పీఎం మాత్రం రష్యా లో అక్కడ గౌరవాభివందనాలను అందుకుంటున్నారు. ఒక వైపు దేశంలోని ఏ మూలలో కష్టం వచ్చినా రాహుల్ అక్కడికి వెళ్లి పరామర్శలు, భరోసా లు ఇస్తున్నారు. వారికి నమ్మకంగా, ధైర్యం చెబుతున్నారు. మరో వైపు అస్సాంలో వరద బాధితుల వద్దకు కూడ రాహుల్ వెళ్లారు. దేశంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎన్నికలకు ముందు ఎలా పర్యటించారో ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడు అయ్యాక మరింత శ్రద్ధతో దేశంలో పర్యటిస్తున్నారు.*





ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223



మణిపూర్ కు రాహుల్ వెళ్లడం ఇది మూడోసారి కాగా, మోడీ మొత్తంగా మొన్నటిదాకా దేశంలో, విదేశాల్లో 162 పర్యటనలు చేయగా ఆయన కనీసం ఒక్కసారి కూడ మణిపూర్ కు వెళ్ళలేదు. మణిపూర్ లో ఇద్దరు యువతులను నగ్నంగా ఊరేగించిన సంఘటన సందర్భంగా పీఎం మోడీ చాలా బాధగా ఉందని, తన గుండె ఆవేదనతో బరువెక్కిందని అన్నారు. మొన్నటికి మొన్న పార్లమెంట్ లో మాట్లాడుతూ మణిపూర్ లో ప్రశాంతంగా ఉందని, స్కూల్ ల్లు, కాలేజ్ లు, ఆఫీస్ లు అన్నీ పని చేస్తున్నాయి, అన్నారు, కొంత మంది మణిపూర్ విషయంలో ఏదో జరిగి పోతుందని, రాజకీయం చేస్తున్నారు, అంటారు. నిజానికి రాహుల్ గాంధీ సోమవారం మణిపూర్ లో పర్యటించినపుడు బాధితులు ఏం మాట్లాడారో, ఎంత అభద్రత, భయం వ్యక్తం చేసారో, చూసాము! మిజోరం కు కూడ మన పీఎం మోడీ పోలేదు.

### 14 నెలలు దాటింది!

మణిపూర్ లో హింస ప్రారంభం అయి 14 నెలలు కావస్తున్నది.మన ప్రధాన మంత్రి కి అక్కడికి వెళ్ళడానికి సమయం దొరకడం లేదా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా!అక్కడ ఇద్దరు యువతుల మీద దాష్టికం జరిగినపుడు పీఎం కర్ణాటక ఎన్నికల్లో బిజీ గా ఉన్నారు. ఇప్పుడేమి పని మీద బిజీ గా ఉన్నారో పీఎం మోడీనే సమాధానం చెప్పాలి!378 రోజుల రైతుల చారిత్రాత్మక ఆందోళన సందర్భంగా 750 మంది రైతులు ఢిల్లీ బోర్డర్లలో ఊపిరి కోల్పోయినపుడు కూడ కనీసం నోరు తెరిచి ఒక్క మాట కూడ మాట్లాడని పీఎం మోడీ, జమ్మూ, కాశ్మీర్ మాజీ గవర్నర్ మల్లిక్ రైతులు ఇలా ప్రాణాలు కోల్పోతున్నారని, సమస్యపట్ల శ్రద్ద చూపండి అని కోరినప్పుడు, వారేమైనా నాకోసం చేస్తున్నారా? అని ప్రశ్నించినట్లు ఆ మాజీ గవర్నర్ పలు ఇంటర్వ్యూలలో పేర్కొనడం అందరికీ తెలిసిందే! మనుషుల ప్రాణాల విషయం లో పీఎం మోడీ కి విలువ ఉండదని రైతు నాయకుడు రాకేష్ టికాయట్ అంటూ ఉంటారు.మొత్తంగా ఇప్పుడు పార్లమెంట్ ప్రారంభం కాగానే మరోసారి మణిపూర్ విషయం ను రాహుల్ గాంధీ లేవనెత్తే పరిస్థితులు ఉన్నాయి.

### పీఎం చొరవ తీసుకోవాలి!

మణిపూర్ సమస్యను పరిష్కారం చేయడానికి పీఎం చొరవ తీసుకోవాలి. ముందు అక్కడి సీఎం ను మార్చాలి. ఒక కమిటీ వేసి ఇరు వర్గాల వారి తో చర్చించాలి. వన్ సైడ్ గా ఆలోచించడం తగదు. ఈర్ష్య, పగలతో కాకుండా శాంతి యుతంగా పరిస్థితి పరిష్కారానికి కృషి చేయాలి. దేశంలో మణిపూర్ విషయం, ఘటనలు, సీరియస్ గా తీసుకోవాల్సినవి! పార్లమెంటరీ కమిటీ వేయాలి, గతంలో ఎడిటర్స్ కొందరు అక్కడికి వెళ్లి సమర్పించిన రిపోర్ట్ ను కూడ పరిశీలించాలి. మణిపూర్ వైపు దేశమే కాదు ప్రపంచం చూస్తున్నది. ఢిల్లీలో ఉన్న 30 వేల మందికి పైగా మణిపూర్ వాసులు సైతం న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. రెండు వర్గాలకు న్యాయం, తృప్తి కలిగే నిర్ణయం తీసుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల్లో మణిపూర్ లో బీజేపీ ఓటమి పాలు అయ్యింది. కాంగ్రెస్ పార్టీ కి 46 శాతం ఓట్లు వచ్చాయి.బీజేపీ ఓట్ల శాతం 23 మాత్రమే అయింది. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ మణిపూర్ లో విజయం సాధించింది. రాజకీయ పరిస్థితి కూడ మారింది. అక్కడి ప్రజల జీవితాలు మారాలి! అందుకు నిజాయితీగా కృషి జరగాలి!

## వాన- కాలం-పంట

వాన రావాలి
కప్పతల్లి పాటలు పాడాలి
ఏరువాక వాన
సాలులో విత్తనం చాన
చినుకులకు పులకరించి
కొత్తదనానికి పలకరింపు
రైతు కంటిలో
పచ్చదనపు కాంతి...
వాన కాలం పంట
వానలు కురువాలి
కాలం కలిసి రావాలి
పంట చేతికి రావాలి
గాదెలు నిండాలి
రైతు గర్వం
దేశ గర్వం
ప్రగతికి మార్గమని
విశ్వానికి తెలిసి రావాలి

రేడియమ్
9291527757

## కలల దాడి

పడుకున్నాను
ఓ కల నా కన్నుల్లో చేరింది
గుర్రమెక్కి స్వారీ చేస్తున్నట్లు నేను
కొద్ది సేపటికి మళ్ళీ
ఓ కల నా కన్నుల్లో దూరింది
రథం మీద కూర్చొని తోల్తున్నట్లు నేను
చాప మీద మరో పక్కకి మళ్ళీ
దుప్పటి కప్పుకొని
తెల్లారు ఝామున మరో కల
పాడె మీద పడుకొని వెళ్తున్నట్లు
దిగ్గున లేచా
చెమట తుడిచా
మరణం ఇలలోనే కాదు కలలోనూ భయమే
(మ) రణంలో తప్పని ఓటమే

కోటం చంద్రశేఖర్
9492043348

## రచనలకు ఆహ్వానం

సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణలపై రచనలకు, సాహిత్యం, కవిత్వం, పుస్తక సమీక్షలు రాసే కవులకు జనంసాక్షి ఆహ్వానం పలుకుతోంది. మీ రచనలను hyd-janamsakshi@gmail.com కు పంపగలరు. మీ రచనలు క్లుప్తంగా, సూటిగా పేజీమేకర్ ఫైల్‌లోగానీ, యూనికోడ్ ఫార్మేట్‌లోగానీ పంపించగలరు.

# హత్రాస్ ఘటనను ఖండించండి!

ప్రథమ సమాచార నివేదిక(ఎఫ్ఐఆర్)లో పేరు లేకపోయినప్పటికీ తనకు తాను దైవాంశ సంభూతుడిగా చెప్పుకునే భోలే బాబా(స్వయం-స్టైల్ గాడ్‌మ్యాన్) పరారీలో ఉండటం అస్పష్టమైన కల్ట్‌లతో ఫాసిస్ట్ సంబంధాన్ని బహిర్గతం చేస్తున్నది! ఇటీవల హత్రాస్ తొక్కిసలాటలో మరణించిన వారి సంఖ్య ఈదశాబ్దంలో అత్యంత భయంకరమైన మరియు విషాదకరమైనది. ఈ దుర్ఘటనలో మరణించిన వారి సంఖ్య 121కి చేరుకుంది. ఇందులో ఒక పురుషుడు తప్ప బాధితులందరూ మహిళలు మరియు పిల్లలేనని వివిధ నివేదికల ద్వారా తెలుస్తున్నది.యోగి ప్రభుత్వం దైవాంశ సంభూతుడిగా , దేవుని ప్రతినిధిగా చెప్పుకునే(స్వయం-స్టైల్ గాడ్ మాన్ )భోలే బాబా అలియాస్ సూరజ్ పాల్ సింగ్‌ను ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ ఐ ఆర్)లో మినహాయించింది. ఎఫ్ఐఆర్ నుండి హిందూ 'సత్సంగ్' (కల్ట్-గేమరింగ్) కు నాయకత్వం వహిస్తున్న ప్రధాన నిందితుడు. ఈ విషాదానికి "సామాజిక వ్యతిరేకులు" కారణంఅని ఆరోపిస్తూ బహిరంగ ప్రకటనలు జారీ చేయడానికి పాల్ అనుమతించబడినప్పటికీ, ముఖ్యమంత్రి ద్వారా స్వయంగా పరోక్షంగా ఒక "కుట్ర" జరిగిన అవకాశాన్ని సూచిస్తున్నది. కేసు కదులుతున్న దిశను ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది.

మొత్తం సమస్యలో స్థానిక పరిపాలనతో సహా మొత్తం పాలనా యంత్రాంగం విధి నిర్వహణలో పూర్తి నిర్లక్ష్యం ఇప్పటికే బహిర్గతమైంది. తొక్కిసలాట జరిగిన ప్రదేశం చాలా చిన్నది కావడంతో గుమికూడిన జనం ఉండేందుకు వీలు లేకుండాపోయింది. 80,000 మందికి అనుమతి మంజూరు చేయబడినప్పటికీ, వాస్తవంగా హాజరైన వారి సంఖ్య 2.5 లక్షల కంటే ఎక్కువగా ఉంది. వారిలో అత్యధికులు సమాజంలోని అత్యంత అణగారిన వర్గాలకు చెందినవారు. దీవెనలు పొందేందుకు చిహ్నంగా ధూళిని సేకరించడానికి అతని కారు వెనుక నడుస్తున్న 'భక్తులను' 'సేవదార్స్' అని పిలిచే దేవత యొక్క



ప్రైవేట్ సైన్యం అడ్డుకున్నప్పుడు తగిన పోలీసుల మోహరింపు అక్కడ లేదు. పాల్ యొక్క మనుషులు కూడా ప్రజలను కదలకుండా అడ్డుకున్నారు .మరియు తొక్కిసలాట సంభవించినప్పుడు దాని నుండి తప్పించుకున్నారు . స్వయంభు దేవదూత అయిన భోలే బాబా( గాడ్ మాన్) సురక్షితంగా నిష్క్రమించడం గురించి మాత్రమే ఆందోళన చెందారు. సమావేశానికి వెలుపల భద్రత ఏ ఏర్పాటులను చేయని పరిస్థితులు అక్కడ ఉన్నాయి. ఇలాంటి సత్సంగములు జరుగుతున్నప్పుడు ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సరిగా తీసుకోక పోవడం పట్ల , దీనికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాలనా యంత్రాంగాన్ని నిలదీయాలి.

వాస్తవానికి, డేరా సచ్చా సౌదాకు చెందిన గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ వంటి కల్ట్ సాంస్కృతిక లీడర్‌లందరూ అత్యాచారం చేసినందుకు శిక్షించబడ్డారు .మరియు హత్య మరియు బలవంతపు కాస్ట్రేషన్‌లకు పాల్పడ్డారని ఆరోపించబడినందున, సూరజ్ పాల్‌కు కూడా అపఖ్యాతి పాలైన నేపథ్యం ఉన్నట్లు నివేదించబడింది. అతను తరచుగా ఇంటెలిజెన్స్ బ్యూరో యొక్క మాజీ సిబ్బంది అని పేర్కొన్నప్పటికీ, నివేదికల ప్రకారం, సూరజ్ పాల్ సుమారు 28 సంవత్సరాల క్రితం ఇటావాలో హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగిగా నియమించ బడ్డాడు, ఆ తరువాత అత్యాచారం ఆరోపణలతో, ఉద్యోగ సేవల నుండి తొలగించబడ్డాడు. ఆగ్రా, ఇటావా, కస్గంజ్, ఫరూఖాబాద్ మరియు రాజస్థాన్‌తో సహా వివిధ అధికార పరిధిలో అతనిపై అనేక కేసులు నమోదయ్యాయి. అందువల్ల, "సామాజిక వ్యతిరేక అంశాలు" తొక్కిసలాటను సృష్టించాయని చెప్పటానికి అతని స్వంత వ్యాఖ్య అందరికంటే అతనికే బాగా సరిపోతుంది.

ఈ సందర్భంలో, ప్రపంచంలోని అన్ని ఫాసిస్ట్ పాలనల మాదిరిగానే, భారతీయ ఫాసిస్టులు కూడా మతపరమైన ఆరాధనలను, మూఢనమ్మకాలను మరియు ప్రజల ప్రవర్తనను గణనీయంగా ప్రభావితం చేసే అనేక అస్పష్ట సంప్రదాయాలను ఉపయోగించడంలో ప్రవీణులు అని మనం గమనించాలి. జాతకాలు మరియు అదృష్ట మంత్రాల వలె, కల్ట్ నాయకులు కూడా, పాలనతో హానికరమైన సంబంధంలో, ప్రజల చైతన్యాన్ని తారుమారు చేయడంలో మరియు వారిని రాజకీయం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. ఆకాశాన్నంటుతున్న కార్పొరేట్-దోపిడీ ప్రక్రియలో శ్రమించే మరియు అణగారిన ప్రజలపై విధించిన భయాందోళనల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి ఆరాధనలు మరియు మూఢ నమ్మకాలు దోపిడి వర్గాలకుఅనివార్యమైన సాధనాలు.

ఇది సమకాలీన భారతదేశంలో విస్తృత రాజకీయ సందర్భాన్ని కలిగి ఉంది. 2014లో ఫాసిస్ట్ మోడీ పాలన ఆవిర్భవించినప్పటి నుండి, ఉత్తర ప్రదేశ్ (యుపి)లో ఫాసిస్ట్ "డబుల్ ఇంజన్లు" పరిపాలన రావడంతో, అస్పష్టత మరియు నకిలీ సైన్స్ హిందూత్వ చర్చలో అంతర్భాగంగా మారాయి. 2000 సంవత్సరాల క్రితం భారతదేశంలో ప్లాస్టిక్ సర్జరీ వ్యాప్తిపై మోడీ స్వంత వాక్చాతుర్యంలో వ్యక్తీకరించబడిన నకిలీ శాస్త్రాన్ని కీర్తించడం, ఇతర విషయాలతోపాటు, గణేష్ దేవుడి ఏనుగు తలని ఉదహరించడం ఒక ఉదాహరణ మాత్రమే. ఇతర హిందూత్వ నాయకులు "హిందువులకు" స్టెమ్ సెల్ మరియు టెస్ట్-ట్యూబ్ సాంకేతికత, "విష్ణు చక్ర", క్షిపణుల రూపంగా ఉన్నాయని, వేల సంవత్సరాల క్రితం విమానాలు మరియు విమానాశ్రయాలు వ్యాప్తి చెందాయని మరియు క్యాన్సర్‌కు ఔషధంగా గోమూత్రాన్ని పేర్కొన్నారని పేర్కొన్నారు. మరియు యోగా చుట్టూ ఉన్న ఆరాధనతో సహా ఇతర అబద్ధాలు దేశంలో అస్పష్టత తీవ్రతరం కావడానికి సారవంతమైన భూమిక ను, క్షేత్రాన్ని అందిస్తాయి.

ఈ రోజు హత్రాస్‌లో ఏమి జరిగిందంటే, అనేక మంది హిందూ దేవతలు తమ ఆరాధనలతో దేశమంతటా పాలక పాలన యొక్క పోషణతో ఎలా విలసిల్లుతున్నారో ఈ ఘటన ఒక ఉదాహరణ మాత్రమే. ఈ విధంగా, భోలే బాబా "సురక్షితమైన" పరారీ మరియు ప్రస్తుత భయంకరమైన, ఘోరమైన, అమానుషమైన నేరానికి అతనిపై క్రిమినల్ అభియోగాలు నమోదు చేయడానికి యోగి పాలన విముఖత చూపడం, హిందుత్వ కల్ట్ నాయకులు మరియు ఫాసిస్ట్ పాలన మధ్య అపవిత్ర బంధాన్ని తెలియజేస్తున్నది. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర,భౌతికవాద శక్తులు ఇటువంటి దుర్మార్గాలను ఖండించవలసిందిగా, ఫాసిస్టు పాలన పట్ల అప్రమత్తంగా ఉండవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.



పి జె జేమ్స్
ప్రధాన కార్యదర్శి, సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్
న్యూఢిల్లీ
తెలుగు స్వేచ్ఛాను సరణ: మన్నవ హరి ప్రసాద్,
పొలిట్ బ్యూరో సభ్యుడు
9346508846,

# మనసు మాయలో పడి మనుషులను మరవకండి

మనసు మాయలో
పడి మనుషులను
మరవకండి
మనిషికి మరణం
ఒక్కసారి
మాత్రమే కానీ
మనసుకు తప్పు
చేసిన ప్రతి
సారీ మరణమే
అన్న
గౌతమబుద్ధుని
మాటలు
మానవులకు గొప్ప
కనువిప్పు కావాలి

బడికి పోయాక
తెలిసింది
బాల్యంలో ఆడిన
ఆటల విలువ
యవ్వనం వచ్చిన
తర్వాత తెలిసింది
బాల్యం విలువ
కాలేజీలో చేరిన
తర్వాత తెలిసింది
స్కూల్ విలువ
ఉద్యోగంలో చేరిన
తర్వాతజి
తెలిసింది చదువు
విలువజి
పదవీ విరమణ
చేశాకతెలిసింది
ఉద్యోగం విలువ

తల్లి తండ్రి పోయాక
తెలిసింది
తల్లి తండ్రుల విలువ
స్నేహితుడు
దూరమైనాక
తెలిసింది స్నేహం
విలువజి
తగాదా పడ్డ
తర్వాత తెలిసింది
ఆత్మీయుల విలువ
ఆందోళన తర్వాత ఏమి
తెలిసింది
అనురాగాం విలువ

తండ్రి అయిన
తర్వాత తెలిసింది
కుటుంబ బాధ్యతల
విలువజి
తల్లి అయిన
తర్వాత తెలిసింది
బంధుత్వాల విలువ
వృద్ధాప్యం దగ్గర
అవుతున్నప్పుడు
తెలిసింది
యవ్వనత్వం విలువ
మరణానికి
దగ్గరౌతున్నపడుజి
తెలిసింది జీవితం
విలువ

ఏదైన మన
చేతిలో ఉన్నప్పుడు
తెలియదుదానిజి
అసలు విలువ
అనుభవమే గొప్ప
జీవిత సారం

అన్నీ అయిపోతాయి
అని తెలుసు
అహం అడ్డుగోడలో
ఓటమిని అంగీకరించక
మనసు వినదు
మాట తీరు మారదు
మనసు
మాయలోపడి
మానవుడు
దానవుడు
అవుతున్నాడు
అని తెలిసు

అహం కమ్మి
ఆందోళనకు
కుమ్మి
కృంగిపోతున్న
మనో వైఖరిలో
మార్పు రాదు
మనిషికి
ఆత్మీయత
అనురాగం
అనుబంధాలు
అనుభవిస్తేనే
తెలుస్తాయిజి
ఇవి పూల లాంటివి



పెంచితే పెరుగుతాయి
తుంచితే
తరుగుతాయి
పెంచడం తుంచడం
మన మనో వైఖరిపై
ఆధారపడి ఉంటుంది

మనసు మాయ
మరుపు మార్పు
కావాలి
అహం వద్దు
సహనమే ముద్దు
సంఘీభావం
సౌహార్థత హద్దు
కావాలి

నేదునూరి కనకయ్య
(నేదునూరి కళ్యాణ్)
కరీంనగర్ 9440245771



## గ్రోత్ బూస్టింగ్ సొల్యూషన్స్ ఆవిష్కరించిన మోడిఫై

**ఖైరతాబాద్, జూలై 09 (జనం సాక్షి) :**
ఫిన్ టెక్ రంగంలో దూసుకుపోతున్న మోడిఫై మరో ముంద డుగేసింది. ఫార్మా రంగంలో చిన్న, మధ్య తరహా సంస్థలకు ఉపయోగపడే గ్రోత్ బూస్టింగ్ సొల్యూ షన్స్ ను అందుబాటులోకి తెచ్చినట్లు మోడిఫై ఇం డియా కంట్రీ హెడ్ సచిన్ నిగమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ హైద రాబాద్ లో జరుగుతున్న 73 వ ఇండియన్ ఫార్మా స్యూటికల్ కాంగ్రెస్ లో దీన్ని ఆవిష్కరించి, ప్రదర్శిం చినట్లు తెలిపారు. మేకిన్ ఇండియాలో భాగంగా గ్రోత్ బూస్టింగ్ సొల్యూషన్స్ ను మోడిఫై తీసుకొ చ్చిందన్నారు. ఫార్మా ఎస్ ఎంఈలను డిజిటల్ ఫైనాన్సియల్ టూల్స్ తో ఎక్విప్ చేసేందుకు నగదు ప్రవాహాన్ని ఆప్టిమైజ్ చేసేందుకు ఇవి ఉపయోగప డతాయన్నారు. భారతీయ ఔషధ రంగం శరవేగం గా అభివృద్ధి చెందుతోందని, ఈ విభాగంలో ప్రపం చంలోనే అతిపెద్ద ఇండస్ట్రీగా పేరు తెచ్చుకుం దన్నారు. అద్భుతమైన మౌలిక సదుపాయాలు, ఔషధ తయారీ సామర్థ్యంతో ఇండస్ట్రీలో బలమైన ముద్ర వేసుకుందన్నారు.

# మహిళా శక్తికి పెద్దపీట..!

- **సరుకుల విక్రయానికై మార్కెటింగ్ సదుపాయం కల్పించండి**
- **వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**



**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 9 (జనం సాక్షి):**
జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమంలో బాగంగా అన్ని చోట్ల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వన మహోత్సవం, మహిళా శక్తి, సీజనల్ వ్యాధులు, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గత జూన్ మాసంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వరంగల్ జిల్లాలో మహోత్సవం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్లకు పైగా మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, జిల్లాల వారీగా కేటాయించిన లక్ష్యాలను సాధించాలని, గ్రామాలకు అవసరమైన మొక్కలను, అందులో పెద్ద మొక్కలను నాటాలని, ప్రతి మొక్కను జియో టాగ్ చేయాలని సూచించారు. ఆడబిడ్డలను ఆర్థికంగా శక్తిమంతులను చేసి వారిని కోటీశ్వరులను చేయడమే మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని, ఈ పథకాన్ని జిల్లాలలో దిగ్విజయంగా నెరవేర్చాలని సూచించారు. ఉత్పత్తి అయిన సరుకులు మార్కెటింగ్ కు అవసరమైన ప్రణాళికలు, సహకారం అందివ్వడం మహిళాశక్తి పథకంలో భాగమని, , ఈ పథకాన్ని జిల్లాలో దిగ్విజయంగా అమలు చేసి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని, జిల్లా, మండల మహిళా సమాఖ్యలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని యాక్షన్ ప్లాన్ తో వర్క్ షాప్ లు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలి. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుధ్యం ముఖ్యమని, కిచెన్, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, డెంగీ, మలేరియా, అతిసారా వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆశా, ఎ.ఎన్. ఎం. సిబ్బంది క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రాలలో మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. వ్యవసాయ రంగం సంబంధించి ఎరువులకు ఎలాంటి కృత్రిమ కొరత లేకుండా చూడాలని, రైతు భరోసా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు నేస్తం ప్రోగ్రాముల ద్వారా రైతులకు కావలసిన సలహాలు, నూతన సాగు విధానాలపై ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులలో పూర్తి కాని పనులను వెంటనే చేయాలని తెలిపారు. టీచర్ల బదిలీలు విజయవంతంగా జరిపిన విధంగానే ఉద్యోగుల బదిలీలు నిబంధనలను పాటిస్తూ ఈనెల 20 లోగా ముగించాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలో పెండింగ్ పనులను పూర్తి చేయాలనీ, సీజినల్ వ్యాదులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లాలో వనమహోత్సవం క్రింద మొక్కలు నాటేందుకు స్తాలాలను ఎంపిక చేయాలనీ, బదిలీల ప్రక్రియలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ముున్దుకేల్లాలని అధికారులకు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంచార్జి అదనపు కలెక్టర్ సుదీర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యానయాక్, డిఆర్‌డిఎ శ్రీనివాసులు, ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పల్వన్ కుమార్, డిఇఓ రేణుకా దేవి, వ్యవసాయ అధికారి గోపాల్, డిపిఓ జయసుధ, పంచాయత్ రాజ్ ఇఇ. ఉమేష్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో తీరనున్న రాయల్టీ సమస్య

- **నాపరాతి పరిశ్రమకు త్వరలో మంచి రోజులు**
- **గనుల శాఖ అధికారులతో మరోసారి సమావేశం**
- **క్వారీ వేల్పర్,స్టోన్ మర్చంట్ వేల్పర్ అసోసియేషన్ సభ్యులు**



**తాండూరు జులై 9(జనంసాక్షి)**
తాండూరు అంటేనే సుద్ద,నాపరాతి గనులకు పెట్టింది పేరు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే దానిలో సుద్ద, నాపరాతి పరిశ్రమ ముందు వరుసలో ఉంటుంది.అయితే గత పదేళ్లుగా ఈ పరిశ్రమలలో ఎక్కడి సమస్యలు అక్కడే తీష్టవేయడంతో దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఎంతో మంది కార్మికుల కష్టాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి.అయితే గత పదేళ్లుగా ఈ పరిశ్రమలను పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఎన్నికల సమయంలో ఈ పరిశ్రమ పై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఇచ్చిన మాట ప్రకారం గత అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కర్ణాటక రాష్ట్రంతో పోలిస్తే తెలంగాణలో నాపరాతిపై అధిక రాయల్టీ వసూలు చేస్తున్నట్లుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడంతో ఈ పరిశ్రమకు మంచి రోజులు వచ్చినట్లు అయ్యింది.దీనిలో భాగంగానే ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశాలతో గనుల శాఖ సెక్రటరీ సురేంద్ర మెహన్, డైరెక్టర్ సుశీల్ కుమార్‌తో క్వారీ,స్టోన్ వేల్పర్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, నయీం అప్పు సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు అధిక రాయల్టీ వసూలు చేయడం వల్ల సుద్ద, నాపరాతి పరిశ్రమ మనుగడ కష్టం అవుతుందని, ఇలానే కొనసాగితే భవిష్యత్తులో తాండూర్ ప్రాంతంలో ఈ పరిశ్రమలు కనుమరుగు అయ్యే అవకాశం ఉందని,ఇదే గనుక జరిగితే ఈ పరిశ్రమ పై ఆధారపడి జీవనం సాగిస్తున్న వందలాది కుటుంబాలు ఉపాధి కోల్పోవడంతో పాటు, ప్రభుత్వంకు వచ్చే ఆదాయం కూడా తగ్గుతుందని మైన్స్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది, అలాగే కర్ణాటక రాష్ట్ర తరహాలో రాయల్టీల విధానం అమలు చేయాలని ఈ ప్రాంతంలో గనులు, సుద్ద నాపరాతి పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం కూడా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరిన అసోసియేషన్ సభ్యులు, అనంతరం మైన్స్ సెక్రటరీ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు కాబట్టి పూర్తి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడంతో పాటు ప్రభుత్వం కూడా ఏమీ చేస్తే సుద్ద నాపరాతి పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయనే అంశంపై అధ్యయనం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో క్వారీ,స్టోన్ మర్చంట్ వేల్పర్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్ నయీంఅప్పుతో పాటు జుబెర్ లాల, నర్సింహులు, ఫయాజ్, కన్వర్, సంజీవ్, జయినుద్దీన్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## తక్షణమే డీఎస్సీ వాయిదా వేయండి

**ఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు**



**హైదరాబాద్ జూలై 09 (జనం సాక్షి)**
తెలంగాణలో డీఎస్సీ నిరుద్యోగులు రెండు నెలలు వాయిదా కోసం చేపడుతున్న ధర్నా న్యాయబద్ధమైనదని బీఆర్ఎస్వీ తుంగ బాలు తెలిపారు. 60 రోజుల్లో 3 రకాల పరీక్షలు ,120 పుస్తకాలు చదివి ,30రోజులు పరీక్షలు రాయడం రోబోకు కూడా సాధ్యం కాదు. అలాంటిది గడిచిన 7 నెలల్లో ఎన్నికలు, ఉద్యోగాల కోసం ఉద్యమాలు మరియు వెనువెంటనే పరీక్షలు అనే సంకట స్థితిలో డీఎస్సీ నిరుద్యోగులు విపరీత మానసిక ఒత్తిడితో ఉన్నారు. మొన్నటికి మొన్న టెట్ వారం రోజులు, హాస్టల్ వెల్ఫేర్ వారం రోజులు పరీక్షలు నిర్వహించి ఇపుడు వెంటనే డీఎస్సీ పరీక్షలు అనడం ఎంత దారుణమని తుంగ బాలు ప్రభుత్వం అసహనం వ్యక్తం చేశారు. విద్యా వాలంటీర్లు పెట్టి వెంటనే డీఎస్సీ ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులకు 2నెలల ప్రిపరేషన్ సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డైమండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే దొడ్డి దారిలో సీఎం కావడం కాదని రేవంత్ రెడ్డికి చురకలంటించారు. కాంగ్రెస్ నాయకులకు ఉద్యోగాలు నిరుద్యోగులకు ఉద్యమాల అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేసిన గురుకుల జాబులకు ఉద్యోగాలునిచ్చి, పోస్టింగులు ఇవ్వలేదు.కానీ ఏదో ప్రపంచం మునిగిపోయే పరిస్థితి ఉంది అన్నట్లు డీఎస్సీ వారికి వెంటనే పరీక్షలు పెట్టడం చూస్తే,పరిపాలన నేర్వని పిల్లాడు (రేవంత్ రెడ్డి) ప్రపంచాన్ని ఏలినట్లు ఉందని తుంగ బాలు తూర్పార బట్టారు. ఇప్పటికైనా మేల్కొని రేవంత్ రెడ్డి డీఎస్సీ అభ్యర్థుల కోరిక మేర 2నెలలు వాయిదా వేసి మంచి ముఖ్యమంత్రి అనిపించుకో లేకుంటే తెలంగాణ పిచ్చి తుగ్లక్ లా చరిత్రలో నిలిచిపోతావని హెచ్చరించారు.



### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

**మల్కాజిగిరి,జూలై9 (జనంసాక్షి)**
ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిప్యూటీ కమిషనర్ రాజుకు బిఆర్ఎస్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మల్కాజిగిరిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని సర్కిల్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, ఉపేందర్ రెడ్డి, శ్రీరామ్ ఉపేందర్, మల్లేష్ యాదవ్, బాచి, మహేష్ గౌడ్, సతీష్ తదితరులున్నారు.

### పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**కార్పొరేటర్ రావుల శేషగిరి**

**కుత్బుల్లాపూర్ జూలై 9 (జనం సాక్షి)**



పర్యావరణాన్ని కాపాడుకోవా ల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్, బిజెపి నాయకులు రావుల శేషగిరి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఆక్సిజన్ పార్కులో వాకర్స్‌తో కలిసి పార్కు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటాలని సూచించారు. నేడు మనము నాటిన మొక్కలే భావితరాలకు ప్రాణవాయువుగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పి కృష్ణ, మురళీకృష్ణ, సత్యనారాయణ, తారా సింగ్, సిద్ధిరాములు, లక్ష్మణ్, నవీన్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.



### నెల్లుట్లకు జ్యోతిష రత్న పురస్కారం

**కూకట్ పల్లి జులై 09(జనంసాక్షి):**
కెపీహెచ్ కాలనీకి చెందిన ప్రముఖ జ్యోతిష్య సిద్ధాంతి నెల్లుట్ల వేణు గోపాలరావుకి జ్యోతిష్య రత్న అవార్డు ప్రదానం జరిగింది. ఈ నెల 07 వ తేదీన, హబ్సిగూడ లోని, కినారా గ్రాండ్‌లో, జరిగిన వైదిక జ్యోతిష్య సమ్మేళనంలో ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భగా పలువురు వక్తలు జ్యోతిష్య విభాగంలో నెల్లుట్ల సేవలను కొనియాడారు. విశ్వ జ్యోతిష విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిష్య పండితులు దైవజ్ఞ శర్మ, పుచ్చా శ్రీనివాస రావు, పాలపర్తి శ్రీకాంత శర్మ, ఎల్ ఎస్ సిద్ధాంతి, పెండ్యాల సూర్యం శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడి లేకుండా పని చేయండి..!

- **వృత్తి రీత్యా క్రమశిక్షణ అవసరం**
- **వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి**



**వికారాబాద్ జిల్లా జూలై 9( బ్యూరో జనం సాక్షి)**
పోలీస్ సిబ్బంది ఎలాంటి ఒత్తిడి లేకుండా పని చేయాలని జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ పోలీస్ అధికారులతో పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఎస్పీ ముందుగా ఏఆర్ అధికారులు, సిబ్బందితో మాట్లాడించి వారికీ ఉన్న వృత్తి పరమైన ఇబ్బందులు, కావాల్సిన మౌళిక సదుపాయల గురించి మొదలగు విషయాల గురించి అడిగి తెల్సుకోవడం జరిగింది. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది, అధికారులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంతమైన వాతావరణం లో క్రమశిక్షణతో, ఓపికతో విధులు నిర్వర్తించాలని, ప్రతి ఒక్కరు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, అత్యవసరమైనా సమయం లో ప్రతి ఒక్కరు అందుబాటులో ఉండాలని, ప్రతి ఒక్కరు తెలంగాణ పోలీస్ డిపార్ట్ మెంట్ కు జిల్లా పోలీస్ డిపార్ట్ మెంట్ కు మంచి పేరు వచ్చే విధంగా పనిచేయాలని, సమయపాలన మరియు క్రమశిక్షణను ప్రతి ఒక్కరు పాటించాలని, ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎలాంటి చూడు అలవాట్లకు లోనుకాకుండా ఆరోగ్యంగా ఉండాలని, పోలీస్ అధికారులు, సిబ్బంది తెలియజేసిన శాఖపరమైన పనులపైన ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. సిబ్బంది సులువుగా పిర్యాదు చేసుకోవడానికి వీలుగా గ్రేవియన్స్ బాక్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. అనంతరం ఎస్పీ ఏఆర్ హెడ్ క్వాటర్స్‌లో ఉన్న బెల్ అఫ్ ఆర్మ్స్, స్టోర్ రూమ్, ఏఆర్‌డి ఎస్‌పి ఆఫీస్, ఆర్ఐ ఆఫీస్, డ్యూటీ ఆఫీసర్ రూమ్‌లను పరిశీలించారు. ఇట్టి కార్యక్రమంలో డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్ ఆర్ఐలు అంజాత్ పాషా, డేవిడ్ విజయ్ కుమార్ ఆర్ఎస్ఐలు ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైద్యం వికటించి బాలుడు మృతి





**చేవెళ్ల, జూలై 09 (జనంసాక్షి)**
డెంగ్యూ వ్యాధితో చికిత్స పొందుతూ మునిశ్వర్ (11) మృతి చెందిన సంఘటన చేవెళ్ల మండల కేంద్రంలోని పట్నం మహేందర్ రెడ్డి కళాశాలలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న మునీశ్వర్ (11) వర్షిత్ (9)లు నాలుగు రోజుల క్రితం పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాలలో చేర్పించారు. పెద్ద బాలుడు మునీశ్వర్ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆసుపత్రి వద్ద పెద్ద ఎత్తున ఆందోళనతో పాటు ధర్నా చేశారు. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే మా బాలుడు ప్రాణాలు కోల్పోయాడని తీవ్ర స్థాయిలో ఆస్పత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారిని సముదాయించడంతో బంధువులు ఆందోళన విర్మించారు. బాధితుల పూర్తి వివరాలు చన్వెల్లి గ్రామానికి చెందిన కురువ శ్రీనివాస్ కు ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో పెద్ద కుమారుడు మునీశ్వర్ (11) చేవెళ్ల ప్రైవేటు పాఠశాలలు ఆరో తరగతి చదువుతున్నాడు. చిన్న కుమారుడు వర్షిత్(9) అదే పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నారు. నాలుగు రోజుల క్రితం డెంగ్యూ జ్వరం రావడంతో తల్లిదండ్రులు చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఉన్న పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాలలో చేర్పించారు. నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఉదయ మునీశ్వర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో బాలుడు ఆరోగ్యంగా ఉన్నాడు. అయితే బాలుడికి సరైన వైద్యం చేయకపోవడంతో వైద్యం వికటించి మృతి చెందాడని సభ్యులు ఆరోపించారు. ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లనే బాలుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్తుల ఆసుపత్రి వైద్యులపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ముజ్రా పార్టీని భగ్నం చేసిన ఎస్ఓటి పోలీసులు

**నిందితులను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసు స్టేషన్ అప్పగింత**

**మొయినబాద్ జూలై 09 (జనం సాక్షి)**
మండలంలోని సురంగల్ గ్రామ పరిధిలోని నజీబ్ నగర్ శివారులో ఓ ఫామ్ హౌస్‌లో నగరానికి చెందిన రేహాన్ సిద్దార్థ్ చౌహాన్ అనే వ్యక్తి ఢిల్లీకి చెందిన 4 అమ్మాయిలతో ఆరుగురు యువకులతో అర్ధ నగ్న నృత్యాలతో, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని పక్కా సమాచారంతో రాజేంద్రనగర్ ఎస్ఓటి పోలీసులు బృందం సోమవారం రాత్రి 2:30 నిమిషాలకు ఫామ్ హౌస్‌పై దాడి చేయగా రెహాన్ సిద్ధాంత్‌తో కలిసి ఆరుగురు యువకులు మరియు నలుగురు యువతులు 14 మొబైల్ ఫోన్లను,మద్యం బాటిల్‌లను, ఇన్నోవా మరియు షిఫ్ట్ డిజైర్ వాహనాన్ని మొయినాబాద్ స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ పవన్ కుమార్ రెడ్డి మంగళవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ రిహాన్ సిద్ధార్థ్ చౌహాన్ భార్య ప్రైవేట్ ఆర్కె స్ట్రాలో సింగర్‌గా పనిచేస్తుండడంతో తనతోపాటు పనిచేస్తున్న మహిళా డాన్సర్లతో కలిసి ముజ్రా పార్టీ ప్లాన్ నిర్వహించారని తెలిపారు. ముజ్రా పార్టీలో అర్ధనగ్న నృత్య ప్రదర్శన చేస్తూ విటులను సెక్సువల్‌గా లోబరుచుకునే కార్యక్రమాలు జరపడంతో పక్క సమాచారంతో దాడి చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులను కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచడం జరుగుతుందని తెలిపారు.



### నగరంలో విస్తరిస్తున్న క్లౌడ్ నైన్ హాస్పిటల్స్

**ఖైరతాబాద్, జూలై 09 (జనం సాక్షి) :**
మాతాశిశు సంరక్షణ కోసం దేశంలో ఉన్న ప్రీమియం జనన కేం ద్రాల్లో ఒకటైన క్లౌడ్ నైన్ తన మూడో హాస్పిటల్‌ను కొంపల్లిలో హాస్పిటల్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిశోర్ కుమార్ ప్రారంభించినట్లు క్లౌడ్ నైన్ హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నితిన్ నాగ్ పేర్కొన్నారు. వారు మాట్లా డుతూ నగరంలో విస్తరణలో భాగంగా గత ఏడాది బంజారాహిల్స్, హైటెక్ సిటీతో పాటు ఈ ఏడాది మూడో యూనిట్‌ను ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దేశంలో 12 నగరాల్లో మొత్తం 34 హాస్పిటల్స్ నెట్‌వర్క్ తో డెడికేటెడ్ బొటిక్ ఉమెన్ అండ్ చైల్డ్ కేర్ సెంటర్ గా అవతరించిందన్నారు. గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఫెర్టిలిటీ రంగాల్లో క్లౌడ్ నైన్ ప్రత్యేకత కలిగి ఉందన్నారు.

### భార్యపై అనుమానంతో హత్య

మల్కాజిగిరి,జూలై 9 (జనంసాక్షి)



ఉద్యోగానికి వెళుతున్న భార్యపై వేరే వారితో అక్రమ సంబంధం పెట్టుకుందని భర్త అనుమానించి భార్యను హత్య చేసిన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పివిఎన్ కాలనీలో నివాసం ఉంటున్న ఆకుల రాజేందర్ (45) వృత్తి కార్ డ్రైవర్, ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.తన భార్య ఆకుల కృష్ణకుమారి (38) కాచిగూడలోని షరాఫ్ హాస్పటల్ లో స్టాఫ్ నర్స్ గా పని చేస్తుంది.ఈమెకు వేరే ఎవరితోనూ అక్రమ సంబంధం ఉందని అనుమానంతో సోమవారం రాత్రి ఆమెను భర్త విపరీతంగా కొట్టడంతో ఇంట్లో బెడ్రూంలో పడుకొని అలాగే చనిపోయింది. మృతదేహాన్ని గాంధీకి తరలించి మృతురాలు అక్క జ్యోత్స్న ఫిర్యాదు మేరకు మృతురాలి భర్తపై మర్డర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని పోలీసులు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
10 జూలై 2024

# చట్నీలో చిట్టెలుక



## విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం

- విద్యార్థులకు నాసిరకం భోజనం
- ఫుడ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- కళాశాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్
- ఘటనపై మంత్రి దామోదార ఆరా



సంగారెడ్డిప్రతినిధి, జులై 9(జనంసాక్షి)

సంగారెడ్డి జేఎన్టీయూ కాలేజీ క్యాంటిన్‌లో ఎలుక కలకలం సృష్టించింది. విద్యార్థులకు అందించే చట్నీలో ఎలుక ఈదుతూ కనిపించింది. దీంతో ఆ దృశ్యాలను వీడియోతీసిన కొందరు విద్యార్థులు సోషల్ మీడియా పోస్టు చేశారు. విద్యార్థులు తరగతి గదులకు వెళ్లేముందు క్యాంటీన్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లారు. చట్నీకోసం గిన్నెలు ఓపెన్ చేశారు. అందులో చిట్టెలుక ఈదుతూ కనిపించడంతో విద్యార్థులు ఒక్కసారిగా కంగుతిన్నారు. ఈ చట్నీ ఎలా తినాలి అంటూ క్యాంటిన్ సిబ్బందిపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం క్యాంటిన్ నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు.

### చట్నీలో ఈత కొడుతున్న ఎలుక..!



సంగారెడ్డి జిల్లా సుల్తాన్పూర్ జేఎన్టీయూ కాలేజీ క్యాంపస్ మెస్‌లోని చట్నీలో ఎలుక దర్శనమిచ్చింది. ఇది చూసిన విద్యార్థులు అందరూ షాక్‌కు గురయ్యారు. చట్నీలో ఎలుక అటు ఇటు తిరుగుతూ ఈత కొడుతున్నది. వెంటనే విద్యార్థులు వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. అయితే, ఎలుకను చూసిన విద్యార్థులు నిర్వాహకులపై ఫైర్ అయ్యారు. ఇలాంటి ఆహారాలు తింటే ఫుడ్ పాయిజన్‌కు లోనవుతామని ఆవేదన వ్యక్తంచేశారు. చట్నీపై మూతపెట్టకపోవడంతోనే ఎలుక పడిందని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వచ్ఛత లేని ఆహారం తిని విద్యార్థులు అనారోగ్య బారిన పడే అవకాశాలు ఉన్నాయని, ఈ క్రమంలోనే యాజమాన్యం నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### మంత్రి దామోదర రాజనరసింహ సీరియస్

సుల్తాన్ పూర్ జేఎన్‌టీయూ ఘటనపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ సీరియస్ అయ్యారు. వెంటనే సుల్తాన్ పూర్ జేఎన్టీయూని సందర్శించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో జిల్లా అధికార యంత్రాంగం జేఎన్టీయూ క్యాంపస్‌కు చేరుకున్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి, ఆర్డీఓ పాండు జేఎన్టీయూ క్యాంపస్‌కి వచ్చి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భోజనంలో బల్లులు, బొద్దింకలు, ఎలుకలు వస్తున్నాయని వాపోయారు. ఈ ఘటనలు కొద్దారోజులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రిన్స్‌పాల్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మాధురి క్యాంపస్ కిచెన్‌ను సందర్శించారు. కిచెన్ పరిశుభ్రంగా లేకపోవడంతో అడిషనల్ కలెక్టర్ మాధురి ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం అయితే సహించేది లేదని హెచ్చారించారు.

### శుభ్రంగా లేవు..చర్యలు తీసుకుంటాం
### జిల్లా అదనపు కలెక్టర్ మాధురి

జేఎన్‌టీయూ చిట్టెలుక ఘటన విషయాన్ని తెలుసుకున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి కళాశాలలోని హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్‌లోని పాత్రలను, పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రంగా లేకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులుగా శుభ్రం చేయకుండా పాత్రలను అలాగే ఉంచడమేంటని ఆమె కాంట్రాక్టర్‌ను నిలదీశారు. వారం రోజుల క్రితం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి జాగ్రత్తలు చెప్పినా ఎలాంటి మార్పు లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిని వెంటనే తొలగించాలని ఆమె ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఈఘటన వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట ఆర్‌డీవో పాండు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

### ఎలుక పడింది వాస్తవమే కానీ: ప్రిన్సిపాల్

ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహ స్పందించి హాస్టల్‌కు వేళ్లి పరిశీలించారు. చట్నీ పాత్రలో ఎలుక పడింది వాస్తవమేనని, కానీ విద్యార్థులు తిన్న తర్వాత కడిగేందుకు నీళ్లు పోసి ఉంచిన పాత్రలోనే ఎలుక పడిందని ఆయన సమాధానం ఇచ్చారు. అయితే ప్రిన్సిపాల్ చెప్పిన విషయం వాస్తవమా ? లేక విద్యార్థులు ఆరోపిస్తున్న విషయం నిజమైందా అన్నది ఉన్నతాధికారులు సమగ్రమైన విచారణ చేపట్టి తేల్చాల్సి ఉంది.

## టీచ్ ఫర్ చెంజ్ సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి



**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

విద్యావ్యవస్థలో మార్పు తీసుకువచ్చేందుకు టీచ్ ఫర్ చేంజ్ సంస్థ ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్నికా రెడ్డి ,సంస్థ వ్యవస్థాపకురాలు మంచు లక్ష్మి కోరారు. మంగళవారం నారాయణపేట మండలం కొల్లంపల్లి పాఠశాలలో ఆ సంస్థ ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను వారు ప్రారంబించారు. ఈ సందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ,"స్మార్ట్ క్లాస్‌రూమ్ ఇనిషియేటివ్, ఫ్లో ఫార్వర్డ్ ప్రాజెక్ట్ యువతకు నాణ్యమైన విద్య అవసరమైన ఆరోగ్య విద్యను అందించాలనే మా మిషన్‌లో గణనీయమైన పురోగతిని సూచిస్తున్నాయన్నారు. విద్యార్థులు చేయగల వాతావరణాన్ని సృష్టించడానికి మేము కట్టుబడి ఉన్నామన్నారు. విద్యాపరంగా, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందాలని కోరారు. నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక, రెడ్డి మాట్లాడుతూ స్థానిక కమ్యూనిటీపై ఈ కార్యక్రమాల ప్రభావాన్ని నొక్కిచెప్పారు. 'స్మార్ట్ క్లాస్‌రూమ్ ఇనిషియేటివ్,ఫ్లో ఫార్వర్డ్ ప్రాజెక్ట్ నిస్సందేహంగా మా ప్రాంతంలోని చాలా మంది యువకులు ,బాలికల జీవితాలపై శాశ్వత సానుకూల ప్రభావాన్ని చూపుతుందన్నారు.ఈ చొరవకు మద్దతు ఇవ్వడంతోపాటు టీచ్ ఫర్ చేంజ్ ,వేణురావు ఫౌండేషన్ చేస్తున్న పనికి మద్దతిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు రత్నాకర్ రావు,స్థానిక ప్రముఖులు, విద్యావేత్తలు సంఘం సభ్యులు చురుకుగా పాల్గొన్నారు. వీరంతా టీచ్ ఫర్ చేంజ్ మరియు వేణిరావు ఫౌండేషన్ ఈ పరివర్తనాత్మక ప్రాజెక్టులకు జీవం పోయడంలో చేసిన కృషిని ప్రశంసించారు.

## విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

- నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తా
- ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి




**నాగర్ కర్నూల్ ఆర్సీ జూలై 09(జనంసాక్షి):**

ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే రోజులలో కళాశాలకు నూతన భవనాన్ని మంజూరు చేసి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేయడంతో పాటు ప్రభుత్వ కళాశాలలో పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉచిత పుస్తకాలతో పాటు అనేక సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించిన ఎందరో విద్యార్థులు నేడు ఉన్నత శిఖరాలకు చేరుకొని రాజకీయ ఉద్యోగ రంగాలలో రాణిస్తున్నారని వారిని ఆదర్శంగా తీసుకొని విద్యను కొనసాగించాలని కోరారు. పాఠశాల కళాశాల విద్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించడం జరిగిందని. ప్రత్యేకంగా సమీక్ష సమావేశాలను ఏర్పాటు చేసి రాబోయే బడ్జెట్ సమావేశాలలో నిధులను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కళాశాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఉపాధ్యాయులు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అనసూయ ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ సీనియర్ ఆధ్యాపకులు బగవేణి నరసింహులు కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, రాజు, నిజాం తో పాటు ఆధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్పోరేట్‌కే పాలకుల వత్తాసు

- ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతివ్వడం తగదు
- వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ వర్సిటీలు
- తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు యంఏ ఖాదర్ పాష



**వనపర్తి, జూలై 09 (జనంసాక్షి):**

ఉన్న వాటికే వసతులు అంతంత మాత్రంగా ఉంటే మరో 5 ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు అనుమతి ఇస్తారట..అదే జరిగితే తెలంగాణలో పేద వర్గాలకు ఉన్నత విద్య మరింత దూరమే..ప్రభుత్వ యూనివర్సిటీల్లో అధ్వాన్న స్థితిలో హాస్టళ్ళు, పైకప్పులు, కిటికీలు, బాత్రూం డోర్లు తదితర మౌలిక వసతులు కొనసాగుతున్నాయి. మంజూరైన నిధులు విడుదల చేయని దుస్థితి. పాలకులు యూనివర్సిటీలను పట్టించుకోకపోతే ప్రభుత్వ పరంగా లభించే ఉచిత ఉన్నత విద్య భావి తరాలకు కనుమరుగు అయ్యే ప్రమాదం ఉన్నదని తెలంగాణ జన సమితి వనపర్తి జిల్లా అధ్యక్షుడు యంఏ ఖాదర్ పాష ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన కథనం ప్రకారం రాష్ట్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల స్థితిగతులు ఇలా ఉన్నాయి.

పెచ్చులూడుతున్న పైకప్పులతో అధ్వాన్నంగా హాస్టల్ భవనాలు, తరగతి గదులు, తలుపులు లేని మరుగుదొడ్లతో, అద్దాలు పగిలిన కిటికీలకు పరదాలు, ఊడిపోయిన సీలింగ్‌తో అంతంత మాత్రమైన వసతులతో తెలంగాణలో విశ్వవిద్యాలయాలు కునారిల్లు తుంటే వాటికి మరమ్మతులు చేయాలని, లేనివి సమకూర్చాలని విద్యార్థులు పెట్టే డిమాండ్లు గొంతెమ్మ కోరికలు కానేకావు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు అధ్వాన్న స్థితిలోకి నెట్టబడడం విచారకరం. ఇటీవల కాకతీయ విశ్వవిద్యాలయంలోని హాస్టల్ గదిలో సీలింగ్ ఫ్యాన్ ఊడిపడి విద్యార్థి మీద పడి గాయాల పాలైన విషయం మనందరికీ తెలుసు. ప్రభుత్వ విశ్వ విద్యాలయాలలో మౌలిక సౌకర్యాలతో పాటు ఫీజు తక్కువగా ఉండే అవకాశం ఉండడం వలన పేద విద్యార్థులు ఉన్నత స్థాయి విద్యను అభ్యసించే అవకాశం ఇప్పటివరకు ఉండేది. కానీ ఇటీవలి కాలంలో ప్రభుత్వం పరిశోధన, పీహెచ్డీ వంటి కోర్సులకు భారీగా ఫీజులు పెంచడంతో ఉచిత విద్య అందకుండా పోతున్నది. ఈ తరుణంలో రాష్ట్రంలో ఉన్నటువంటి 15 విశ్వవిద్యాలయాలు నామ మాత్రంగా మిగిలిపోగా సిబ్బంది కొరత, నిధుల లేమి, ఉన్న సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని గడ్డు పరిస్థితులు ఎదురు కావడం రాష్ట్ర ప్రగతికి ప్రతిష్టకు అవమానకరం కాక మరేమిటి?

### ఇంకా ప్రైవేటు వర్సిటీలా?

గతం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బలవంతంగా 5 ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రారంభించేందుకు అనుమతినిచ్చి ప్రైవేటుకు వత్తాసు పలికింది. అదే సందర్భంలో మరో ఐదు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలను ఆమోదించాలని గవర్నర్‌కు పంపిన బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఇటీవల ముఖ్యమంత్రి గవర్నర్‌ను కలిసిన సందర్భంగా మరో 5 ప్రైవేటు వర్సిటీలకు కూడా అనుమతించాలని కోరిన మేరకు బిల్లును ఆమోదించినట్లుగా తెలుస్తున్నది. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్నటువంటి 15 విశ్వవిద్యాయాలు ప్రభుత్వ రంగంలో అరకొర సౌకర్యాలతో పేద వర్గాలకు ఉపయోగ పడకపోగా, నాసిరకం విద్య, భోజనం అందుతూ ఉంటే , వీటిని అధిక నిధులు మంజూరు చేయడం ద్వారా బలోపేతం చేసే బదులు గత, ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రైవేటు వర్సిటీలకు అవకాశాన్ని ఇవ్వడాన్ని విద్యార్థులు, ప్రజాస్వామిక వాదులు, నిరుద్యోగులు వ్యతిరేకిస్తున్నారు.




## వరద నీటికై ముందస్తు చర్యలు

### మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాటికి శ్రీధర్

**వనపర్తి, జూలై09 (జనం సాక్షి):**

స్థానిక 30వ వార్డులోని రాజీవ్ గృహకల్ప, జంగిడి పురం, ఐజయ్య కాలనీ, న్యూటన్ కాలనీలో వరద నీటి కాలువను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ 30 వార్డ్ కౌన్సిలర్ వాకిటి శ్రీధర్ మున్సిపల్ జెసిబితో కంప చెట్లను తొలగించి పేరుకుపోయిన చెత్తను తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా వాటికి శ్రీధర్ మాట్లాడుతూ పట్టణంలో అన్ని వరద నీటి కాలువలను తీయించి ముందు జాగ్రత్త చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను కోరారు. వర్షాలు రావడంతో కాలువ నుండి ఇండ్లలోకి నీరు వచ్చే ప్రమాదాన్ని ముందే పసిగట్టి ఈ చర్యలు చేపట్టాలని కోరారు. వర్షాకాలం స్టార్ట్ అయ్యి పది రోజులైనా అధికారులు, మున్సిపల్ పాలకవర్గం నిమ్మకు నీరెత్తినట్టు ఉందని ఈ సందర్భంగా అన్నారు. ఇప్పటికైనా మేలుకొని అన్ని వరదనీటి కాలువలను శిల్టు లను తొలగించే ప్రక్రియ వేగంగా తీసుకె ళ్లాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

### మున్సిపల్ వైస్ చైర్మన్ అఖిల రాజశేఖర్ రెడ్డి

**మక్తల్ జూలై 09 (జనంసాక్షి)**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మక్తల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అఖిల రాజశేఖర్ రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం మక్తల్ కేజీబీవీ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని మొక్కలు నాటి సంరక్షించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ మేనేజర్, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఖేడ్ ఎమ్మెల్యే



**నాగల్గిద్ద జులై 09 (జనం సాక్షి)**

హైదరాబాద్‌లోని మినిస్టర్స్ కార్యాలయంలో మంగళవారం రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డిని కలిశారు. నారాయణఖేడ్ ప్రజలు బస్సులు లేక ఇబ్బంది పడుతున్నారని వెంటనే బస్సులను పెంచాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీరాలంటే కనీసం 25 నూతన బస్సులు మంజూరితో పాటు డ్రైవర్లు, కాండక్టర్ లను భర్తీ చేయాలని విన్నవించారు. మంత్రివర్యులు సానుకూలంగా స్పందించి బస్సుల ఏర్పాటు తొందరలోనే చేస్తానని, డ్రైవర్స్ కాండక్టర్లను టిఎస్ఆర్టీసీ ద్వారా పారదర్శకంగా నియామకాలు చేస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే అన్నారు.

## డయల్ 100 కాల్స్‌కి తక్షణమే స్పందించాలి



- సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- మదనాపురం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**వనపర్తి బ్యూరో జులై 09 (జనంసాక్షి)**

వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి, ఆకస్మికంగా మదనపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్‌గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, నిరంతరం 24×7 గస్తీ నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ నందు గల రికార్డులను, ఫైల్స్ ను పరిశీలించారు సీసీ టీఎన్ఎస్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు ప్రతి గ్రామంలో కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు నూతన చట్టాల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని అన్నారు ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. ప్రస్తుత రోజుల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. కావున ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని పీస్ సిబ్బంది అందరూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై ఎక్కువ దృష్టి సారించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.ఎస్ఐ శేఖరరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



## బీసీలను విస్మరిస్తే తగిన గుణపాఠం చెప్తాం

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

బీసీలను అవసరానికి వాడుకొని తర్వాత తీసి పక్కన పెట్టి అణగదొక్కాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు బీసీ సమాజం సిద్ధంగా ఉందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్ సాగర్ అన్నారు. బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను ప్రతి విషయంలో విశ్వరించిందన్నారు. కార్పొరేషన్ పదవుల్లో, మంత్రి మండలిలో, నామినేటెడ్ పదవుల్లో, పదోన్నతుల విషయంలో తీవ్ర అన్యాయానికి గురి చేస్తున్నారని, ఇలాగే భవిష్యత్తులో పునరావృతమైతే బీసీల నుంచి వ్యతిరేకతను మూటకట్టుకోవాల్సి వస్తుందన్నారు. గద్వాలలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకొని అక్కడ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచి గెలుపు దిశగా అడుగులు వేసిన బిసి బిడ్డ సరిత తిరుపతయ్యకు ఈరోజు అన్యాయానికి గురిచేశారన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పై గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఎమ్మెల్యే పేరు మీద పోస్టలను సృష్టించి మంత్రి పదవి రేసులో ఉన్న అతనికి ఇబ్బందులు కల్పించే విధంగా అగ్రవర్ణ నాయకులు తెర వెనుక కుట్రలు పన్నుతున్నార అన్నారు. ఇటువంటి సంఘటనలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో బీసీలందరూ కలిసికట్టుగా ఉంటూ భవిష్యత్తులో రెడ్డిల ఉనికిని ఈ జిల్లాలో ప్రశ్నార్ధకంగా మార్చేందుకు అందరం శాయశక్తుల పని చేయాలని శ్రీనివాస్ సాగర్ బీసీ సామాజిక వర్గాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, బీసీ సమాజ్ కో సవారి సత్యం పాల్గొన్నారు.

## ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి



**గద్వాల నడిగడ్డ జులై 9 (జనం సాక్షి)**

పిడిఎస్‌యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల డిఇఓ సూపరింటెంట్ వీర శేఖర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు హరీష్ మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ తక్షణమే విడుదల చేయాలన్నారు. 25% ఉచిత విద్యను పేద విద్యార్థులకు అందించాలని, ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని, నాణ్యమైన ఉచిత విద్య అందించాల్సిన ప్రభుత్వాలు దానికి భిన్నంగా ప్రభుత్వ నామ్స్‌కు అనుగుణంగా వసతులు లేకున్నా శ్రీ చైతన్య నారాయణ వంటి మోడల్, టెక్నో పేర్లతో గల్లిగల్లికి పుట్టగొడుగుల కార్పొరేట్లకు పర్మిషన్లు ఇస్తున్నారన్నారు. ఇదే అదునుగా చూసుకొని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులతో, తల్లితండ్రులతో ముక్కు పిండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదనారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి, ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వ విద్యపట్ల ప్రజల్లో నమ్మకం వచ్చేటట్లు ప్రభుత్వం పర్యవేక్షణ తప్పకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు నాయకులు రాజు, మురళీ, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# స్వేచ్ఛ ఎంత చిన్నదయినా



బిత్తిరి బిత్తిరి జూసుకుంటూ బస్సెక్కిందామె. సరాసరి వొచ్చి మా శ్రీమతి పక్కన కూచుంది.
బస్సు ఇంకాసేపట్లో కదిలేటట్టుంది.
నిండైన రూపం.. తెల్లని ఛాయ.. నడీడు మనిషి.. మనిషి అందంగానే ఉన్నా, జీవితంలోని సారాన్నంతా ఎవరో పీల్చేసినట్టు, ముఖంలో కళ తప్పింది. ఆమె దేనికో భయపడుతున్నట్టుగా ఉంది. అసలు ఆమె స్వభావమే అట్లాంటిదో, లేక ఏదయినా సమస్య వొచ్చిందో తెలీదు. మాటిమాటికీ కొంగుతో చెమట తుడుచుకుం టోంది. సీటుమీద కూచున్నదన్న మాటే కానీ, అసహనంగా అటూ ఇటూ కదులుతోంది. "భీతహరిణేక్షణ" అందామా
'అక్కా కొంచెం సెల్లిస్తవా మా ఇంటికి ఫోన్‌జేస్త' అంది మొహమాటపడుతూనే. మా శ్రీమతి ఇచ్చేసింది.
తాను జడ్చర్లలో ఉన్నాననీ, బస్సు బయలుదేరబోతోందనీ, ఇంటికొచ్చేసరికి రాత్రి 9.30 గంటలు గావొచ్చనీ, అవతలి వ్యక్తికి వగరుస్తూ చెబుతోంది. మాటల మధ్యన అటూ ఇటూ చూస్తూ, చెమట తుడుచుకుంటోంది. అవతలి వ్యక్తి ఫోన్లో ఆమెను తిడ్తున్నట్టుగా మాకు అర్థం కాసాగింది.
" మీ ఆయనేనా?" అంది మా శ్రీమతి.
"అవునక్కా" ఆమె కళ్ళలో నీళ్ళు.
"కోపం జేస్తున్నట్టున్నాడు" నవ్వుతూ అడిగింది.
"అవునక్కా గింత రాత్రి ఎందుకయ్యిందని తిడ్తున్నడు" అందామె ఉపోద్ఘాతంలా.
"ఆయనన్నదీ కరెక్టేగదా – కాలాలు బాగాలేవు ఇంత రాత్రిపూట ప్రయాణమెందుకూ."
"ఏం జెయ్యాలక్కా. పెండ్లిపని పెండ్లి పిల్లగాడు దగ్గరి చుట్టమాయె. బట్టలు వెట్టాలని ఇంతసేపు ఆగిన"
"ఏం పగలు వెట్టలేకపోయినవా?"
"పగలు కుదరలేదక్కా. పోచమ్మ నాగుల కాడికి పోయి వొచ్చేసరికి ఎనిమిదయ్యింది. ఎవరి సెంటిమెంట్లు వాల్లకుంటయి గదా. అప్పటికీ అందరినీ బతిమిలాడి నేనే ముందు బట్టలు వెట్టి, గిట్ల ఉర్కొస్తున్న".
"ఔను ఇందుల నీ తప్పేంలేదుగద మల్ల తిట్టు డెందుకూ?"
"గదంతే అక్కా ప్రతిదానికీ ఆయన తిట్టుడూ, మేం పడుడూ అలవాటయిపోయింది."
"అవునూ. పెండ్లన్నాక మన చేతిల ఉండదు గదా. పెండ్లల్ల కాడ, దవాఖాన్ల కాడ ఎక్వ–తక్వ అయితుంటది. ఓపిక వట్టాలె గదా""ఆయనకిదంతా పట్టదు. మనిషన్నాక టైం ప్రకారం జరగాలంటడు. ఆలస్యమయితే ఇంట్ల వంట ఎవరు జేస్తరంటడు. పిల్లల్నెవరు జూసుకుంటరంటడు. ఒక మాట గాదు. ఒక కథగాదు. మీరు నమ్ముతరో లేదో కానీ, పెండ్లయిన మొదటిరోజే నేను ఎవరిని జూసో నవ్విననని గదమాయించిండు. వానికీ, నీకూ ఏం సంబంధమని ఆరాలు దీసిండు."
"ఎప్పుడిగ ఇంతేనా?"
"అంతే. పెండ్లికి పోయిన తాన ప్రశాంతంగ ఉండనీయడు. ఫోన్లమీద ఫోన్లు. ఈయన భయానికే నేను సెల్లు గూడ దీస్కపోను."
"గిట్లుంటే బతుకెట్ల?"
"గదంతే అక్కా ఆయన్ను మనం అర్థం జేసుకోవాలె గానీ, ఆయన మనల్ని అర్థం జేసుకోడు" కండక్టర్ టికెట్ కోసమొచ్చిండు. ఆయన చిల్లర లేవన్న వాళ్ళందరితోనూ గొడవ పెట్టుకుంటున్నడు. ఈమె కొత్తూరుకు టిక్కెట్టు అడిగితే, హైద్రాబాద్‌కు టిక్కెట్టిచ్చి మాట మాత్రం చెప్పకుండా ముందుకెళ్ళిండు. అసలే రాత్రి గావడంతో, ఆమె మారుమాట్లాడకుండా ఎక్కువ డబ్బులిచ్చి టిక్కెట్టు తీసేసుకుంది. బస్సులో తమాషా సంఘటనలు జర్గుతుంటాయి. కొందరు ఎంతసేపు మాట్లాడినా పొడిపొడిగా జవాబు చెప్పి దాటేస్తుంటారు. ఇంకొందరు అడుగకపోయినా (లోపల్నుంచి తోసుకొస్తుందో, ఏమో), తమ మొత్తం జీవితం మనకు చెప్పేస్తుంటారు. ఈమె రెండో టైపు మనిషిలాగుంది. ఎందుకోగానీ, రానురాను ఆమె మీద కుతూహలం పెరగసాగింది.
"పిల్లలెంతమందమ్మా" – అడిగాను నేను.
"ముగ్గురు పిల్లలన్నా" – అందామె.
"ఏం చదువుతున్నారు".
"పెద్ద పిల్ల టీటీఈ జేస్తున్నది. చిన్నది పది చదువుతున్నది. మూడోవాడు ఎనిమిది చదువుతున్నాడు"
"మరి పిల్లలు పెద్దోల్లయిన్రు గదా. తండ్రినేమో కట్టడి జేయరా?"
"అమ్మో నాలాగ వాల్లకు కూడా తండ్రంటే చచ్చేంత భయం. ఇంటి ముందర స్కూటరాగిందంటే, ఎక్కడోల్లక్కడ గప్‌చిప్..టీవీ బంద్ వెట్టరు.. ఆటలు బంద్ వెట్టరు.. నవ్వేది బంద్ వెట్టరు.. అప్పటిదాంక సందడిసందడిగా ఉండే ఇల్లు ఒక్కసారిగ నిశ్శబ్దమయిపోతది.. సలికాలం గూడ గాలి ఉబ్బరించినట్టయితది."
"కొడ్తడా"
"మస్తుగ. చిన్న తప్పు జేస్తే పిల్లల్ని, నన్ను గొట్టికట్టే ఈరమారగొడ్తడు"
ఆమె ఆ మాటలు చెబుతుంటే, ఇబ్బందిగా అటూ ఇటూ జూసిన ఎవరి ధోరణిలో వాళ్ళున్నరు.
"అవునూ ఎవరూ అడుగరా. మీ తల్లిగారు ఏమీ అడుగరా?"
"ఆల్లమీద మన్నుయెయ్య.. ఆల్లు సక్కగుంటె, నేను గిట్లెందుకుంటుంటినక్కా. ఉంటే డబ్బన్న ఉండాలె.. లేకుంటే తల్లిగారొల్లన్నా బలంగ ఉండాలక్కా"
"మీకు తమ్ముల్లు లేరా?"
"ముగ్గురున్నరు. ఎందుకూ దండుగ. ఎవని దారి వాడు జూసుకున్నడు. ముసిల్దాన్ని ఓ రూములవడేసిన్రు. తల్లినే సక్కగ జూడని భాడుకావులు. ఇగ అక్కనేం సక్కగ జూస్తరక్కా" "ఇంతకూ మీ ఆయనేం జేస్తడు"
"కొత్తూరు ఫ్యాక్టరీల పనిజేస్తడు ఫ్యాక్టరీకి సామాను గూడ సప్లయి జేస్తడు"
"దంద పెద్దదేనన్నమాట""ఏం లాభమన్నా డబ్బున్నకాడ సుఖముండదు." రాను రాను చీకటి చిక్కనవుతోంది. బస్సులో లైట్లు తీసేశారు. బస్సులో చీకటి గమ్మినా, ఆమె మనస్సు మాత్రం మాకు అద్దంలా కనబడుతోంది. చాలా చెప్పాలనుకుంటున్నట్లుగా, ఏమీ చెప్పలేకపోతున్నట్లుగా, గొంతుకేదో అడ్డం పడుతున్నట్లుగా సతమతమవుతున్న దామె. ఊరు దగ్గరవుతున్నందుకో ఏమో ఆమె ముఖంలో ఆందోళన పెరగసాగింది. జైలును సమీపిస్తున్న ఖైదీలా ఉందామె ఆమెకు తన భర్త ఎదురుగ్గా ఉన్నట్టే భయపడసాగింది. "అక్కా.. నీ ఫోన్‌తోటి మాట్లాడినగద. మల్ల నీ ఫోన్‌కు ఆయన రింగ్ జేస్తడు ఎత్తొద్దు" అందామె హడావిడిగా. "ఎందుకూ" అంది మా శ్రీమతి.
జవాబిచ్చేలోపున సెల్ మోగింది. ఒకటిగాదు, రెండు గాదు నాల్గుసార్లు విధిలేని పరిస్థితిలో ఆమె సెల్‌ను చేతిలోకి తీసుకుంది.
"ఇగో బస్సు జర లేటయ్యేటట్లున్నది. నువ్వేమీ స్టేజికాడికి రాకు. నేనే వొస్త" అంటూ పాఠం చెప్పినట్టు చెప్పి సెల్ బంద్ జేసింది.
"అదేందమ్మా. ఆయనొచ్చి తీస్కపోతంటే వొద్దంటవేందమ్మా" కుతూహలంగా అడిగాన్నేను.
"వొస్తడన్నా. స్కూటరెక్కినకాడికెల్లి, ఇంటికి వోయిందాంక తిడ్తనే ఉంటడు. టైమంటడు నా బొందంటడు ఎవరెవరితో ఏమేం మాట్లాడినవంటడు నానెత్తిదింటడు"
"మరి ఒక్కదానివే వోతవా?" "పోత నాకేం భయంలేదు"
"చీకటుంటదిగదా"
"ఆయనకన్న గీ చీకటే నయం"
"ఓహో" "చీకటయితే ఏందక్కా చీకట్ల నడ్సుడు హాయిగుంటది. అంతా తెల్సినోల్లే గదా"
"ఓ అదా సంగతి."
"ఆయనతోటి తిట్లు దినుకుంట, గీ ఎల్తుర్ల బోవుడు కంటే, ఈ చీకట్ల ఒక్కదాన్నయినా నడ్సుడు బావుంటది. గా కొద్దిసేపయినా స్వేచ్ఛ ఉంటది. మనసు తేలిక పడ్తది. బత్కుల ఆయన లేని చోటు దేవులాడుకుంటే, ఎక్కడ దొర్కుతలేదక్కా. అప్పుడప్పుడు గిట్ల టైమ్ మిగిలిచ్చుకుంట" అంది నవ్వుతూ.
మాటల్లోనే కొత్తూరు వొచ్చేసింది. మాతో సెలవు దీస్కొని బస్సు దిగిందామె. రాత్రి చిక్కనయ్యింది. బస్‌స్టాండ్‌లో మనుష్యులు అంతగా లేరు.
ఆమె హడావిడిగా భర్త వొచ్చాడేమోనని అటూ ఇటూ జూసింది. కనబడకపోవడంతో కొండంత బరువు దిగిపోయినట్టు హాయిగా ఊపిరి పీల్చుకుంది. అటూ ఇటూ జూస్తూ హోటల్ పక్కనున్న సందుగుండా చీకట్లో కలగల్సిపోయింది. వెల్తురుని వెతుక్కుంటూ

**కైర అమృతవర్షిణి,**
**కరీంనగర్**



## ఆర్టీసీ ఆర్‌ఎంను కలిసిన టిఎంయు నాయకులు

**ఖమ్మం, (జనంసాక్షి):** ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ ను టీఎంయూ (తెలంగాణ మజ్దూర్ యూనియన్) నాయకులు మంగళవారం ఆర్‌ఎం కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంకు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఆర్‌ఎం పర్యవేక్షణలో ఆర్టీసీ లాభాల బాట పట్టాలని వారు ఆకాంక్షించారు. కార్మికుల సమస్యల పట్ల ఎల్లప్పుడూ సానుకూలంగా స్పందించి, కార్మికుల కష్టాలనుగుర్తించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. ఆర్టీసీ బలోపేతమే లక్ష్యంగా, సంస్థ అభివృద్ధికి తాము శక్తి వంచన లేకుండా పనిచేస్తామని అన్నారు. నూతన ఆర్‌ఎం ను కలిసిన వారిలో టిఎంయూ జిల్లా నాయకులు చిదిరాల శ్రీనివాస్, సత్యం, జోనల్ నాయకులు గుర్రం శ్రీనివాస్, షరీఫ్ ఖమ్మం డిపో కార్యదర్శి మెరుగు రవీంద్రనాథ్, అధ్యక్షులు వినోద్, చారి, నర్సిరెడ్డి,ఇల్లందు డిపో కమిటీ పాషా, బాబూరావు, కృష్ణయ్య, కొత్తగూడెం నుండి యాసర్ ఉన్నారు.

### కార్మిక హక్కులను తుంగలో తొక్కిన
## కేంద్ర ప్రభుత్వంపై పోరాడుదాం




- కేంద్ర ప్రభుత్వ చర్యలను ఎండగడదాం
- ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు

**శంషాబాద్, జూలై 9 (జనంసాక్షి) :** కార్మిక హక్కులను కాలరాసిన కేంద్ర ప్రభుత్వ చర్యలను ఎండగట్టాల ని ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం శంషాబాద్ పట్టణంలోని హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిదిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ బాలరాజు, పాలమాకుల జంగయ్య ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ సమావేశంలో పాల్గొన్నారు. ఏఐటీయూసీ జెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి బాలరాజు ఆవిష్కరించారు. సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను నీరుగార్చారు. కార్మికుల హక్కుల్ని లేకుండా చేశారాని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో ఆందోళన పోరాటాలు నిర్వహించాలని ఏఐటీయూసీ నాయకులకు ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల మీద ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మిక పోరాటాలు నిర్వహించాలన్నారు. ఏఐటియుసి పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ వైపు నుండి పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.
ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ మాట్లాడుతూ జిల్లాలో లక్షలాది మంది కార్మిక వర్గంని సంఘటితం చేయాల్సిన బాధ్యత జిల్లా ఏఐటీయూసీ సంఘంల పైన ఉందన్నారు. కార్మికుడికి ఏ సమస్య వచ్చినా ఏఐటియుసి సంఘం నాయకులు సభ్యులు ఆదుకోవాలన్నారు.
నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పానుగంటి పర్వతాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె రామస్వామి, జిల్లా నాయకులు దత్తు నాయక్, వనంపల్లి జైపాల్ రెడ్డి, టి నరసింహారెడ్డి, వడ్ల సత్యనారాయణ, చందు యాదవ్, హరి సింగ్ నాయక్, ఎస్ మల్లేష్ ,వెంకన్న, నర్రగిరి, రంగారెడ్డి ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అలుపెరుగని అంతరిక్ష అతివ



తారాజువ్వలా నిప్పులు కక్కుతూ అంతులేని ఉత్సాహంతో నింగిలో మెరిసిన గగనకుసుమం.... సునీత పాండ్య కృష్ణ
కలలు కనండి వినయంగా ఉండండి కష్టపడి పని చేయండి సానుకూల వ్యక్తులతో కలిసి తిరగండి కలల వెంటనే తిరగండి ఎంత జ్ఞానం సంపాదిస్తే మీ పెద్ద పెద్ద కలలను నెరవేర్చుకోవడానికి గొప్ప విషయాలను విజయాలను సాధించడానికి కావలసినంత ధైర్యాన్ని కలిగి ఉంటారు.....ఈ అద్భుత సందేశాన్ని మనకు అందించిన వారు సునీత విలియమ్స్.
సునీత పాండ్య కృష్ణ అంతరిక్షంలోకి వెళ్లిన భారత సంతతికి చెందిన రెండవ మహిళ. అపార జ్ఞానం, అంకితభావం, ఏకాగ్రత ,పోటీ తత్వం మరియు చేయూతనిచ్చే చేయగలను అనే దృఢ సంకల్పాన్ని ప్రదర్శించిన అసాధారణ మహిళ.
ప్రపంచవ్యాప్తంగా ఆరు నెలల పైగా అంతరిక్షంలో గడిపి మిలియన్ల మంది హృదయాలను దోచుకున్న అంతరిక్ష యువరాణి మొత్తం 50 గంటల 40 నిమిషాల పాటు ఏడు స్పేస్ వాక్స్ ద్వారా ఎక్స్ట్రా వెహికల్ కోసం, మహిళ కోసం ఆమె ప్రపంచ రికార్డు నెలకొల్పారు. భారతీయ అమెరికన్ వ్యోమగామి అయిన 58 ఏళ్ల విలియమ్స్ అంతరిక్ష నౌక పైలెట్ గా చేసిన మొదటి మహిళగా చరిత్ర సృష్టించారు.
1998లో అంతరిక్ష ప్రపంచంలోకి అడుగుపెట్టి ప్రస్తుతం బోయిన్ యొక్క స్టార్ లైనర్ అంతరిక్ష నౌకలో క్రూ వ్రైట్ టెస్ట్ మిషన్ కు పైలెట్ గా పని చేస్తున్నారు. NEEM 02 అన్వేషణ మిషన్లో భాగంగా ఫ్లోరిడా తీరంలో నివాస స్థలంలో ఆమె 9 రోజులు నీటి అడుగున గడిపారు. లాక్ ఆఫ్ లవ్ అనే సంస్థకు విరాళం ఇవ్వటానికి తన పొడవాటి జుట్టును కత్తించుకొని ఆ హెయిర్ పీసులు వైద్య సమస్యల కారణంగా హెయిర్ లాస్ అయిన పిల్లలకు అందించిన మానవీయమూర్తి.



2006 డిసెంబర్ 9న ఐఏఎస్ 14వ సాహస యాత్ర సాహస యాత్ర లో భాగంగా డిస్కవరీ సెటిల్ లో విలియమ్స్ మొదటిగా అంతరిక్ష ప్రవేశం చేసి ఏప్రిల్ 26 2007 వరకు గడిపారు
ఆమె మొదటి అంతరిక్ష యాత్ర డిసెంబర్ 9 2006న మొదలై ఎక్స్పెడిషన్ 14/15 జూన్ 22 2007 వరకు సాగింది దీనిపై సునీత ఫ్లైట్ ఇంజనీరింగ్ గా పనిచేశారు బోర్డులో ఉన్నప్పుడు ఆమె 29 గంటల 17 నిమిషాల పాటు నాలుగు అంతరిక్ష నడకలతో మరియు 195 రోజులు ఆడవారి కోసం ప్రపంచ రికార్డును నెలకొల్పారని నాసా తెలిపింది.
ఆమె రెండవ అంతరిక్ష యాత్ర జూలై 14 2012న ప్రారంభమై ఎక్స్పెడిషన్ 32 బై 33 నవంబర్ 18 2012 వరకు కొనసాగింది విలియమ్స్ సాహస యాత్ర 33 కోసం ఐఏఎస్ కమాండ్ తీసుకున్న రెండవ మహిళ. అదే సమయంలో నేటిక్ ట్రయథాన్‌లో పాల్గొనాలని ఈత, బైకింగ్ ,అంతరిక్షంలో పరిగెత్తడం వంటి వాటిలో పాల్గొనాలని ఆమె ఆశించారు. నాలుగు గంటల 23 నిమిషాల 10 సెకండ్లు క్లాక్ చేశారు ఒక ప్రవేశ కక్ష నుండి రేసులో పోటీ చేయటం ఇదే తొలిసారి.నాలుగు నెలలు కక్షలో ఉన్న ఈ సమయంలో ప్రయోగశాలలో పరిశోధన మరియు అన్వేషణ కొనసాగించారు ఆమె 1027 రోజులు గడిచినా అనంతరం నవంబర్ 18 2012న కజకిస్తాన్లో దిగడం జరిగింది అంతరిక్షంలో సునీత మరియు హౌస్ సైడ్ స్పేస్ సెంటర్ యొక్క సౌరశ్రేణుల నుండి శక్తిని ప్రసారం చేయడానికి మూడు అంతరిక్ష నడకలను ప్రదర్శించారు మరియు రేడియేషన్ అమ్మోనియం లీక్ లను సవరించారు.
ఆమె మూడవ అంతరిక్ష ప్రయాణం బారీ విల్మట్ తో కలిసి ప్రయాణించే వ్యోమ నౌక జూన్ 6న విజయవంతంగా స్టేషన్ చేరింది. మీరు కలిసి ప్రయాణించిన వేమనవక సాంకేతిక సమస్యల కారణం గా ఐఏఎస్ ఊహించిన దాని కంటే ఎక్కువ కాలం గడపాల్సి వస్తుందని తెలిపారు వాస్తవానికి ఎనిమిది రోజుల్లో నిర్దేశించబడిన ప్రయాణం మే 25న బయలుదేరాల్సిన ఈ వ్యూమనవక హీలియం లీక్ వల్ల ఆలస్యమై జూన్ 5న మొదలై జూన్ 6న విజయవంతంగా స్టేషన్ ను చేరింది సురక్షితంగా చేరినప్పటికిని వారి తెలుగు ప్రయాణం ప్రస్తుతం నిలిపేయాల్సి వచ్చింది. నాసా యొక్క కమర్షియల్ క్రూ ప్రోగ్రాం మేనేజర్ స్టీవ్ స్టిచ్ నాసా మా సమయాన్ని తీసుకుంటుంది మిషన్ మేనేజ్మెంట్ టైం ప్రక్రియను అనుసరిస్తుందని తెలిపారు. మీరు ఇరువురు సురక్షితంగా తిరిగి భూమిని చేరాలని కోరుకుందాం అంతరిక్ష ఎందుకంటే అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి లేకపోవడం శరీర ద్రవాలపై వినాశనాన్ని కలగజేస్తుంది సాధారణంగా గురుత్వాకర్షణ ద్రవాలను సమానంగా పంపిణీ చేస్తుంది అయినప్పటికీని మైక్రో గ్రావిటీ గ్రవాలు పైకి మారటం వల్ల మూత్రపిండాల్లో వడపోత సమస్యలు వస్తాయి దీనివల్ల డిహైడ్రేషన్ ద్రవాల సమతుల్యత మరియు విష పదార్థాల ఓవర్ లోడింగ్ వలన ఎముకలలో పెరిగిన కాలుష్యం మూత్రపిండాల్లో రాళ్లను తయారు చేస్తుంది దీని వల్ల కణజాలాలు దెబ్బతింటాయి అంతేకాదు దీర్ఘకాలిక మూత్రపిండ ప్రమాదాల రేటు పెరగవచ్చు. రేడియోధార్మికత వల్ల క్యాన్సర్ ముక్కు పెరుగుతుంది అంతేకాదు రోజుకి ఆరోగ్య పరిస్థితులు దిగజారుతాయి రోగనిరోధక శక్తి బలహీనపడి అంటువ్యాధులకు ప్రబలడానికి అవకాశం ఉంది ఇంటర్ క్రెనియల్ ప్రెషర్ వల్ల దృష్టిలోపం ఒంటరితనం నిర్బంధం వల్ల మానసిక ఆరోగ్యం కూడా భంగపరిచే అవకాశాలు ఉన్నాయని ఇంద్రప్రస్థ అపోలో ఇంటర్నేషనల్ మెడిసినల్ సీనియర్ అసిస్టెంట్ డాక్టర్ రాకేష్ తెలిపారు.
ఈ సమస్యను అధిగమించడానికి వ్యాయామం, యోగ ,స్పేస్ వాక్ మరియు కుటుంబంతో చాటింగ్ మానసిక ఆరోగ్య స్థితిని మెరుగుపరచడానికి ఎప్పటికప్పుడు నాసా వారితో కమ్యూనికేషన్ కలిగి ఉండటం వారి ఆరోగ్య నిరంతర పరిరక్షణ ద్వారా వారి ఆరోగ్యం సమతుల్యంగా ఉండవచ్చని డాక్టర్స్ తెలిపారు ఏదేమైనా ఈ ప్రతికూల ప్రతిఘటన తట్టుకొని భూమికి తక్షణం తిరిగి రావాలని కోరుకోవడం మనందరి బాధ్యత.
ఎన్నో అద్భుత విజయాలను తన జీవిత ఖాతాలో జమ వేసుకున్న సునీత విలియమ్స్ ఎన్నో సత్కారాలను మెడల్స్ ను పొందారు. అందులో కొన్ని నేవీ కమెంటేషన్ మెడల్ సేవ పథకం నాసా సేఫ్టీ ఫ్లైట్ మెడల్ 2011లో అంతరిక్ష అన్వేషణలో మెరిట్ మెడల్ (ఫ్రెష్యా ప్రభుత్వం నుంచి స్వీకరించారు 2008లో పద్మభూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం సత్కరించింది 2013లో గుజరాత్ సాంకేతిక విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ను అందించారు 2013 గోల్డెన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అనే అవార్డును స్లోవేనియా ప్రభుత్వం అందజేశారు.
మీ సాహసవంతమైన, ఉత్సాహవంతమైన, అందమైన ,ఆహ్లాదకర మైన, అద్భుతమైన మరపురాని క్షణాలతో అంతరిక్ష ప్రయాణం సాఫీగా ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా అల్లాధకరమైన వాతావరణంలో చక్కని ఆరోగ్యంతో మరెన్నో విషయాలను మూటగట్టుకుని మా అందరికీ అందజేయడానికి త్వరలో మా చెంతకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్న మీ వసుదైక కుటుంబం



**ఎన్ .సి .హెచ్ కృష్ణజ్యోతి**



జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
10 జులై 2024
తెలంగాణ

# పది లక్షల ఎకరాలకు సాగు నీరు అందించటం నా ఏకైక లక్ష్యం

## తుమ్మల నాగేశ్వరరావు



**కొత్తగూడెం, జూలై 9 (జనంసాక్షి):**
ములకలపల్లి మండలం పూసుగూడెం పంప్ హౌస్ ను మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు పంపు హౌస్ లో చేపట్టిన పనుల వివరాలను మ్యాప్ ద్వారా మంత్రికి వివరించారు. ట్రైలర్ కు సిద్ధంగా ఉన్న మోటార్లను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంపు హౌస్ లో ఏర్పాటు చేసిన మోటర్లు చైనా షాంగై కంపెనీ రూపొందించినవని, చైనా నుండి ఆ కంపెనీ ఇంజనీర్లు రావాల్సి ఉందని వచ్చిన అనంతరం పంప్ హౌస్ ట్రయల్ రన్ నిర్వహిస్తామని తెలిపారు. అతి త్వరలో చైనా ఇంజనీర్లు రావడానికి భారత ప్రభుత్వం చైనా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుగుతున్నదని తెలిపారు. పంపు హౌస్ లో ఇరిగేషన్, ఎలక్ట్రికల్ పనులు అన్ని పూర్తి అయినవి తెలిపారు. మోటర్లు చైనా వి అయినందువలన వారి ఇంజనీర్ ల సమక్షంలో ట్రయల్ రన్ పూర్తి చేసుకొని, ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆగస్టు నెలలో గోదావరి జలాలను ఏన్కూరు లింకు కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్ కు తరలించడం అనేది రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇరిగేషన్ మంత్రి యొక్క కోరిక అని ఆయన అన్నారు. కృష్ణా జలాలు అనుకున్న సమయంలో శ్రీశైలం, నాగార్జునసాగర్ కు రాకపోయినా వైరా ప్రాజెక్టు, సాగర్ ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న ఆయకట్టుతోపాటు మధ్యలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటికీ గోదావరి జలాలను పంపించాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం అని తెలిపారు. ఈ పంప్ హౌస్ లో పంపులు బిగించి నాలుగు సంవత్సరాలు పూర్తయినందువల న ఈ సంవత్సరం తప్పనిసరిగా ట్రయల్ రన్ పూర్తి చేయకపోతే పంపులకు కూడా ప్రమాదం ఉన్నదని నిపుణులు సూచించారని తెలిపారు. ట్రైలర్ త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జూలూరుపాడు టర్నల్ పూర్తి అయ్యే లోపు గోదావరి జలాలను వాడుకుంటూ పంప్ హౌస్ లను వినియోగంలోకి తీసుకురావాలని, అలాగే ఈ పంపులు చెడిపోకుండా చూసుకునే బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వం మీద ఉన్నదని ఆయన తెలిపారు. ఏన్కూరు టర్నల్, లింక్ కెనాల్ ను అత్యవసర ప్రాతిపదిక పైన ముఖ్యమంత్రి అనుమతితో ఈ నెలలో పూర్తి చేయబోతున్నామని తెలిపారు. టర్నల్ వరకు 104 కిలోమీటర్ల కెనాల్ ను 97% పూర్తి అయిందని కేవలం మూడు శాతం లైనింగ్ పనులు మాత్రమే పెండింగ్లో ఉన్నవని అవి కూడా ఈ సీజన్ తర్వాత పూర్తి చేస్తామని తెలిపారు.



గోదావరి జలాలతో ఈ మూడు పంప్ హౌస్ లను వినియోగించుకోవడంతోపాటు నాగార్జునసాగర్ ఆయకట్టు కి మీడియం ప్రాజెక్టులు అయినా వైరా లంక సాగర్ కు ఈ సంవత్సరం గోదావరి జలాలను తరలిస్తామని తెలిపారు. వచ్చే సీజన్ నాటికి యాతలకుంట టర్నల్ పనులు పూర్తి చేసి సత్తుపల్లి నియోజకవర్గంలో పాటు అశ్వరావుపేట నియోజకవర్గానికి కూడా నీరు అందిస్తామని తెలిపారు. 7800 కోట్ల రూపాయల ఖర్చుతో పంప్ హౌస్ నిర్మాణం చేపట్టామని వీటిని వినియోగం లోనికి తేవడం తో పాటు జూలూరుపాడు టర్నల్ పనులు పూర్తి చేసి గోదావరి జలాలను పాలేరు కు చేరుస్తామని తెలిపారు. అక్కడ మున్నేరు మీద ఆకేరు మీద టర్నల్ పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. అత్యవసరం అయినా జూలూరుపాడు టర్నల్ పనులు పూర్తి చేయాలని, పది కిలోమీటర్ల ఫారెస్ట్ అనుమతి తెచ్చుకోవాలని ఆయన తెలిపారు. ఆనాడు 13,500 కోట్లతో పనులు మొదలు పెట్టామని ఇప్పటివరకు 7800 కోట్లు ఖర్చు చేశామని ఆ మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఈ పంప్ హౌస్ లను వినియోగించుకొని ఖమ్మం జిల్లాలో సుమారు 7 లక్షల ఎకరాలకు, నాగార్జునసాగర్ ఆయకట్టు మూడు లక్షల ఎకరాలకు మొత్తం పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించటమే నా లక్ష్యం ప్రజల కోరిక అని మంత్రి తెలిపారు. ఇల్లందు నియోజకవర్గానికి కూడా గోళ్ళ పాడు నుంచి నీరు అందించడం సాధ్యం కాలేదని, అటవీ అనుమతులు లభించకపోవడం వలన సాధ్యపడలేదని తెలిపారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గోదావరి జలాలను ఇల్లందు నియోజకవర్గానికి తరలిస్తామని ఆయన అన్నారు. గోదావరి పై భాగంలో ఉన్నటువంటి ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా భద్రాచలం నియోజకవర్గానికి తాలిపేరు ప్రాజెక్టు ఉన్నప్పటికీ దుమ్ముగూడెం మండలంలోని 30 వేల ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉన్నదని దీనిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. దీని ద్వారా అన్ని నియోజకవర్గాలకు నియోజకవర్గానికి కొత్తగా లక్ష ఎకరాల చొప్పున సేద్యం లోనికి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. తాగునీటి పథకానికి కూడా వైరా ప్రాజెక్టు, పాలేరు ప్రాజెక్టు ఉన్నందువల్ల సాగర్ నీరు రాకపోయినా గోదావరి జలాలతో త్రాగునీరు సాగునీరు ఆ గోదావరి తల్లి ద్వారా తీర్చుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇంజనీర్ పెద్దారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల లోనే ఈ మూడు పంప్ హౌస్ ల ట్రయల్ రన్ పూర్తి చేస్తామని దీని కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న అధికారులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ ఏ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్ శ్రీనివాస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే సురేష్ కుమార్ ఇతర ఇంజనీరింగ్ విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు స్టేజ్ 2 పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులతో సమీక్ష

**ఖమ్మం బ్యూరో, జూలై 9(జనంసాక్షి)**
సీతారామ ప్రాజెక్టు స్టేజ్ 2 పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్టు, ఎన్ఎస్పీ లింక్ కెనాల్ కు ఎంజాయ్ మెంట్ సర్వే పూర్తయి, ఎక్జిక్యూటివ్ పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. ప్రాజెక్టు పూర్తికి మిగిలిన భూ సేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇంకనూ భూసేకరణ చేయాల్సిన రైతులతో సంధి చర్చలు జరపాలన్నారు. కాల్వ ఏర్పాటుతో రైతుల భూముల విలువ పెరుగుతుందని అవగాహన కల్పించాలన్నారు. 75 శాతం కంటే ఎక్కువ భూమిని కోల్పోతున్న రైతులు, సాగుకు మిగులు భూమి అక్కరకు రాకపోతే, అట్టి భూమిని సేకరణ చేయాలన్నారు. భూసేకరణ లో భూములతో పాటు, నిర్మాణాలు, పైప్ లైన్ లు, షెడ్లు, చెట్లు తదితర అన్నిటి విలువ చూపాలన్నారు. భూములు ఇచ్చిన రైతులకు గిరి వికాసం తదితర ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత నివ్వనున్నట్లు ఆయన అన్నారు. కాల్వ



నిర్మాణంలో వున్న గ్యాస్ పైప్ లైన్ దగ్గర కాల్వ ఏర్పాటుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంబంధిత గ్యాస్ కంపెనీ ఇంజనీర్ల సహకారం తీసుకొని, బాక్స్ టన్నెల్ నిర్మాణం చేయాలన్నారు. పనుల్లో వేగం పెంచి, నిర్ణీత సమయంలోగా ప్రాజెక్టు పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమీక్షలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, ఇర్రిగేషన్ ఇఇ అర్జున్, జిల్లా ఉద్యానవన అధికారి వెంకట రమణ, కలెక్టరేట్ భూసేకరణ సూపరింటెండెంట్ మీనన్, ఏన్కూరు తహశీల్దార్ శేషగిరిరావు, ఉద్యానవన అధికారి వేణు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

## భట్టి, కోమటి రెడ్డి, తుమ్మలతో కలిసి ఐడిఓసిలో

## రైతు భరోసా జిల్లాస్థాయి వర్క్ షాప్ కు హాజరు



**ఖమ్మం బ్యూరొ, జులై9(జనంసాక్షి)**
తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో బుధవారం పర్యటించనున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఉదయం 10:30 గంటలకు రఘునాథపాలెం మండలం వీ.వెంకటాయపాలెంలోని ఐడిఓసిలో జరిగే రైతు భరోసా జిల్లా స్థాయి వర్క్ షాప్ నకు హాజరవుతారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3:30 గంటలకు కూసుమంచి మండలం పోచారంలో గ్రామపంచాయతీ నూతన భవనాన్ని మంత్రి పొంగులేటి ప్రారంభిస్తారని తెలిపారు. సాయంత్రం 4గంటలకు నాయకన్ గూడెంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఆ తర్వాత సాయంత్రం 4:30 గంటలకు ఈశ్వర మాదారంలో హై లెవెల్ బ్రిడ్జి, సాయంత్రం 5:30 గంటలకు తిరుమలాయపాలెం మండలం రాకాసి తండాలో హై లెవెల్ బ్రిడ్జి, చెక్ డ్యాములను మంత్రి పొంగులేటి ప్రారంభిస్తారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# మహిళలను వేధిస్తే చర్యలు తప్పవు

## మహిళలకు అండగా జిల్లా పోలీస్

## మహిళా పోలీస్ స్టేషన్,షి టీం పోలీస్ స్టేషన్,భరోసా కేంద్రాన్ని సందర్శించి పరిశీలించిన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్

**నల్గొండటౌన్, జులై 09 (జనంసాక్షి):**
నల్లగొండ మహిళా పోలీస్ స్టేషన్, షి టీం పోలీస్ స్టేషన్, భరోసా సెంటర్ లను పరిశీలించి, షి టీమ్ బృందాల పనితీరు,పోలీస్ స్టేషన్ పరిసరాలు, లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కేంద్రంలో కల్పించే న్యాయ సలహాలు,సైకలాజికల్ కౌన్సెలింగ్, వైద్య పరంగా తీసుకుంటున్న భద్రతా చర్యలు, మహిళల వేధింపులపై నమోదు అవుతున్న కేసుల వివరాలు తదితర విషయాలు అడిగి తెలుసుకుని, అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని మహిళలకు ఎలాంటి ఆపద వచ్చిన వెంటనే స్పందిస్తూ పోలీస్ శాఖ రక్షణ కల్పిస్తుందని, ఎవరైనా ఆకతాయిలు మహిళలను వేధిస్తే చర్యలు తప్పవు జిల్లా యస్పి అన్నారు. జిల్లాలో షి టీమ్ బృందాలు జిల్లా వ్యాప్తంగా జన సమూహాలు ఎక్కువగా ఉండే ప్రాంతాలతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కళాశాలలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ ఇలా ప్రతి చోటా డేగ కళ్లతో పర్యవేక్షణ చేస్తూ లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్ మొదలు ప్రతి అంశంలో మహిళలకు ధైర్యాన్ని కల్పిస్తూ నిరంతరం ముందుకు సాగుతూన్నాయని అన్నారు. నల్లగొండ షీ టీమ్స్ బృందాలు రక్షణ కల్పించే విషయంలోనే కాదు మహిళలు నేరుగా పోలీస్ స్టేషన్లకు రావాల్సిన అవసరం లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించు కుంటూ డయల్ 100 ద్వారా, పోలీస్ శాఖ విడుదల చేసిన క్యూ.ఆర్ కోడ్ స్కానింగ్ పద్ధతిలో, వాట్స్ అప్ లాంటి సామాజిక






మాధ్యమాల ద్వారా పిర్యాదు చేసే అవకాశాన్ని మహిళలకు కల్పించి నిరంతరం షీ టీమ్స్ వారి వెన్నంటి నిలిచేలా ముందుకు సాగుతున్నాయి అన్నారు. మహిళా సమస్యలపై పిర్యాదు చేయడానికి సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు నల్లగొండ జిల్లా షీ టీమ్ నెంబర్-8712670235 జిల్లా ఎస్పీ 8712670200, షీ టీమ్ ఇంచార్జి సీఐ కరుణాకర్ 8712670143,మిర్యాలగూడ ఇంచార్జ్ యస్.ఐ కోటేష 8096004465 నెంబర్లకు నేరుగా పిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పి వెంట ఉమెన్ పీఎస్ సీఐ కరుణాకర్, యస్.ఐలు సిబ్బంది ఉన్నారు.

# కాంట్రాక్టు కార్మికులు హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి..

## జి .యం జాన్ ఆనంద్ వెల్లడి..



**ఇల్లందు, (జనంసాక్షి) :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు సింగరేణి సంస్థ లో పనిచేసే కాంటాక్ట్ కార్మికులు హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో కాంట్రాక్టు కార్మికులకు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పేరిట హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు తో సింగరేణి సంస్థ ఫిబ్రవరి 26.2024వ తేదీన ఒప్పందం చేసుకుందని, ఒప్పందం ఈ ప్రకారం ప్రతి కాంట్రాక్టు కార్మికుడు జీరో అకౌంట్ తో ఖాతా పెరుచుకోవాలని, దీనివలన కాంట్రాక్టు కార్మికుడు డ్యూటీ లో గాని బయట గాని చనిపోతే వారి కుటుంబానికి ఇన్సూరెన్స్ డబ్బులు 20 లక్షలు ఇవ్వబడునని, ఆ కార్మికుడు డెబిట్ కార్డు 6 నెలలో ఒకసారి స్వైపింగ్ చేసి ఉపయోగించినట్లయితే ఆ కుటుంబాలకు అదనంగా 10 లక్షలు ఇవ్వబడునని, ఆ కార్మికుని కుటుంబంలో 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎవరైనా ఉండి చదువుకున్నట్లయితే వారికి 4 లక్షల ఇవ్వబడునని తెలిపారు. కాబట్టి ఈ బ్యాంకులో సింగరేణి ఇల్లందు ఏరియా లోని అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు ఖాతా నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ ఖాతా తెలుచుకొనుటకు ఆధార్ కార్డు జిరాక్స్, పాన్ కార్డు జిరాక్స్, ఒక ఫోటో అవసరం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజియం(పర్సనల్ ) జి.వి. మోహన్ రావు, డిజియం(సివిల్) రవికుమార్, ఫైనాన్సు మేనేజర్ మధుబాబు,బ్యాంకు అధికారులు రహీం పాషా, లక్ష్మీనారాయణ, రవి, సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్, కాంట్రాక్టర్లు పాల్గొనారు.

# పనులు పారదర్శకంగా ఉండాలి

## పిల్లలకు మెరుగైన విద్యాబోధన అందించాలి

## కేసారం డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పరిశీలన

## జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
కేసారం ఫేస్ 2 రెండు పడక గదుల ఇండ్లలో సీసీ రోడ్లు, సంప్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కేసారం మొదటి, రెండో ఫేస్ రెండు పడక గదుల ఇండ్లను, ప్రైమరీ పాఠశాల, సూర్యాపేట లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్, జడ్పి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కేసారం ఫేస్ 1 రెండు పడక గదుల ఇండ్లతో పాటు ఫేస్ 2 లోని సంప్, సిసి రోడ్ల పనులను పరిశీలించి పనులు నాణ్యతతో ఉండాలని, పనులు వేగవంతం చేయాలని సూచించారు. రెండు పడక గదుల ఇండ్లకు విద్యుత్ కనెక్షన్లను త్వరలో చేపట్టాలని, వాటర్ లైన్, శానిటరీ పనులు సక్రమంగా మొదలు పెట్టనందున ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసారంలోని ప్రైమరీ, సూర్యాపేటలోని జడ్పి ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున పిల్లలకు మెరుగైన విద్యా బోధన అందించాలని సూచించారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లల ప్రవేశాలు, హాజరు శాతం ఎక్కువగా ఉండాలని పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణి వివరాలు తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలకు మైనర్ పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. తదుపరి ఫేస్ 2 రెండు పడక గదుల ఇండ్ల పనులపై ఆర్డిఓ, ఆర్అండ్ బి ఇంజనీరింగ్ అధికారులతో పనులపై సమీక్షించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి..

## అటకెక్కినఫీజులు నియంత్రణ చట్టం

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి


**ఖమ్మం అర్బన్,జులై 9 (జనంసాక్షి):**
గుర్తింపు లేని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో అడ్మిషన్ ముసుగులో ఫీజులు మోత మోగిస్తున్నాయని,ప్రభుత్వ పాఠశాల,కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ ని తక్షణ విడుదల చేయాలని మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని. ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థుల ఆందోళన తీవ్రతరం కావడంతో కాస్త ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ. ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పర్మిషన్స్ లేకుండానే అడ్మిషన్ చేస్తూ కోట్ల రూపాయలను దండుకుంటున్నాయి అని ఆయన విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు మోతలు మోగిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి ఆ పాఠశాలలో పై చర్యలు తీసుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల పట్ల అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఆయన అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించడంలో ప్రభుత్వం గానీ సంబంధిత అధికారులు గానీ దొంద వైఖరిని ప్రదర్శిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను సంతలో సరుకుగా మార్చేశాయని,ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఆయా మార్కెట్ కేంద్రాలుగా తలపిస్తున్నాయని అన్నారు. విద్యను పూర్తిగా వ్యాపార పరం చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి ఆయా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

# 40 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత..

**పాలకీడు (జనంసాక్షి ):**
అక్రమంగా తరలిస్తున్న 40 కింట్వాల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ లక్ష్మీ నరసయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం బొలెరో వాహనంలో కోమటి కుంట నుండి జాన్ పహాడ్ మీదుగా మునగ నరసయ్య (32) అను వ్యక్తి దాచేపల్లి కి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



# ఆగని నల్ల మట్టి అక్రమ దందా



**నేరేడుచర్ల,(జనంసాక్షి) :**
మండలంలో దిర్శించర్ల గ్రామ ఉర చెరువు సారవంతమైన నల్ల మట్టిని ఇటుక బట్టీల యాజమాన్యం అక్రమంగా తరలించుకొని పోతుంటే నీటిపారుదల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు చోద్యం చూస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పొలాలకు తోలుకోవలసిన సారవంతమైన నల్ల మట్టిని ఇటుక బట్టీల యాజమాన్యం అక్రమంగా తరలిస్తున్నారని నీటిపారుదల శాఖ డిఇ అమరందర్ రెడ్డి కి ఫిర్యాదు చేయగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారని రైతులు తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇటుక బట్టీల యాజమాన్యం అడ్డు అదుపు లేకుండా వేలాది ట్రక్కుల నల్ల మట్టిని డంపింగ్ చేస్తున్నారని రైతులు విచారం వ్యక్తం చేశారు. ఇటుక బట్టీల యాజమాన్యం అధికారులు, రాజకీయ నాయకులకు ముడుపులు ముట్టజెప్పి వారి అండదండలతోనే నల్ల మట్టి అక్రమ దందా సాగిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నల్ల మట్టి అక్రమ దందాకు సహకరిస్తున్న అధికారులు, నాయకులపై చర్యలు తీసుకోవాలని రైతులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.






## రాణించిన సూచీలు.. మరోసారి సరికొత్త గరిష్ఠాలకు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో సరికొత్త గరిష్ఠాలను నమోదు చేశాయి.ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, విదేశీ మదుపర్ల కొనుగోళ్లతో మార్కెట్‌లో ఉత్సాహం నెలకొంది. ముఖ్యంగా బ్లూచిప్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలను నడిపించింది. దీంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ 80,397.17, నిఫ్టీ 24,433.20 వద్ద జీవనకాల గరిష్ఠాలను తాకాయి.
సెన్సెక్స్ ఉదయం 80,107.21 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,960.38) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. చివరికి 391.26 పాయింట్ల లాభంతో 80,351.64 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 112.65 పాయింట్ల లాభంతో 24,433.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.49గా ఉంది. సెన్సెక్స్‌లో మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ, సన్‌ఫార్మా, టైటాన్ షేర్లు రాణించాయి. రిలయన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ రకం బ్యారెల్ చమురు ధర 85.47, బంగారం ఔన్సు ధర 2370 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.



# ఆన్‌లైన్‌లో ఇన్‌స్టంట్ లోన్..

### ఈ అంశాలు పరిశీలించాల్సిందే..!



ఒకప్పటితో పోలిస్తే రుణాల లభ్యత బాగా పెరిగింది. ప్రముఖ బ్యాంకులు, ప్రైవేట్ రుణ సంస్థలే కాకుండా ఆన్‌లైన్‌లో అనేక యాప్‌లు రుణాలను విరివిగా ఇస్తున్నాయి. కేవలం కొన్ని క్లిక్‌లతో రుణం లభించడం ఈ రుణ యాప్‌లతో సాధ్యమవుతోంది. అయితే, వేగంగా రుణం పొందాలనుకునేవారు ఇలాంటి రుణాలను ఆశ్రయిస్తున్నప్పటికీ, కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసుకోకపోతే ఆర్థిక సమస్యలు ఎదరవుతాయి. వాటి గురించి తెలుసుకుందాం.

**రుణ సంస్థ విశ్వసనీయత**
డబ్బుకు సంబంధించిన విషయానికొస్తే.. రుణ సంస్థకు సంబంధించిన విశ్వ సనీయత ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. సాధారణంగా రుణ సంస్థలు రుణం తీసు కునేవారి విశ్వనీయతను అంచనా వేస్తాయి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో రుణం తీసు కునేవారు కూడా.. తాము ఎంచుకున్న ప్లాట్‌ఫామ్ కూడా విశ్వసనీయమైనదని, ని యంత్రణ ప్రమాణా లకు అనుగుణంగా ఉందని నిర్ధరించుకోవాలి. కస్టమర్ రేటిం గ్స్‌ను తనిఖీ చేయడం ద్వారా రుణ సంస్థకు సంబంధించిన పేరు ప్రఖ్యాతలను పరిశోధించాలి. ఇన్‌స్టంట్ లోన్ యాప్.. పబ్లిక్ కోసం కాబట్టి, దీన్ని వెబ్‌సైట్స్, యాప్ స్టోర్‌ల ద్వారా డౌన్‌లోన్ చేసుకోవడానికి అందుబాటులో ఉంటుంది. ఇలాంటి యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేయడం సురక్షితం.

**యాప్ ప్రామాణికత**
మీరు ఇన్‌స్టంట్ లోన్ యాప్ ద్వారా త్వరితరుణం తీసుకునే ముందు తప్పనిసరిగా యాప్ ప్రామాణికతను ధ్రువీకరించాలి. యాప్ లేదా దాని కంపెనీకి ఆఫ్‌లైన్ చిరునామా, వెబ్‌సైట్ ఉందని నిర్ధరించుకోవాలి. చట్టబద్ధమైన సంస్థలు సాధారణంగా వారి పేరు, ఫోన్ నంబర్, భౌతిక చిరునామా, ఇ-మెయిల్స్‌ను పారదర్శకత కోసం వారి వెబ్‌సైట్‌లో తెలుపుతారు. లోన్ యాప్‌నకు సంబంధించిన మాతృ సంస్థను పరిశోధించడం, యాప్‌నకు లింక్ అయిన విశ్వసనీయ అధికారిక వెబ్‌సైట్ ఉందని నిర్ధరించుకోవడం మేలు. రుణ యాప్‌కు వెబ్‌సైట్ లేకపోతే స్కామ్ పొంచి ఉందని అనుమానించాలి. మరీ ముఖ్యంగా రుణ సంస్థ.. ఆర్‌బీఐలో రిజిస్టర్ అయ్యిందో లేదో తనిఖీ చేయాలి.

**నిబంధనలు, షరతులు**
ఆన్‌లైన్ యాప్స్‌కు సంబంధించిన రుణాల నిబంధనలు, షరతులు సాధారణ బ్యాంకులు, ఆర్థిక సంస్థల కంటే భిన్నంగా ఉండొచ్చు. ఎందుకంటే కొన్ని యాప్‌లు ఆర్‌బీఐ నిబంధనలు, పరిధిలో ఉండవు. కాబట్టి మీరు ఒక ఈఎంఐని కోల్పోయినా.. ఈ యాప్‌ల రికవరీ ప్రక్రియ సాధారణ బ్యాంకుల కంటే భిన్నంగా ఉంటుంది. ఇది భవిష్యత్తులో మీ సిబిల్ స్కోర్, క్రెడిట్ యోగ్యతను ప్రభావితం చేస్తుంది. కాబట్టి ఇన్‌స్టెంట్ లోన్ పొందే ముందు రుణానికి సంబంధించిన నిబంధనలు, షరతులను పూర్తిగా అర్థం చేసుకోవడానికి కొద్దిగా సమయాన్ని వెచ్చించండి. వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులు, ఆలస్య చెల్లింపు రుసుములు, ముందస్తు చెల్లింపు ఛార్జీలు, జీఎస్‌టీ, ఇంకా వర్తించే ఏవైనా ఇతర ఛార్జీలపై శ్రద్ధ వహించాలి. దీనివల్ల రుణానికి సంబంధించిన మొత్తం ఖర్చులు ఎన్ని ఉంటాయో, ఎలాంటివి ఉంటాయో తెలుస్తాయి.

**వడ్డీ రేట్లు**
ఏదైనా రుణ ఒప్పందంలో వడ్డీ రేట్లు కీలకమైన అంశం. ఈ వ్యక్తిగత రుణ వడ్డీ రేట్లు రుణ సంస్థకు, రుణ సంస్థకు మధ్య మారొచ్చు. ఇన్‌స్టంట్ లోన్ వేగంగా లభించినప్పటికీ సంప్రదాయ రుణాలతో పోలిస్తే వడ్డీ రేట్లు అధికంగా ఉంటాయి. కాబట్టి, వివిధ రుణ సంస్థల వడ్డీ రేట్లను సరిపోల్చండి. పోలిక సౌలభ్యం కోసం ప్రధాన ఆర్థిక సంస్థల వడ్డీ రేట్లను ఒకే చోట జాబితా చేసే ఆర్థిక వెబ్‌సైట్‌లు కూడా ఉన్నాయి. దరఖాస్తుదారులు మార్కెట్‌పై సమగ్ర సర్వే నిర్వహించి, అత్యంత ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో కూడిన రుణ సంస్థను ఎంచుకోవాలి.

**రుణం, తిరిగి చెల్లింపులు**
రుణ మొత్తాన్ని నిర్ణయించే ముందు మీ ఆర్థిక అవసరాలను నిష్పక్షపాతంగా అంచనా వేయండి. అవసరానికి మించి రుణం తీసుకోవడం వల్ల తిరిగి చెల్లించేటప్పుడు అనవసర భారం పడుతుంది. మీ ఈఎంఐ మొత్తం నెలవారీ ఆదాయంలో 40 శాతాన్ని మించకూడదు. అదేవిధంగా, తిరిగి చెల్లింపు నిబంధనలను జాగ్రత్తగా అంచనా వేయండి. తక్షణ రుణాల తిరిగి చెల్లింపులు తరచుగా తక్కువ కాలవ్యవధితో వస్తాయి. ఇలా తిరిగి చెల్లింపుల ప్రణాళికకు కట్టుబడి ఉండే ముందు మీ నెలవారీ బడ్జెట్, ఆర్థిక స్థిరత్వంపై ప్రభావాన్ని అర్థం చేసుకోండి. కొన్ని రుణ సంస్థలు.. రుణగ్రహీత నిజంగా ఆర్థిక ఇబ్బందులు గురయినప్పుడు, రుణ పునర్నిర్మాణం లేదా కాలవ్యవధి పొడిగింపులు వంటి ఎంపికలను అందించవచ్చు. లేదా డిఫాల్ట్ అయినప్పుడు జరిమానాలు విధించొచ్చు. ఇలాంటి పరిణామాలను రుణ దరఖాస్తుదారులు ముందుగానే తెలుసుకుని సిద్ధంగా ఉండాలి.

**కస్టమర్ సర్వీస్**
ఏదైనా ఆర్థికపరమైన విషయాల్లో సంబంధాలు ఏర్పరచుకునేముందు ఆయా సంస్థలు వినియోగదారులకు ఎలాంటి సర్వీసులు అందిస్తున్నాయో తెలుసుకోవాలి. ఆన్‌లైన్‌లో రుణం తీసుకునేటప్పుడు ఈ విషయంలో మరింత అప్రమత్తతగా ఉండాలి. ప్రశ్నలు, సమస్యలను వెంటనే పరిష్కరించడానికి స్పందించే రుణ వేదికను ఎంచుకోండి. రుణ సంస్థ నుంచి చాట్, ఫోన్, ఇ-మెయిల్ ద్వారా వినియోగదారుడికి త్వరితగతిన సేవలు లభించినప్పుడు రుణగ్రహీతకు విలువైన సమయం వృథా కాకుండా ఉంటుంది. పరిష్కారం కూడా వెంటనే లభిస్తుంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.03 | ₹ 5.32 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹67,100 (22 క్యారెట్లు) | ₹73,200 (24 క్యారెట్లు) |
|---|---|

చెన్నై

| ₹67,700 (22 క్యారెట్లు) | ₹ 73,850 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్
₹ 99,000

## హైబ్రిడ్ వాహనాలపై ఆ రాష్ట్రం గుడ్ న్యూస్.. రోడ్డు ట్యాక్స్ మాఫీ




పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించే దిశగా ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే వాహనదారులకు శుభవార్త చెప్పింది. హైబ్రిడ్ ఎలక్ట్రిక్ కార్లు , ప్లగ్-ఇన్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాలపై రహదారి పన్నును పూర్తిగా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. పెట్రోల్, డీజిల్ కార్ల వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని తగ్గించడంతో పాటు హరిత వాహనాల కొనుగోలును ప్రోత్సహిం చాలనే లక్ష్యంతో ఈ కొత్త పాలసీని తీసుకొస్తున్నట్లు యూపీ సర్కారు వెల్లడించింది. రోడ్డు ట్యాక్స్ ను ఎత్తి వేయడంతో వినియోగదారులపై భారం తగ్గుతుంది. పలితంగా ఈ హైబ్రిడ్ వాహనాలకు మార్కెట్‌లో గిరాకీ పెరుగుతుందని పేర్కొంది. ఈ నిర్ణయంతో మారుతి సుజుకీ, హోండా, టయోటా విక్రయాలు పెరిగే అవకాశాలున్నాయి. ఈ సంస్థలు గ్రాండ్ విటారా, అర్బన్ క్రూజర్ హైరైడర్, ఇన్నోవా హైక్రాస్, హోండా సిటీ ఇ:హెచ్‌ఈవీ వంటి హైబ్రిడ్ కార్లను అందిస్తున్నాయి. రోడ్డు ట్యాక్స్ ను మినహాయించడంతో యూపీలో మారుతి సుజుకీ, హోండా హైబ్రిడ్ మోడళ్ల ధర రూ.1.98లక్షల నుంచి రూ.2.88లక్షల వరకు దిగిరానుంది. ఇక, టయోటా మోడళ్లపై గరిష్ఠంగా రూ.3.11లక్షల వరకు తగ్గనుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహల్ హర్షం వ్యక్తం చేశారు. "ఇది చరిత్రాత్మక నిర్ణయం. మార్కెట్లో పర్యావరణహిత వాహనాల విక్రయాలను పెంచుతుంది. ఇలాంటి సృజనాత్మక ఆలోచనలతో వాయు కాలుష్యాన్ని నివారించొచ్చు" అని ఆయన పేర్కొన్నారు. హైబ్రిడ్ కార్లపై రోడ్డు ట్యాక్స్‌ను మినహాయిస్తూ యూపీ సర్కారు తీసుకున్న నిర్ణయంతో నేటి స్టాక్ మార్కెట్లలో ఈ వాహనాల తయారీ సంస్థల షేర్లు రాణించాయి. మారుతి సుజుకీ షేరు ధర 6.52శాతం పెరిగి రూ.12,807 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో దీని షేరు ధర 7శాతానికి పైగా ఎగబాకింది.

# ప్రజలకు మేలు చేసేలా విద్యుత్ సంస్కరణలు

### టారిఫ్ తగ్గించేలా చర్యలు తీసుకుంటాం
### సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాం
### విద్యుత్ రంగాన్ని దెబ్బతీసిన గత ప్రభుత్వం
### శ్వేతపత్రం విడుదలలో సిఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి, జూలై 9 (జనంసాక్షి):**
నాణ్యమైన విద్యుత్ ఇవ్వడంతో పాటు, కోతలు లేకుండా, భారం పడకుండా విద్యుత్ సరపరా చేయడం ప్రభుత్వం ముందున్న సవాలని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఇందుకోసం ప్రయత్నిస్తున్నామని అన్నారు. ధ్వంసమైన విద్యుత్ రంగాన్ని గాడిలో పెడితేనే ఇది సాధ్యమని అనినారు. భావితరాల భవిష్యత్‌ను గత ప్రభుత్వం ఎలా దెబ్బతీసిందో చెప్పి, ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకే శ్వేతపత్రం విడుదల చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేశారు. టారిఫ్ నియంత్రణపై దృష్టి సారిస్తామని, విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టేందుకు కేంద్రం సాయం తీసుకుంటామన్నారు. ససౌరవిద్యుత్‌కు అధిక ప్రోత్సాహం ఇస్తామని అన్నారు. వ్యవసాయ పంప్‌సెట్లకు స్మార్ట్ మీటర్లపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని కూడా చెప్పారు. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలవాలని పిలుపునిచ్చాం. ప్రజలు గెలిచి మమ్మల్ని గొప్ప స్థానంలో నిలబెట్టారు. అన్ని శాఖల్లో భయంకరమైన పరిస్థితులు ఉన్నాయి. శ్వేతపత్రాల ద్వారా ప్రజలందరికీ వాస్తవాలు చెబుతున్నాం. సమర్థమైన పాలన వల్లే పేదలకు మెరుగైన ప్రయోజనాలు అందుతాయి. బాధ్యత లేని పరిపాలన వల్ల అనేక కష్టాలు ఎదురవుతాయి. గత ప్రభుత్వం ఎంత నష్టం చేసిందో ప్రజలకు చెబుతున్నాం. విద్యుత్‌తో ప్రతి ఒక్కరి జీవితం ముడిపడి ఉంది. ఐదేళ్లలో విద్యుత్ రంగాన్ని పూర్తిగా నాశనం చేశారు. అసమర్థులు పాలన చేస్తే ఏమవుతుందో ప్రజలు అర్థం చేసుకోవాలి. విద్యుత్ సంస్కరణల వల్ల నా అధికారం పోయినా దేశం బాగుపడింది. నేను తెచ్చిన సంస్కరణలు వైఎస్ హయాంలో కనిపించాయి. మా హయాంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశాం. విద్యుత్ ఛార్జీలు పెంచకుండా చర్యలు తీసుకున్నాం. 2014-19లో సౌరశక్తి, పవన విద్యుత్ ఉత్పత్తి పెంచాం. 2018 నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఏపీ ఎదిగింది. 2018-19 నాటికి 14,929 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి చేరేలా కృషి చేశాం. మా హయాంలో ట్రాన్స్‌కో, జెన్‌కోకు అవార్డులు వచ్చాయి. గత ఐదేళ్లలో ప్రజలపై రూ.32,166 కోట్ల ఛార్జీల భారం మోపారు. విద్యుత్ రంగంలో రూ.49,596 కోట్లు అప్పులు చేశారని అన్నారు. ట్రూఅప్, ఇంధన సర్‌ఛార్జి, ఎలక్ట్రిసిటీ డ్యూటీ అని రకరకాలుగా గత ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు చేసింది. గృహ వినియోదారులపై 45శాతం ఛార్జీలు పెంచారు. ఛార్జీల పెంపుతో కోటీ 53 లక్షల మంది ప్రజలు ఇబ్బంది పడ్డారు. 50 యూనిట్లు వాడిన పేదలపై వందశాతం ఛార్జీలు పెంచారు. టారిఫ్ ద్వారా రూ.16,699 కోట్లు, ట్రూ అప్ ద్వారా రూ.5,886 కోట్లు, ఇంధన ఛార్జీలు రూ.3,977 కోట్లు, ఎలక్టిస్రిటీ డ్యూటీ పేరుతో రూ.5,607 కోట్ల మేర వసూలు చేశారు. రూ.వేల కోట్ల రుణం తీసుకుని విద్యుత్ రంగంపై పెనుభారం వేశారు. ఐదేళ్లలో విద్యుత్ సంస్థల అప్పు 79శాతం మేర పెరిగింది. కొన్ని సార్లు ఉత్పత్తి నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయాలు కూడా ప్రజలపై భారం మోపాయి. కోర్టు ఆదేశంతో నిర్వహణ ఛార్జీలు రూ.9వేల కోట్లు చెల్లించారు. పవన విద్యుత్‌లో చేసుకున్న 21 ఒప్పందాలు రద్దు చేశారు. అసమర్థ పాలనతో విద్యుత్ రంగం 47,741 కోట్లు నష్ట పోయింది. విద్యుత్ రంగంలో ప్రజలకు, ప్రభుత్వానికి దాదాపు రూ.1,29,503 కోట్ల నష్టం జరిగింది. సాధ్యమైనంత త్వరగా విద్యుత్ రంగాన్ని గాడిలో పెడతాం. భవిష్యత్తులో ఈవీ వాహనాలు మరింత పెరుగుతాయి. ఈవీ వాహనాల డిమాండ్ మేరకు విద్యుత్ ఉత్పత్తి పెంచుకోవాల్సి ఉందన్నారు. థర్మల్ విద్యుత్‌ను గ్రీన్ హైడ్రోజన్‌గా మార్చేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ వస్తే మనకు అదనంగా పన్నులు వస్తాయి. రూఫ్ టాప్ సౌరశక్తి ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలపై కమిటీ నిర్ణయిస్తుంది. విద్యుత్ సరఫరాలో నష్టాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. విద్యుత్ రంగం బలోపేతానికి సాంకేతిక సాయం తీసుకుంటాం. జగన్ అహంకారం వల్ల ఒక్క పోలవరం ప్రాజెక్టులోనే 4,773 కోట్ల మేర ప్రభుత్వంపై అదనపు భారం పడింది. సెకి నుంచి కొనుగోలు చేయాల్సిన 7వేల మెగావాట్ల వల్ల ఒక్క ట్రాన్సిమిషన్ కోసమే రూ.3,850 కోట్ల నుంచి 4,350 కోట్ల వరకు అదనంగా చెల్లింపులు చేయాల్సి వచ్చింది. గత ప్రభుత్వం చేతగాని తనం వల్ల ఊహించని కోణాల్లో విద్యుత్ సంస్థలకు నష్టాలు వస్తున్నాయి. ఏపీ బెవరేజస్ కార్పొరేషన్ బాండ్లలో.. ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కోలు పెట్టుబడులు పెట్టాయంటే జగన్ ప్రభుత్వం ఎలాంటి దుష్ట ఆలోచనలు చేసిందో అర్థం అవుతోందని చంద్రబాబు వివరించారు.






# శాస్త్రసాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు

### సాంకేతికతతో పాటు సవాళ్లు వస్తున్నాయి
### సైన్స్ గ్రాడ్యుయేషన్ డేలో రాష్ట్రపతి ముర్ము

**భువనేశ్వర్, జూలై 9 (జనంసాక్షి):**
నూతన సాంకేతిక పరిణామాలు సమాజ అభ్యున్నతికి దోహదం చేస్తున్నాయని, అదే సమయంలో మానవాళికి కొత్త సవాళ్లను కూడా విసురుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ 13వ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'శాస్త్రసాంకేతిక రంగాల్లో ప్రస్తుతం విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సైన్స్ వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో, అంతే స్థాయిలో దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి. కొత్త సాంకేతికత వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. అదే సమయంలో మానవాళికి అది సరికొత్త సవాళ్లను విసురుతుంది. ఉదాహరణకు క్రిస్పార్-క్యాస్9 సాంకేతికత వల్ల మానవుల జన్యువులల్లో మార్పులు చేయడం చాలా సులభమైంది. ఎన్నో రకాల వ్యాధులను నయం చేసేందుకు సహకరించింది. అయితే, ఈ సాంకేతికత సామాజికంగా ఎన్నో రకాల సమస్యలు సృష్టించింది. అంతేకాకుండా ఇటీవల బాగా ప్రాచుర్యం పొందిన కృత్రిమమేధ వల్ల డీప్ ఫేక్ సమస్య ఎదురైంది. సాంకేతికతను సక్రమ మార్గంలో ఉపయోగించకపోతే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో ఊహించలేం' అని ద్రౌపది ముర్ము అన్నారు. సైన్స్ హేతుబద్ధతకు సంప్రదాయ విలువలను జోడిస్తూ ఎన్‌ఐఎస్‌ఈఆర్ ముందుకు వెళ్తుండటం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. తమ వృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహించడమే కాకుండా, సమాజసేవ చేయాలని విద్యార్థులకు ఆమె సూచించారు. 'జాతిపిత మహాత్మాగాంధీ ఏడు సామాజిక రుగ్మతలు ఉంటాయని విశ్వసించేవారు. అందులో 'దయలేని సైన్స్' కూడా ఒకటి. జాలి, దయ, మానవత్వం గురించి ఆలోచించకుండా సైన్స్‌ని ప్రచారం చేయడం మహా పాపం. ప్రతి ఒక్కరూ దీనిని గుర్తుంచుకోవాలి' అని హితవు పలికారు. శాస్త్రపరిజ్ఞానంపై పరిశోధనలు చేసేందుకు చాలా ఓర్పు సహనం అవసరమని, ఫలితం రాబట్టేందుకు చాలా కాలం వేచి చూడాల్సి రావొచ్చని ముర్ము అన్నారు. అందువల్ల ఎప్పుడూ నిరుత్సాహ పడకుండా లక్ష్యం దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.




జనంసాక్షి
## జాతీయం అంతర్జాతీయం



## అంబానీల ఇంట పెళ్లి భోజనాలు..

### మెనూలో ఇవి!

అపర కుబేరుడు ముకేశ్ అంబానీ ఇంట పెళ్లి వేడుక అంటే అందరికీ ఆసక్తే. పెళ్లి పత్రిక నుంచి వివాహ వేదిక, వారు ధరించే దుస్తులు, అతిథులకు వడ్డించే భోజనాలు..ఇలా అన్నీ ప్రత్యేకమే. ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ, రాధిక మర్చెంట్‌ల ,నిశ్చితార్థం మొదలు ప్రీ వెడ్డింగ్ వేడుకల వరకు ఆ ఇంట్లో జరిగే ప్రతీ కార్యక్రమం ఆకట్టుకుంటోంది. మార్చిలో నిర్వహించిన ప్రీ వెడ్డింగ్ కార్యక్రమంలో ఆహ్వానితులకు దాదాపు 2,500 రకాల వంటకాలతో విందు భోజనాలు పెట్టారు. అప్పుడే ఇన్ని రకాల వంటకాలతో భోజనాలు పెడితే.. పెళ్లికి ఇంకెన్ని రకాల వంటలు ఉంటాయోనన్న ఆసక్తి పెరుగుతోంది.జులై 12న జరగబోయే పెళ్లి భోజనాలకు సంబంధించిన మొత్తం మెనూ తెలియదు గానీ, కొంత మాత్రం బయటకి వచ్చింది. వారణాశిలో ప్రసిద్ధి చెందిన 'కాశీ చాట్ బండార్' స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఆ చాట్ బండార్ యజమానే స్వయంగా ముఖ్య అతిథులకు వడ్డించనున్నారు. టిక్కీ, టమాటా చాట్, పాలక్ చాట్, చనా కచోరి, దహీ పూరి, బనారస్ చాట్, కుల్ఫీ, ఫలూదా తదితర ఆహార పదార్థాలను అతిథుల కోసం తయారుచేయనున్నారు. వీటిని ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీయే స్వయంగా ఎంపిక చేశారట.. దీనికి తాను అంగీకరించినట్లు కేసరి తాజాగా ఓ జాతీయ మీడియాకు తెలిపారు. పారిశ్రామికవేత్త వీరెన్ మర్చెంట్ కుమార్తె రాధికతో అనంత్ అంబానీ వివాహం జులై 12న జరగనున్న సంగతి తెలిసిందే. ముంబయిలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ ఇందుకు వేదిక కానుంది. మూడు రోజుల పాటు పెళ్లి వేడుకలు జరగనున్నాయి. జులై 12న ముఖ్య ఘట్టమైన 'శుభ్ వివాహ్'తో మొదలయ్యే ఈ సెలబ్రేషన్స్.. జులై 13న 'శుభ్ ఆశీర్వాద్', జులై 14న 'మంగళ్ ఉత్సవ్'తో ముగుస్తాయి.




## ట్రిపుల్ ఐటీలో ఒకరు.. సిఓఈ మరొకరు..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సీట్లు

పెద్దపల్లి,జూలై 09(జనంసాక్షి) : పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదివిన ఇద్దరు విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి ట్రిపుల్ ఐటీ, సోషల్ వెల్ఫేర్ విద్యా సంస్థల్లో ప్రవేశం దక్కింది. 2024-25 విద్యాసం వత రానికి గాను బాసర ట్రిపుల్ ఐటీలో ఒ డుసుల రేఖ, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసి డెన్షియల్ ఎడుకేషన్ ఇన్స్టిట్యూషన్ లో సెంటర్ అఫ్ ఎక్సలెన్స్(సిఓఈ) లో కట్టెకోల శృతి సీట్లు సాధించారు. ఆయా విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన విద్యార్థినిలను మాజీ సర్పంచ్ మల్లేశం, మాజీ ఉప సర్పంచ్ రాజు, హెచ్ఎం, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, మంగళవారం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## సమస్యలు పరిష్కరించి హామీలు నెరవేర్చాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి



జమ్మికుంట, జూలై 9 (జనంసాక్షి): మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు వాగ్దానాలు నెరవేర్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేస్తూ తహసిల్దార్ కార్యాలయం ముందు మోకాళ్లపై నిరసన వ్యక్తం చేసి అనంతరం తహసిల్దార్ కు వినతి పత్రం ఇచ్చారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అశోక్, నాయకులు రాములు, సతీష్, కిషోర్, రమేష్, ఓదెలు, సదానందం, పోచయ్య, రాజు, సంపత్, పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుని పరామర్శించిన శ్రీను బాబు



కమాన్‌పూర్(జనంసాక్షి):జూలపల్లిలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెమిని గౌడ్ తండ్రి కొము రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శ్రీనుబాబు పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### విలేకరికి పరామర్శ




మంథని, (జనంసాక్షి) : సెంటనరి కాలనీలో టెన్ టీవీ రిపోర్టర్ శ్రవణ్ కు మార్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించగా కుటుంబసభ్యులను శ్రీను బాబు పరామర్శించారు. అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు బానోత్ పరంగి భర్త రాజు రోడ్డుప్రమాదంలో మరణించగా అతడి కుటుంబ సభ్యులను శ్రీనుబాబు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

సిరిసిల్ల టౌన్ జూలై 9 (జనం సాక్షి) మున్సిపల్ కార్మికులకు రావలసిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కదారి రాములు కోరారు. సిరిసిల్ల మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా మున్సిపల్ కార్మికులకు వేతనాలు అందించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అన్ని వసతులు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అజ్జువేణు తదితరులు పాల్గొన్నారు.



# మీ బాధ్యత నాదే..

- మీరు తయారు చేసిన కార్యకర్తను నేను
- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వేములవాడను అభివృద్ధి చేస్తా
- కృతజ్ఞత సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి): వేములవాడ నియోజకవర్గ ప్రజల కృతజ్ఞత సభను మంగళవారము వేములవాడలోని భీమేశ్వర గార్డెన్లో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నేను మీరు తయారు చేసిన కార్యకర్తనని,కింది స్థాయి నుండి ఎదిగిన వ్యక్తినన్నారు. మీకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని, నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించిన వేములవాడ నియోజకవర్గ ప్రజలకు,కుల సంఘాల నాయకులకు రెండు చేతులు జోడించి ధన్యవాదాలు తెలిపారు. మీకు సాయం చేయడం నేను బాధ్యతగా భావిస్తానే తప్ప ఎన్నడూ అధికారం ఉందని అహంకారంతో వ్యవహరించనన్నారు. నా బాధ్యతను ఎన్నడూ మీపై పెట్టనని,కానీ మీ బాధ్యతలను నేను మోసేందుకు సిద్ధంగా ఉంటామన్నారు.కేంద్ర మంత్రిగా ఉన్నందున వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి ఎక్కువ నిధులు తీసుకొచ్చి అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సిద్ధమని, ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామన్నారు. నరేంద్రమోదీని ప్రధానమంత్రిని చేయడంలో మీ అందరి భాగస్వామ్యం ఉందని మీరు నన్ను గెలిపిస్తే నేను మీ తరపున మోదీకి ఓటేసిన అన్నారు. మీరు భారీ మెజారిటీతో గెలిపించినందునే నన్ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బాధ్యతలు అప్పగించారన్నారు.కొన్ని పార్టీలకు బాంబు పేలుళ్లు లేవని, అర్ధరాత్రి నక్సలైట్ల హత్యల్లేవని బోర్ కొడుతోందట.అవేమీ లేకుండా చేసిన వ్యక్తి మోదీ అన్నారు. ఒకవేళ మోదీ ప్రభుత్వం లేకుంటే 370 ఆర్టికల్ రద్దు చేసే సాహసం ఎవరూ చేసేవాళ్లు కారన్నారు. మొన్నటి వరకు పార్లమెంట్ చేసే చట్టాలు జమ్మూకాశ్మీర్ లో వర్తించేవికావని,భారతీయ జెండా ఎగిరేది కాదన్నారు. ఎన్నికల తరువాత అభివృద్ధి, ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయమన్నారు. కేంద్రం వేములవాడ ఆలయాన్ని అభివృధి చేసేందుకు సానుకూలంగా ఉన్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరిం చలేదన్నారు.ఈసారి నేను కేంద్ర మంత్రినయ్యానని, వెంటనే రాజన్న ఆలయ అభివృద్ధి కోసం కేంద్ర పర్యటన, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను కలిసినని,ఆయన కూడా సానుకూలంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలోని ఎమ్మెల్యే అది శ్రీనివాస్ తో సహా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కొండగట్టు,రాజన్న ఆలయాలను అభివృద్ధి చేసి తీరుతామన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని వివిధ కుల సంఘాల నాయకులను ఆయన సన్మానించారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బిజెపి నాయకులు డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు ఎర్రం మహేష్ ,రేగుల సంతోష్ బాబు, రేగుల మల్లికార్జున్, గోపు బాలరాజు, మాజీ ఎంపీపీ బండ మల్లేశం, బుర్ర శేఖర్ గౌడ్, ఎర్రం మధు, నామాల శేఖర్ భాజపా నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయాలి

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- మురికి కాలువల్లో పిచ్చి మొక్కలను తొలగించాలి
- మున్సిపల్ చైర్పర్సన్ ఇందుప్రియ



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) మురికి కాలువలను శుభ్రం చేసి రోడ్ల కిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగిం చాలని, మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు.కామారెడ్డి పట్టణంలోని 4వ వార్డు ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ మాట్లాడుతూ,డ్రై కార్యక్రమం నిర్వహించారు.కామారెడ్డి పట్టణ ప్రజలందరూ ఎప్పటికప్పుడు ఇంటి బయట ఉండే కుండ్ల నీళ్లను పరిశుభ్రంగా ఉం చుకోవాలని కాలనీ వాసులను హెచ్చరించారు. మురికి కాలువలను రోడ్లను, పిచ్చి మొక్కలను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించడం జరిగింది, అలాగే 20వ వార్డును సైతం పరిశీలించారు. మురికి కాలువలను, రోడ్లను, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు మాస్ క్లీనింగ్ సైతం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్, పిడుగు మమత 20 వ వార్డు తయాబా సుల్తానా సలీం, కౌన్సిలర్ సాయిబాబా, పాత శివ కృష్ణమూర్తి,ఆశ వర్కర్లు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించండి

డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చందు

జమ్మికుంట(జనంసాక్షి): హుజురాబాద్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చందు జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాల వైద్యులు, సూపర్వైజర్స్ ,హెల్త్ అసిస్టెంట్ అందరికీ వర్షాకాలంలో సంభవించే సీజనల్ డిసీజెస్ మీద రివ్యూ మీటింగ్ జమ్మికుంట ఆరోగ్య ఉపకేంద్రం వన్ లో తీసుకోవడం జరిగింది.ఆయన వైద్యులకు, సిబ్బందికిపలు సూచనలు ఇవ్వడంతో పాటు వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవ గాహన కల్పించాలని వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించాలని కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ప్రజలను సూచించారు. ప్రజ లందరూ ప్రభుత్వ వైద్యాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు వైద్యులు ఫర్హాను ఉద్దీన్, కార్తీక్, మహోన్నత, సంధ్యారాణి, చందన ,అనిల్, హిమ బిందు, శంకర్ రెడ్డి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, సూ పర్వైజర్స్ అరుణ, రత్నకుమారి ,స్వరూప, సదానందం, ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సేవలకు సన్మానం

పదవీ విరమణ చేసిన సహకార సంఘం కార్యదర్శికి వీడ్కోలు

బోధన్, జులై 9 (జనంసాక్షి ) : కల్దుర్కి సహకార సంఘంలో గత 40 సంవత్సరాలుగా విధులు నిర్వహించి మంగళవారం స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన సహకార సంఘం కార్యదర్శి డి విశ్వనాథ్ ను కల్దుర్కి సహకార సంఘం చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ గింజుపల్లి శరత్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానించారు. ఈ కార్ర్యమంలో ఇన్చార్జి కార్యదర్శి శ్రీనివాస్ చారి, రమేష్ పటేల్, ప్రకాష్ పటేల్, మాధవరావు, హన్మాబాయి రాంగొండ, అంజయ్య, మక్దూంబేగ్, పర్వయ్య, డైరెక్టర్లు, నానపటల్, అశోక్ పటేల్ మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీ రాజన్న, దత్తూపటేల్, గంగాధర్, శేఖర్ రెడ్డి, బొర్ర హన్మంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మారుతి రావు పటేల్, వివిధ గ్రామాల సంఘ సభ్యులు మరియు సంఘ సిబ్బంది, పాల్గొన్నారు. అనంతరం విశ్వనాథ్ మాట్లాడుతూ, అందరి కోరిక మేరకు పదవి విరమణ చేసిన తన సహాయ సహకారాలు సహకార సంఘానికి ఎల్లప్పుడూ అందిస్తానని స్పష్టం చేశారు.



## 'ఖని' రెస్టారెంట్లలో తనిఖీలు

గోదావరిఖని, జనంసాక్షి:రామగుండం నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులు మంగళ వారం వివిధ రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించారు. కె సి ఆర్ కాలనీ కవిత థియేటర్ ప్రాంతంలో సాఫ్రాన్ మండి పేరుతో నిర్వహిస్తున్న ఒక రెస్టారెంట్ లో నిలువ ఉంచి నాణ్యతగా, పరిశుభ్రంగా లేని ఆహార పదార్థాలను గుర్తించారు. వాటిని ఉపయోగించకుండా ఫినాయిల్ పోసారు. నిర్వాహకుల నుండి ముప్పదివేల రూపాయలు జరిమానా గా వసూలు చేశారు. ఈ తనిఖీలలో హెల్త్ అసిస్టెంట్లు కిరణ్, వైకుంఠం, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## టీజీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-1 ఉచిత శిక్షణ

వార్షికాదాయం రూ.5 లక్షల్లోపు ఉండాలి. రోల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో నెలకు రూ.5000 ఉపకార వేతనం అందజేస్తారు. ఉచిత శిక్షణ హైదరాబాద్ సైదాబాద్‌లోని టీజీ బీసీ స్టడీ సర్కిల్ (రోడ్ నెం: 8, లక్ష్మీనగర్), ఖమ్మంలోని టీజీ బీసీ స్టడీ సర్కిల్‌లో అందజేస్తారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్ 040-24071188లో సంప్రదించాలి

## ప్రతీకారం తప్పదు

ప్రతీకారం తీర్చుకుంటాం. ఈ దాడి వెనక ఉన్న దుష్టశక్తులను మట్టుపెడతాం" అని కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ సోషల్ మీడియా వేదికలో పేర్కొంది.కఠువా జిల్లాలోని మారుమూల ప్రాంతం మాచేడీలో సోమవారం సైనిక వాహనంపై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు వీర మరణం పొందారు. కాల్పులు జరిపిన అనంతరం పోలీసులు, పారామిలిటరీ దళాలు దీటుగా ప్రతిస్పందించడంతో సమీపంలోని అడవిలోకి ముష్కరులు పారిపోయారు. దీంతో వారిని మట్టుపెట్టేందుకు అదనపు బలగాలు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయి. ఈ నేపథ్యంలోనే సైనికుల మరణానికి కారణమైన ఉగ్రవాదులను వదిలే ప్రసక్తే లేదని కేంద్ర రక్షణశాఖ స్పష్టం చేసింది.



# డ్రగ్స్ రహిత జిల్లాగా కరీంనగర్

- ఈ దిశగా చర్యలు చేపట్టాలి
- యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- అన్ని విద్యాసంస్థల్లో కాన్సియస్ క్లబ్బుల ఏర్పాటు
- విద్యార్థులు పెడదారి పట్టకుండా అవగాహన కల్పించండి
- డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ బ్యూరో (జనంసాక్షి) :అధికారులు, ప్రజలు అందరం కలిసి డ్రగ్స్ అనే మహమ్మారిని జిల్లా నుంచి తరిమికొడదామని కరీంనగర్ ను డ్రగ్స్ రహిత జిల్లాగా తయారు చేద్దామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో డ్రగ్స్ నియంత్రణపై ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... యువత డ్రగ్స్ , ఆల్కహాల్ ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యసనాల బారిన పడి యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సమస్య మన దాకా వస్తే గాని తెలియదని, సమస్యను మొగ్గలోనే తుంచేస్తే పరిష్కారం లభిస్తుందని తెలిపారు. డ్రగ్స్, గంజాయి బారిన విద్యార్థులు పడకుండా అవగాహన కల్పించేందుకు జిల్లాలో అన్ని విద్యాసంస్థల్లో కాన్షియస్ క్లబ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో ప్రతి క్లబ్ లో ఇద్దరు ఉపాధ్యాయులు, వాలంటీర్లు, విద్యార్థులు ఉంటారని వీరంతా చెడు వ్యసనాల బారిన పడకుండా విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. జులై నెల ఆఖరి వరకు అన్ని విద్యాసంస్థలు, హాస్టల్లల్లో కాన్సియస్ క్లబ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి ఎవరైనా విక్రయించినా, కొనుగోలు చేసిన వారు ఎక్సైజ్ తో పాటు అధికారులకు సమాచారం ఇవ్వాలని ఏమైనా వివరాలు తెలిస్తే కరీంనగర్ లోని కంట్రోల్ రూమ్ 8019263862, టీజీఎన్ఏబీ నంబర్ 8712671111 కు సమాచారం ఇవ్వాలని లక్ష్య సాధనకు విద్యార్థులు కఠోరంగా శ్రమించాలని సూచించారు.విద్యాసంస్థల్లో ఏర్పాటు చేయనున్న కాన్సియస్ క్లబ్బులకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి సుజాత, సంక్షేమ అధికారి సరస్వతి, వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పనులను వేగవంగా పూర్తి చేయాలి

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



నిజామాబాద్ బ్యూరో జూలై 09(జనంసాక్షి) : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ బడులలో కొనసాగుతున్న పనులను వేగవంతంగా చేపట్టి సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. మాక్లూర్, నందిపేట్ మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు వీలుగా చేపట్టిన పనులను పరిశీలించారు. మాక్లూర్ మండలంలోని ముల్లంగి, బొంకన్పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను, అంగన్వాడీ కేంద్రాన్ని, నందిపేట్ మండలం డీఎస్.రాజనగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను, నర్సరీని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సందర్శించారు. పాఠశాలల్లో వంట గది, వరండా, అదనపు గదులు, వాటర్ సంప్, టాయిలెట్స్ తదితర నిర్మాణాలు, మరమ్మతు పనులను పరిశీలించారు.మిషన్ భగీరథ నీరు సరఫరా జరుగు తోందా, వాటర్ సప్లై కనెక్షన్ ఉందా, నీటి సరఫరా విషయమై సర్వే బృందాలు వచ్చి వివరాలు సేకరించాయా? అని ఆరా తీశారు. మాక్లూర్, నందిపేట్ మండలాల ప్రత్యేక అధికారులు ముత్తెన్న, జగన్నాథ చారి, పంచాతీరాజ్ ఈ.ఈ భావన్న, ఎంపీడీఓ కిరణ్, ముల్లంగి గ్రామ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఉమామ తదితరులు ఉన్నారు.



## జాతీయ విద్యార్థి దినోత్సవం

సిరిసిల్ల టౌన్ జులై 9 (జనంసాక్షి) విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ పోరాడుతుందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కెం నాగరాజు అన్నారు.అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా ఎఏబీవీపీ జెండా ను ఆవిష్కరించారు, ఆయన మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జూలై 9 న 1949 నుండి విద్యార్థులకు జాతీయ భావాలు నేర్పుతూ జాతీయ పునర్నిర్మాణం కోసం పరితపించే ఏకైక సంఘం ఏబీవీపీ అని అన్నారు. నేషన్ ఫస్ట్ సెల్ఫ్ నెక్స్ట్ అనే స్లోగన్ తో ముందుకు వెళ్తూ ఎన్నెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ విద్యార్థులలో నైపుణ్యం పెంచడానికి ఎన్నెన్నో కార్యక్రమాలు ముందుకు తీసుకొస్తున్న ఏకైక సంస్థ విద్యార్థి పరిషత్అని, అదేవిధంగా తెలంగాణ ప్రాంతం లో 42 మంది విద్యార్థి పరిషత్ కార్యకర్తలు అమరులైన కూడా క్షణం క్షణం మా కణం కణం భరతమాతకే సమర్పణం అంటూ సాగే విధంగా, కళాశాలల నుండి విద్యార్థి శక్తి జాతీయ శక్తి అనే విధానంతో భారతదేశాన్ని విశ్వ గురువుగా ముందుకు తీసుకెళ్లడానికి ఏబీవీపీ పాత్ర ఎంతో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కరీంనగర్ లా ఫోరమ్ కన్వీనర్ సావనపెల్లి ప్రశాంత్, శ్రీనివాస్, మధు, ధనుష్, శ్రవణ్, గౌతమ్, వికాస్, అభి తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి విక్రేత అరెస్ట్

800 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం. గంజాయి సేవిస్తున్న నలుగురి బైండోవర్

ఆర్మూర్, జులై 9 (జనంసాక్షి):ఆర్మూర్ పరిసర ప్రాంతంలో ఎండు గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సిఐ కే.స్టీవెన్ సన్ మంగళవారం ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు.వారు తెలిపిన వివరాల ప్రకారం ఆర్మూర్ పట్టణంలోని మిస్టర్ 360 రెస్టారెంట్ పరిసర ప్రాంతాల్లో మహమ్మద్ వహీద్ అలీ తండ్రి మహమ్మద్ అలీ, పెర్కిట్ ఎండు గంజాయి విక్రయిస్తున్నాడని సమాచారం మేరకు దాడి చేసి 800 వందల గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. నిందితుడిని విచారించగా ఒక కేజీ ఎండు గంజాయిని నాందేడ్ పట్టణం నుండి కొనుగోలు చేసినట్లు చెప్పాడు.200 గ్రాముల గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయించినట్లు తెలిపారు. నిందితుడు మహమ్మద్ వహీద్ అలీని అరెస్టు చేసినట్లు చెప్పారు. అదే పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్న నలుగురు వ్యక్తులను గుర్తించి ఆర్మూర్ తాసిల్దార్ గజానన్ ముందు బైండోవర్ చేసినట్టు ఆయా శాఖ బాధ్యుడు తెలిపారు.ఈ దాడిలో ఎక్సైజ్ శాఖ పోలీసులు కే ధర్మేందర్, సందీప్, వికాస్ గౌడ్, నరేష్, సాయిబాబా తదితరులు ఉన్నారు.

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం

## తొలి లబ్ది పొందిన కొత్తపల్లి వాసులు



కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి) :ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రంలోనే ప్రప్రదమంగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలానికి సంబంధించిన మహిళలు లబ్ది పొందారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఈ పథకం యొక్క వివరాలను పూర్తిగా తెలియజేస్తూ మాట్లాడారు. ముఖ్యంగా పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం చెప్పిన అంశాలను పద్ధతి ప్రకారం అమలు చేసి లబ్దిదారులలో మోదీ ప్రభుత్వం పైవిశ్వాసాన్నిపెంచింది. మొదటిసారిగా ప్రవేశపెట్టిన ఈ పథకం పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగిందని మొదట సిఎస్సి కేంద్రంలో దరఖాస్తు తో ప్రారంభం అయి గ్రామ పంచాయితీ కార్యదర్శి ద్వారా స్థానికతను ధ్రువీకరించే ప్రక్రియ కూడా ఆన్లైన్ లోనే సాగిందన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో చిన్న , సూక్ష్మ తరహా పరిశ్రమల శాఖ అధికారులు దరఖాస్తును పరిశీలించిన అనంతరం రాష్ట్ర స్థాయి స్క్రూటీనైజింగ్ కమిటీ ఆమోదం పొందుతుందని రాష్ట్ర స్థాయిలో ఆమోదం పొందిన లబ్దిదారులకు జిల్లాలోని 3 శిక్షణా కేంద్రాలలో ఎదో ఒక శిక్షణ కేంద్రంను ఆన్లైన్లో లో ఎంపిక చేసుకొని 5 రోజులపాటు శిక్షణ పొందాలని శిక్షణ పూర్తి అయిన ప్రతీ లబ్దిదారుకి 4000 రూ. లు వారి ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి 15,000 విలువ కలిగిన పనిముట్లకు సంబంధించిన ఈ వౌచర్ ను ప్రభుత్వం అందిస్తుందని ఇట్టి ఈ వౌచర్ ను కొరియర్ లో వచ్చే పనిముట్లను పొందే సమయంలో వారికి చూపించవలసి ఉంటుందని తుది దశకు చేరుకున్న లబ్దిదారులకు సిబిల్ స్కోర్ , బ్యాంకు వారి నియమాలను అనుసరించి మొదటి విడత ఆర్థిక సహాయం క్రింద రూ.1.లక్ష రుణాన్ని మంజూరు చేస్తారని అన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోనే తొలిలబ్ది కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం పలు గ్రామాల ప్రజలు ఎంపికయ్యారు. సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కి, బిజెపి ప్రభుత్వానికి లబ్ధిదారులు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.సిఎస్ సి విఎల్ ఈ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు వేముల అనిల్ కుమార్ మాట్లాడుతూ... పీఎం విశ్వకర్మ లబ్దిదారులకు అడుగడుగునా సాంకేతికంగా సహాయకారిగా నిలిచిన జిల్లా వ్యాప్తంగా ఉన్న సిఎస్ సి ఆపరేటర్లకు ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.ఈ పథకం నిరంతర ప్రక్రియల కొనసాగుతుందని, రెండవ విడతక్రింద అర్హులైన వారందరూ జిల్లా వ్యాప్తంగా ఉన్న సిఎస్ సి కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

## 14 ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేసిన పతంజలి

ఆ ఉత్పత్తులను వెనక్కి తీసుకోవాలని దేశవ్యాప్తంగా ఉన్న తమ ఫ్రాంచైజీ స్టోర్లకు సూచించామని తెలిపింది. అలాగే వాటికి సంబంధించిన ప్రకటనలను ఉపసంహరించు కోవాలని మీడియా సంస్థలకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో పతంజలి ఆయుర్వేద సంస్థ సుప్రీంకోర్టు విచారణను ఎదుర్కొంటోంది. దానిలోభాగంగా తప్పుదోవ పట్టించేలా వాణిజ్య ప్రకటనలు ఇచ్చారని దానిలోభాగంగా తప్పుదోవ పట్టించేలా వాణిజ్య ప్రకటనలు ఇచ్చారని నిర్ధరణ అయిన నేపథ్యంలో పతంజలిపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సంస్థకు చెందిన 14 రకాల ఉత్పత్తులు, అనుబంధ విభాగం దివ్య ఫార్మసీ ఉత్పత్తుల తయారీ లైసెన్సును రద్దు చేసింది. ఈ క్రమంలోనే ఆయుర్వేద సంస్థ నుంచి స్పందన వచ్చింది.

# విడాకులకే సిద్ధమయ్యారు

## హార్దిక్, నటాషా మధ్య గత కొన్ని రోజులుగా విభేదాలు

భారత క్రికెటర్ హార్దిక్ పాండ్యా, అతని భార్య నటాషా స్టాంకోవిచ్ మధ్య గత కొన్ని రోజులుగా విభేదాలు నడుస్తున్నట్లు వినిపిస్తున్నాయి. ఇప్పుడు దీనికి సంబంధించి ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. నివేదికల ప్రకారం, హార్దిక్, నటాషాల మధ్య విభేదాలు వీడటం లేదని, ఇద్దరూ సరిదిద్దుకోవడంలో లేదంటూ, వీరిద్దరి కామన్ ఫ్రెండ్ ఈ కీలక విషయాన్ని బయటపెట్టాడు. గత కొన్ని రోజులుగా హార్దిక్, నటాషా మధ్య విడాకుల పుకార్లు తెగ వినిపిస్తున్నాయి. ఇటీవల హార్దిక్ పాండ్యా అద్భుత ప్రదర్శన చేసి టీ20 ప్రపంచకప్‌ను భారత్‌కు అందించినప్పుడు, నటాషా స్టాంకోవిచ్ దానిపై స్పందించలేదు. ఆమె సోషల్ మీడియాలో ఎలాంటి పోస్ట్‌ను పంచుకోలేదు లేదా టి 20 ప్రపంచ కప్ కోసం వెస్టిండీస్ లేదా యుఎస్ఎకు ఆమె వెళ్లలేదు. ప్రపంచ కప్ ట్రోఫీని గెలిచిన తర్వాత హార్దిక్ పాండ్యా ఇంటికి తిరిగి వచ్చినప్పుడు కూడా, నటాషాతో అతని ఫొటో కనిపించలేదు. హార్దిక్ తన కొడుకుతో ఉన్న ఫొటోను పంచుకున్నాడు. కానీ, అతని భార్యతో ఒక్క వీడియో లేదా ఫొటో కూడా కనిపించలేదు. అనంత్ అంబానీ వివాహ వేడుకకు హార్దిక్ పాండ్యా ఒంటరిగా వెళ్లాడు. 'హార్దిక్, నటాషాలు ఒకరినొకరు అర్థం చేసుకునే మూడ్‌లో లేరు' దీంతో హార్దిక్, నటాషా మధ్య బాగా లేదని అభిమానులు భావిస్తున్నారు. టైమ్స్ నౌ ప్రకారం, హార్దిక్, నటాషా ప్యాచ్ అప్ మూడ్‌లో లేరని, బ్రేక్ అప్‌కే వారు సిద్ధంగా ఉన్నట్లు వారిద్దరి సన్నిహితుడు చెప్పాడు. నివేదికల ప్రకారం, హార్దిక్ చేసిన కొన్ని తప్పులకు నటాషా కోపంగా ఉందంట. వాటిని సరిదిద్దుకోవడానికి హార్దిక్ ఇష్టపడడం లేదంట. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదంటూ వాళ్ల ఫ్రెండ్ చెప్పినట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యా ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను పంచుకున్న సంగతి తెలిసిందే. ఈ వీడియోలో, అతను వన్డే ప్రపంచ కప్‌లో గాయపడటం నుంచి ఐపిఎల్‌లో ఫ్లాప్ కావడం, ఆ తర్వాత బలమైన పునరాగమనం చేయడం, టీ20 ప్రపంచ కప్ 2024 ట్రోఫీని గెలుచుకోవడం వరకు ఫొటోలను పంచుకున్నాడు. దీనిపై అభిమానులు చాలా పాజిటివ్‌గా స్పందిస్తున్నారు.



## టీమిండియా కోచ్ అధికారిక ప్రకటన ఆలస్యమయ్యేనా?

టీమిండియా హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవీకాలం టీ20 ప్రపంచకప్ 2024తో ముగిసింది. వాస్తవానికి గత సెప్టెంబర్‌లోనే ద్రవిడ్ పదవి కాలం ముగియగా.. కెప్టెన్ రోహిత్ శర్మ విజ్ఞప్తితో టీ20 ప్రపంచకప్ వరకు కొనసాగాడు. ఇక త్వరలోనే కొత్త హెడ్ కోచ్‌ను బీసీసీఐ నియమించనుంది. జులై చివరలో శ్రీలంకతో ప్రారంభమయ్యే టీ20, వన్డేల సిరీస్‌లకు కొత్త కోచ్ అందుబాటులో ఉంటాడని ఇప్పటికే బీసీసీఐ కార్యదర్శి జై షా స్పష్టం చేశారు. టీమిండియా కోచ్ కోసం ఇప్పటికే ఇంటర్వ్యూ ప్రాసెస్ పూర్తయింది. ఇంటర్వ్యూ కోసం భారత మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్‌తో పాటుగా భారత మహిళా జట్టు కోచ్‌గా పనిచేసిన డబ్ల్యూవీ రామన్ కూడా హాజరయ్యారు. అయితే బీసీసీఐ గంభీర్ వైపే మొగ్గుచూపిందని తెలుస్తోంది. త్వరలోనే గంభీర్‌ను హెడ్ కోచ్‌గా నియమిస్తారని సోషల్ మీడియాలో వార్తలొస్తున్నాయి.

## మరోసారి పతాకధారిగా పీవీ సింధు!



భారత స్టార్ షట్లర్ పీవీ సింధు మరోసారి ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌లో పతాకధారిగా వ్యవహరించను న్నారు. వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన తెలుగమ్మాయి సింధు.. పారిస్ ఒలింపిక్స్‌లో త్రివర్ణ పతాకాన్ని చేబూని భారత బృందాన్ని నడిపించనున్నారు. రియో ఒలింపిక్స్‌లో రజతం, టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలను సింధు గెలిచిన విషయం తెలిసిందే. పురుషుల తరఫున టేబుల్ టెన్నిస్ ప్లేయర్ శరత్ కమల్ పతాకధారిగా వ్యవహరించనున్నారు. హైదరాబాదీ మాజీ షూటర్, లండన్ ఒలింపిక్స్ కాంస్య విజేత గగన్ నారంగ్ పారిస్ ఒలింపిక్స్‌లో భారత బృందానికి చెఫ్ డి మిషన్‌గా వ్యవహరించనున్నారు. చెఫ్ డి మిషన్‌గా బాక్సింగ్ దిగ్గజం మేరీ కోమ్ ఎంపిక కాగా.. ఆమె వ్యక్తిగత కారణాలతో తప్పుకోవడంతో గగన్‌కు అవకాశం వచ్చింది. 'మేరీ కోమ్ స్థానంలో ఒలింపిక్ పతకం గెలిచిన యువ అథ్లెట్ కోసం చూస్తుండగా.. గగన్ పేరును మా సహచరులు సూచించారు. మేరీకి గగన్ సరైన ప్రత్యామ్నాయం. ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన ఏకైక మహిళా అథ్లెట్ సింధు, దిగ్గజ టీటీ ప్లేయర్ శరత్ కమల్ పారిస్‌లో పతాకధారులుగా వ్యవహరిస్తారు'అని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష తెలిపారు.

# రోహిత్‌కు షాకిచ్చిన బుమ్రా

జూన్ 29న టీమిండియా టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకున్న సంగతి తెలిసిందే. భారత్ విజయంలో ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో బూమ్ బూమ్ బుమ్రాకు ఐసీసీ నుంచి అద్భుతమైన రిటర్న్ గిఫ్ట్ దక్కింది. బుమ్రా జూన్ 2024 కోసం ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును అందుకున్నాడు. ఈ అవార్డు కోసం బుమ్రా టీమిండియా సారథి రోహిత్ శర్మ, ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన రహ్మానుల్లా గుర్బాజ్‌లతో పోటీ పడ్డాడు. వీరిద్దరిని అధిగమించిన బుమ్రా ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. 30 ఏళ్ల టీమిండియా పేసర్..యూఎస్‌ఏ, కరేబియన్‌లలో 8.26 సగటుతో 15 వికెట్లు పడగొట్టి, 4.17 ఎకానమీ రేటుతో అత్యుత్తమ బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. పురుషుల టి20 ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డులో విరాట్ కోహ్లీ (రెండుసార్లు విజేత)తో కలిసి భారత ఆటగాడిగా చేరాడు. "జూన్ నెలలో ఐసీసీ పురుషుల ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా ఎంపికైనందుకు నేను సంతోషిస్తున్నాను. యూఎస్ఏ, వెస్టిండీస్‌లో గడిపిన కొన్ని వారాల చిరస్మరణీయమైన రోజుల తర్వాత ఇది నాకు ప్రత్యేక గౌరవం. టోర్నమెంట్‌లో మేం బాగా ఆడడం, చివర్లో ట్రోఫీని ఎత్తడం చాలా ప్రత్యేకమైనది, నేను ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ నాతో ఉంచుకుంటాను' అంటూ చెప్పుకొచ్చాడు. ఇక మహిళల విభాగంలో టీమిండియా స్టార్ ప్లేయర్ స్మృతి మంధాన జూన్ నెలకుగానూ ఐసీసీ ఉమెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును గెలుచుకుంది. ఇంగ్లాండ్‌కు చెందిన మైయా బౌచియర్, శ్రీలంకకు చెందిన విష్మి గుణరత్నేలను ఓడించిన, లేడీ విరాట్ అంతర్జాతీయ కెరీర్‌లో మొదటిసారి ఈ అవార్డును దక్కించుకుంది.



# శ్రీలంకతో వన్డే సిరీస్‌కు రోహిత్ శర్మ, కోహ్లి, బుమ్రాలు దూరం

**భారత్ ప్రస్తుతం జింబాబ్వేతో టీ20 సిరీస్ ఆడుతోంది. ఆపై శ్రీలంకతో టీ20, వన్డే సిరీస్‌లు ఆడనుంది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జులై 27 నుంచి ఆరంభం కానుండగా.. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆగష్టు 2 నుంచి మొదలవనుంది. శ్రీలంకతో వన్డే సిరీస్‌కు ముగ్గురు స్టార్ ప్లేయర్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్ప్రీత్ బుమ్రాలు దూరంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని నెలలుగా విరామం లేకుండా క్రికెట్ ఆడుతుండడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. రోహిత్ శర్మ 2023 డిసెంబరు నుంచి ఆరు నెలలుగా మ్యాచ్‌లు ఆడుతూనే ఉన్నాడు. లంకతో వన్డే సిరీస్ అనంతరం బంగ్లాదేశ్‌తో భారత్ రెండు టెస్టులు ఆడుతుంది. ఆ సిరీస్‌కు ఈ ఇద్దరు అందుబాటులోకి రానున్నారు. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ అనంతరం న్యూజిలాండ్‌తో మూడు టెస్టులు భారత్ ఆడనుంది. ఇక ఈ ఏడాది చివర్లో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియాకు వెళ్తుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023-2025 ఫైనల్ లక్ష్యంగా భారత్ బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లు రోహిత్ సేనకు కీలకం కానున్నాయి. రోహిత్ గైర్హాజరీలో కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యాలలో ఒకరు శ్రీలంక వన్డే సిరీస్‌లో జట్టును నడిపించే అవకాశముంది.**





# ఐపీఎల్ టీంకి మెంటర్‌గా రాహుల్ ద్రవిడ్

టీ 20 ప్రపంచకప్‌ని టీమిండియా గెలుచుకోవడంపై ఫ్యాన్ ఆనందంగా ఉన్నారు. అయితే, ఈ విజయం వెనక కోచ్ రాహుల్ ద్రావిడ్ ఘనతను కూడా కొనియాడుతున్నారు. ఇదిలా ఉంటే, త్వరలో కోచ్ పదవి నుంచి రాహుల్ ద్రావిడ్ దిగిపోనున్నారు. టీమిండియాకు కొత్త కోచ్ బాధ్యతలని గౌతమ్ గంభీర్ తీసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఐపీఎల్ ట్రోఫీని కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) సొంతం చేసుకోవడంతో గంభీర్ పాత్ర మరవలేనిది. ఆ టీం మెంటర్‌గా ఉంటూ కేకేఆర్ కప్ కొట్టడంతో కీలక భూమిక పోషించారు. ఇదిలా ఉంటే, గంభీర్ ఒక వేళ టీమిండియా కోచ్ బాధ్యతల్ని తీసుకుంటే, కేకేఆర్ పరిస్థితి ఏంటనే ప్రశ్న వినిపిస్తున్న నేపథ్యంలో సరికొత్త వార్త ఆ జట్టు ఫ్యాన్స్‌ని ఖుషీ చేస్తోంది. గంభీర్ నిష్క్రమిస్తే కేకేఆర్ మెంటర్ బాధ్యతల్ని తీసుకునేందుకు ఆ ఫ్రాంచైజీ ఉన్నతాధికారులు రాహుల్ ద్రావిడ్ పేరును షార్ట్ లిస్ట్ చేసినట్లు సమాచారం. ఐపీఎల్-2025 సీజన్ ముందు రాహుల్ ద్రావిడ్‌ని కేకేఆర్ కోచ్ లేదా మెంటర్‌గా తీసుకోవాలని ఆసక్తి కనబరుస్తోంది. అయితే, దీనిపై ఖచ్చితమైన చర్చ జరగలేదని తెలుస్తోంది. ఏడాదికి 10 నెలల పాటు ప్రయాణాలు చేయడం ఇష్టం లేని ద్రవిడ్ భారత్ జట్టు కోచ్‌గా కొనసాగేందుకు ఇష్టపడటం లేదు. ఐపీఎల్ విషయానికి వస్తే దీనికి రివర్స్. కేవలం ఏడాదిలో 2-3 నెలలు మాత్రమే ఫ్రాంఛైజీతో ఉండాలి. ఈ అంశం ద్రవిడ్‌కి లాభిస్తుంది. గతంలో ఐపీఎల్ జట్టు ఢిల్లీ డేర్ డెవిల్స్ ఫ్రాంచైజీకి కోచ్‌గా ఉన్నారు. ఆ తర్వాత అండర్-19, ఇండియా-ఏతో సహా భారత జూనియర్ జట్లకు కోచ్‌గా పనిచేశారు. 2021లో బెంగళూర్‌లోని నేషనల్ క్రికెట్ అకాడమి(ఎన్సీఏ) అధిపతిగా పనిచేశారు.

# మొక్కలను నాటండి పర్యావరణాన్ని కాపాడండి





## వృక్షో రక్షిత రక్షితః. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్, జూలై 9 (జనంసాక్షి):** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని, తొండపల్లి లో వన మహోత్సవం లో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మున్సిపల్ చైర్మెన్ సుష్మా రెడ్డి మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. తెలంగాణ ప్రభుత్వంలో హరితహారం అనే కార్యక్రమం నిర్వహించాం, నేడు ప్రభుత్వం తలపెట్టిన వన మహోత్స వంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. మొక్కలు నాటడం వల్ల సమాజానికి పర్యావరణానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ వన మహోత్సవంలో పాల్గొని విరిగా మొక్కలు నాటాలన్నారు. రాష్ట్రాన్ని నందనవనంగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ప్రతి పౌరుడు మొక్కలు నాటుతూ పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సైని వేధించిన తోటి పోలీస్ అధికారులను చట్టపరంగా శిక్షించాలి

- తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులును కొంకటి లక్ష్మీనారాయణ



**మొయినాబాద్, 9 జులై (జనంసాక్షి) :** సిఐ జితంత్ రెడ్డిని కఠినంగా శిక్షించాలని ఏఐఏయూఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కాదారం వినయ్, బేగరి రాజు మంగళవారం హైదరాబాద్‌లో ఎస్సీ,ఎస్టీ కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ కులానికి చెందిన అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మరణానికి కారకులైన, సీఐ జితేందర్‌రెడ్డి, తోపాటు ఐదుగురు, కానిస్టేబుళ్లపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, వారిని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. భాదితుడు ఎస్సై భార్య శ్రీరాములు కృష్ణవేణికి, ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తూ కోటి రూపాయల నష్టపరిహారం పిల్లలకు ప్రభుత్వం ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట పోలీస్ స్టేషన్‌లో, విధులు నిర్వహిస్తున్న ఎస్సీ కులానికి చెందిన, ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్, విధి నిర్వహణలో అడ్డంకులు కల్పిస్తూ శ్రీరాముల శ్రీనివాసు మరణానికి కారణమైన సిఐ, జితేందర్ రెడ్డిపై గతంలో కూడా పోలీస్ చట్టం పరమైన చర్యలు తీసుకున్నట్లు తెలుస్తుంది. సుభాని, శేఖర్ ,శివ నాగరాజు, ఉమెన్ పిసి నాగరాణిను కూడా ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ వృత్తిపరమైన పనులు చెబితే పనులు చేయకుండా సిఐ జితేందర్ రెడ్డి, కానిస్టేబుల్‌లకు సహకరించినట్లు, ఎస్సై మరణ వాంగ్మూలంలో వీడియో రికార్డు ద్వారా తెలిపినారు, సిఐ జితేందర్ రెడ్డి, ఐదుగురు కానిస్టేబుల్స్ కులం పేరుతో మానసిక వేదనకు గురిచేసి ఆయన ఆత్మహత్య చేసుకోవడా నికి కారకులైనారు, డీఎస్పీ, ఎస్పీ స్థాయి అధికారులకు కూడా ఫిర్యాదు చేసిన, పట్టించుకోకపోవడం బాధాకరం. ఈ కార్యక్రమంలో ఏఐఏయూఎస్ రాష్ట్ర కోశాధికారి ప్రమోద్ రాష్ట్ర సహాయా కార్యదర్శి అప్పలరాజు,మీడియా కార్యదర్శి యాదగిరి, పంజాగుట్ట స్టాచ్ కమిటీ అధ్యక్షులు పుణ్య భాను గేట్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు దినేష్ తదితరులు పాల్గొన్నారు

# ఇ-ఎఫ్ఐఆర్‌తో మహిళలపై జరిగే నేరాలకు అడ్డుకట్ట

- నూతన చట్టాల శ్రీకారంతో మరింత కఠినంగా చట్టాలు అమలు
- ప్రముఖ సంఘ సేవకులు వేణు




**మల్కాజిగిరి, జులై 9 (జనంసాక్షి) :** ఎలక్ట్రానిక్ ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్స్ (ఇ-ఎఫ్ఐఆర్‌లు) ద్వారా మహిళలపై నేరాలను నియంత్రించడానికి బిఎన్ఎస్ పరివర్తనాత్మక విధానాన్ని ఈ- చట్టం సహాయపడుతుందని ప్రముఖ సంఘ సేవకులు వేణు పేర్కొన్నారు. ఘోరమైన నేరాలను వేగంగా నిరోధించడంలో డిజిటల్ ప్లాట్‌ఫారమ్ తక్షణ రిపోర్టింగ్‌ను సులభతరం చేస్తుందని, సాంప్రదాయ అడ్డంకులను అధిగమించి, సకాలంలో రిపోర్టింగ్ అందజేస్తుందని పేర్కొన్నారు. హర్పాల్ సింగ్ కేసు (1981)తో సహా న్యాయపరమైన పూర్వాపరాలు, రిపోర్టింగ్ జాప్యాలను ప్రభావితం చేసే సామాజిక అంశాలను గుర్తించి ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫారమ్ బాధితులు నేరాలను నిరోధించేందుకు వివేకమంతమైన మార్గాన్ని అందజేస్తుందన్నారు.ప్రజల అవగాహన ప్రచారాలు సాంకేతిక ఆవిష్కరణలు మరియు సామాజిక అవగాహన మధ్య అంతరాన్ని తగ్గిస్తుందని తెలిపారు. ఇ-ఎఫ్ఐఆర్‌ల వినియోగాన్ని ప్రోత్సహించడానికి మరియు వాటి విశ్వసనీయత మరియు భద్రతకు సంబంధించి ఏవైనా భయాందోళనలను తొలగించడానికి సమర్థవంతమైన కమ్యూనికేషన్ అత్యంత ముఖ్యమైనదని తెలిపారు. పెళ్లి సమయంలో ఇచ్చిన హామీలు, వాగ్దానాలకు సంబంధించి న సామాజిక ఆందోళనలను ప్రత్యేకంగా పరిష్కరించడానికి బిఎన్ఎస్ క్లాజ్ 69ని పరిచయం చేసిందని అన్నారు. ఈ నిబంధన ఆధారంగా లైంగిక సంపర్క కేసులను పరిష్కరించడానికి 375 మరియు 376 వంటి విస్తృత సెక్షన్‌ల ద్వారా శారీరకంగా మహిళల్ని మోసం చేసే వ్యక్తులకు లక్ష రూపాయల వరకు జరిమానా ఉంటుందన్నారు. బిఎన్ఎస్ఎస్ యొక్క సవరించిన క్లాజ్ 193(3), సి ఆర్పిసి యొక్క సెక్షన్ 173(2)ని అమలు చేస్తుందని, చట్టాన్ని అమలు చేసేవారికి మరియు బాధితునికి మధ్య సహజీవన సంబంధాన్ని తప్పనిసరి చేస్తూ పోలీసుల విచారణ పథం గురించి ఫిర్యాదుదారుని అప్‌డేట్ చేస్తారు, సమాచారం యొక్క ఎలక్ట్రానిక్ పంపిణీ పారదర్శకతను పెంపొందించే డిజిటల్ యుగాన్ని తెలియజేస్తుందన్నారు. వ్యవస్థీకృత నేరాలు, తీవ్రవాద చర్యలు, మాదకద్రవ్యాల సంబంధిత నేరాలు, లైంగిక నేరాలు, హత్య, యాసిడ్ దాడి, మానవ అక్రమ రవాణా, రాష్ట్రానికి వ్యతిరేకంగా నేరాలు, ఆయుధాలు మరియు మందుగుండు సామగ్రిని అక్రమంగా కలిగి ఉండటం లేదా ఆర్థిక నేరాలు వంటి నేరాలకు పాల్పడితే చేతి సంకెళ్లకు సంబంధించిన ఇటువంటి నిబంధనలు ప్రస్తుతం కొన్ని రాష్ట్ర జైలు మాన్యువల్స్‌లో ఉన్నాయని తెలిపారు.



## సంబంధిత అధికారులకు ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 09 (జనంసాక్షి)

హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వనమహోత్సవం, మహిళ శక్తి క్యాంటీన్స్, ప్రజా పాలన సేవా కేంద్రాలు, అమ్మ ఆదర్శ. వ్యవసాయం, హెల్త్, ధరణి, ఉద్యోగుల బదిలీలు, తదితర అంశాలపై రాష్ట్రం లోని అన్ని జిల్లాల కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు, మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ గౌతమ్,అదనపు కలెక్టర్లు విజేందర్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో వన మహోత్సవం, ప్లాంటేషన్ మహిళా శక్తి క్యాంటీన్, వ్యవసాయం, సీజనల్ వ్యాధులు, అమ్మ ఆదర్శ పాఠశాలలు, ధరణి, పారదర్శకంగా బదిలీలు, తదితర అంశాలపై తీసుకోవలసిన చర్యల గురించి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. సంబంధిత అధికారులకు వారి వారి సంబంధించిన అంశాలలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ హరిప్రియ, డిఆర్‌డిఏ సాంబశివరావు,డీపీఓ వెంకయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రఘునాథ స్వామి, సంబధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### క్రీడలు మానసిక ఉల్లాసానికి

# శరీర ధారుడ్యానికి దోహదం

## యాచారం ఎస్ఐ వెంకట్ నారాయణ



**ఇబ్రహీంపట్నం,జులై 09(జనం సాక్షి) :** క్రీడలు మాన సిక ఉల్లాసానికి శరీర ధారుడ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయని యాచారం ఎస్ఐ వెంకట్ నారాయణ అన్నారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాలిబాల్ కిట్టు పంపిణి చేశారు. ఈసందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారు నేడు ఉన్నత మైన స్థానంలో ఉన్నారని అన్నారు. చదువుతో బాటు విద్యార్థులకు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమైనవని. అన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తించాలని అన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ఏకాగ్రతపై దృష్టిపెట్టాలని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై దృష్టి సాలించాలని అన్నారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని అన్నారు. విద్యార్థుల భవిష్తత్తిపై ఎన్నో ఆశలు పేట్టుకుని చదివిస్తారు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదువుకోని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

